మూడవ సంపుటము.] [౨౫౫౯ భాగము

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ పక్షమున సంవత్సరమునకు ఆరు భాగములు చొప్పున ప్రకటింపఁబడు గ్రంథము.

పరబ్రహ్మాత్మికాందేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్యస్తామితామేవ ♦ జ్ఞానశక్తింసరస్వతీం.

కార్యస్థానము: బెజవాడ.

విషయసూచిక.


తమ్ముడా? (పద్యములు) ౨౧౨
రాయప్రోలు సుబ్బారావుగారు.
గ్రంథాలయోద్యమము ౨౧౩
గ్రంథాలయసభలు చేయవలసినపనులు ౨౧౪
వెలిదెండ శ్రీనివాసరావుగారు.
భరతమాతృస్తవము ౨౧౬
జంధ్యాల వేంకటశివకవులు.
తృతీయగోదావరి మండలగ్రంథాలయసభ ౨౧౭
ఎవరుముద్దు? ౨౨౫
దుగ్గిరాల రాఘవచంద్రచౌదరిగారు.
నాల్గవ కృష్ణామండలగ్రంథాలయసభ ౨౨౬
ఓనల్ల మేఘమా? ౨౨౯
మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు, ఎం. ఏ.
గ్రంథాలయోద్యమము-దానిపవిత్రత ౨౨౯
కొలచల వేంకటప్పాశర్మగారు, ఎం. ఏ.
బంగాళాజాతీయగీతము ౨౩౫
నెల్లూరుమండలప్రథమగ్రంథాలయప్రతినిధులసభ ౨౩౬
శ్రీమల్లిఖార్జునగ్రంథాలయము-తుళ్ళూరు ౨౪౨
శ్రీ సత్యనారాయణ పుస్తకభాండాగారము-ధవిళేశ్వరము ౨౪౨
ధర్మార్థ కామమోక్షప్రదాయినీసమాజము - సిగడాం ౨౪౭
అక్కయ్యతో నేను ఆడుకొంటాను ౨౪౯
మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు, ఎం. ఏ.
అపూర్వనారదీయము ౨౫౦
మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు, ఎం. ఏ.
రుద్రసేనానిచరిత్రము ౨౫౪
శేషాద్రిరమణకవులు.
నవరత్నమాల ౨౫౭
చింతపెంట వేంకటరమణయ్యగారు.
అమెరికా దేశమందు భటోద్యమము ౨౫౯
భటోద్యమసంస్థాపనాచార్యుఁడు ౨౬౦
బాలభటుని యాటలు ౨౬౧
కావలి శంకరరావుగారు.
కవాతు ౨౬౪
బాలభటుని అక్షరావధానము ౨౬౬
చిత్రపటములు.
రూస్ వెల్టు ౨౫౯
బాలభటోద్యమ సంస్థాపనాచార్యుఁడు బేడెన్ పవెల్ ౨౬౦


బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు బి. కే. స్వామిచే ముద్రింపఁబడియె.

వార్షికమూల్యము. రు 3-0-0] ౧౯౧౯. [విడిభాగము వెల రు 0-౮-0.

RSVMOIA 112

## రాజపోషకులు

శ్రీ శ్రీ రాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ రాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

## పోషకులు

శ్రీ శ్రీ రాజా మోతే గంగరాజుగారు
శ్రీ శ్రీ రాజా గోవిందకృష్ణయాచేంద్రబహద్దరుగారు
శ్రీ శ్రీ రాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ రాజా చెలికాని లత్సారావుగారు
శ్రీమద్దుల రామయ్యగారికుమారుడు వేంకటచిన్నరాజు శ్రేష్ఠిగారు
చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు
బండి వేంకటకృష్ణయ్యగారు
శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొప్పిరప్పాడు
నాళం కృష్ణారావుగారు
కుప్పా శ్రీరామశర్మగారు
పొణకా పట్టాభిరామారెడ్డిగారు

## అభిమానులు

అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రైటరు
పెద్దిభొట్ల వీరయ్యగారు, బి. ఏ., బి. యల్.,
అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి. ఏ., బి. యల్.,
సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, బి. ఏ.
గూడూరి లక్ష్మణరావుగారు, బి. ఏ.
ఉద్దంకి సత్యనారాయణ శర్మగారు
బొడ్డపాటి హనుమంతరావుగారు
చట్టి నరసింహారావుగారు

## సహాయులు

తూట వేంకటరత్నం నాయుడుగారు

RSVMBI A 113

పరబ్రహ్మాత్మికాం దేవీం • భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్యస్తౌమి తామేవ • జ్ఞానశక్తిం సరస్వతీం.

మూడవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆరవ భాగము

## తమ్ముడా?

౧ శ్రీలు పొంగిన • జీవగడ్డయి
పాలు పాఱిన • భాగ్యసీమయి
వ్రాలినది యీ • భరతవర్షము
భక్తి పాడర తమ్ముడా!

౨ వేద శాఖలు • వెలసె నిచ్చట
ఆది కావ్యం • బలరె నిచ్చట
బాదరాయణ • పరమ ఋషులకు
పాదుసుమ్మిది తమ్ముడా!

౩ విపిన బంధుర • వృక్ష వాటిక
ఉపనిషన్మధు • వొలికె నిచ్చట
విపుల తత్వము • విస్తరించిన
విశ్వమణి యిదె తమ్ముడా!

౪ సూత్రయుగముల • శుద్ధ వాసన
క్షాత్రయుగముల • చండ శౌర్యము
చిత్రదాస్యము • చే చరిత్రల
చెఱిగి పోయెర తమ్ముడా!

౫ మేలి కిన్నెర • మేళవించి
రాలు కరుగగ • రాగమెత్తి
పాల తీయని • బాల భారతి
పదము పాడర తమ్ముడా!

౬ నవరసమ్ములు • నాట్య మాడగ
చివురు పలుకులు • చెవుల విందుగ
కవితలల్లిన • కాంత హృదయుల
గారవింపర తమ్ముడా!

౭ దేశ గర్వము • దీప్తి జెందగ
దేశ చరితము • తేజరిల్లగ
దేశ మరసిన • ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా!

౮ పాండవేయుల • పదును కత్తులు
మండి మెఱసిన • మహిత రణకథ
కండగల చి • క్కన్ని తెనుగుల
కలిపి పాడర తమ్ముడా!

౯ లోక మంతకు • కాక బెట్టిన
కాకతీయుల • కదన పాండితి
చీకి పోవని • చేవ మాటల
చేర్చి పాడర తమ్ముడా!

౧౦ తుంగభద్రా ♦ భంగములతో
పొంగి నింగిని ♦ పొడిచి త్రుళ్ళీ
భంగ పడని తె ♦ నుంగు వాఘుల
పాట బాడర తమ్ముడా!

౧౧ పసుపు కొంగుల ♦ ముసుగు లెడలగ
కొసలు తీర్చిన ♦ కోరకత్తుల
కసరి పోరిన ♦ గండు యోధుల
పదము బాడర తమ్ముడా!

—రాయప్రోలు సుబ్బారావు.

# గ్రంథాలయోద్యమము

గ్రంథాలయ సోదరులారా!

ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమునం దీవత్సరము మిక్కిలి పవిత్రవంతమైనది. దసరాపండుగులయందే ఆగవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభను, చెన్నపురి నగరమునందు జరుపుటకై ప్రయత్నములు విరివిగ జరుగుచున్నవి; సరస్వతీదేవి యారాధనకీ దినముల కంటె పవిత్రవంతంబగునవింకెవ్విగలవు! ఈ వత్సరమునందింకొక గొప్ప విశేషముగలదు. ఆంధ్రదేశ గ్రంథాలయ సభయొక్క యాహ్వాన సంఘమువారే, అఖిల భారతవర్ష ధర్మగ్రంథాలయ ప్రతినిధుల మహాసభనుగూడ సమకూర్పనెంచినారు. ధర్మ గ్రంథాలయోద్యమము వలన ఆంధ్రదేశమునకు సమకూరుచున్న మేళ్లను భారతవర్షమునంతకును పంచియిచ్చుటకై సంకల్పించినారు. ఈ సభయొక్క యావశ్యకతను గూర్చి పలువురు ప్రముఖులు యామోదమును దెలిపినారు. భారతవర్షముయొక్క అన్ని భాగములనుండియు ప్రతినిధు లేతెంచెదమని యుత్సాహమును జూపినారు. ఈ సభలతోబాటుగ అఖిల భారతవర్ష పత్రికా ప్రదర్శనమును గ్రంథాలయ ప్రదర్శనమునుగూడ జరుపుటకై ఏర్పాటులు జేయబడుచున్నవి.

"రాబోవుసభను ప్రభుత్వమువారు ఆశీర్వదించెదరనియు, వీలయిన యెడల దాని ఖర్చులకై కొంతవిరాళమునుగూడ నొసంగెదరనియు, మేము కోరుచున్నారము. ఆంధ్రదేశమునందీ గ్రంథాలయోద్యమ మెంత పలుకుబడిని గలిగి యున్నదియు, బరోడా రాష్ట్రము నందలి జనులయందు అసంఖ్యాకములగు గ్రంథాలయములవలన అద్భుతమగు ఎట్టిశక్తి యేర్పడినదియు, విశదమైన విషయమేను. లార్డువిల్లింగుటను ప్రభువు గారవకాశమును గలుగజేసికొని సభకువచ్చి కార్యక్రమమును ప్రారంభించుటకు తమ సమ్మతిని దెలియబరచునెడల దేశముయొక్క అన్ని భాగములనుండియు ఎక్కువమంది ప్రతినిధులు రాగలరు. గ్రంథాలయముల విషయమై వినియోగించు శ్రద్ధయందు భారతవర్షము యితరదేశములకంటె వెనుకబడి యుండజనదు. గ్రంథాలయములకు సంబంధించిన సమస్యలన్నింటినిగూర్చి యోజించుటకై, ఇంగ్లాండు దేశమునందు పునర్నిర్మాణ మంత్రివర్గమువారు, ఆక్సుపోర్డు బల్లిబల్ కాలేజీ మేష్టరుగారి అధ్యక్షతక్రింద కమిటీ నొకదానిని యేర్పరచిరి. ఆ కమిటీవారి నివేదిక మిక్కిలి మనోహరమైనట్టియు జ్ఞానబోధకమైనట్టియు విషయములను దెలుపుచున్నది. గ్రంథాలయోద్యమ వ్యాపకమునకై ప్రభుత్వమువారు చేయదగిన సహాయ స్వభావమునుగూర్చి విచారించి తెలియజేయుటకై చెన్నపురి ప్రభుత్వమువారొక కమిటీని ఏర్పరచినయెడల బాగుండును. ఈ విషయమును గూర్చి పాశ్చాత్య గ్రంథముల నేకములు గలవు. అదిగాక దేశీయానుభవముగూడ విశేషముగాగలదు. ఈ సమస్య విషయమైన వివిధావస్థలనుగూర్చి చర్చించుటకై మద్రాసునందు జరుగనున్న అఖిలభారతవర్ష ధర్మగ్రంథా

లయ సభకు ప్రతినిధులువచ్చెదరు. కావున, యీయవకాశమును వీనికొనుటకై వెంటనే యట్టి కమిటీని యేర్పరుపనగును. ఈలోపున రాబోవు సభయం దందఱును యెక్కువ శ్రద్ధవీసికొందురనియు, దానిని జయప్రదముగా కొనసాగించుటకు తమ శక్తినంతను వినియోగింతురనియు మేము విశ్వసించుచున్నారము."

అని మద్రాసునందు ప్రకటింపబడుచున్న "న్యూఇండియా" పత్రిక వ్రాయుచున్నది. కావున గ్రంథాలయ సోదరులందఱును యెక్కువమంది సభకు విచ్చేయుటకై యిప్పటినుండియు ప్రయత్నింతురుగాక.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,
అయ్యంకి వేంకట రమణయ్య.

---

# గ్రంథాలయ మహాసభలు చేయవలసిన పనులు.

మొట్టమొదట ౧౯౧౪ సం॥రం ఏప్రిల్ ౧౦వ తేదీన కృష్ణాజిల్లాలోని బెజవాడపురమున ఏర్పడిన ఈ మహాసభ ఏటేట క్రమముగా గోదావరి, నెల్లూరు, గంజాం జిల్లాలవారిచే నాహ్వానింపబడి రాజమండ్రి, నెల్లూరు, బారువ గ్రామములయందుగూడి కొన్ని తీర్మానములను గావించి, దేశమునందు గ్రంథాలయోద్యమ విషయమున మిగుల నుత్సాహము కలిగించినది. కాని మొట్టమొదట యీ మహాసభ ఏయుద్దేశముతో నెలకొల్పబడినదో ఆయుద్దేశము క్రమక్రమముగా మఱచిపోబడుచున్నట్లు కనుబడుచున్నది. మొట్టమొదట ఈ సభను స్థాపింపబూనినవారి యుద్దేశ మీతీరున తెలుపబడినది.—

"ప్రస్తుతమాంధ్రదేశమందున్న గ్రంథభాండాగారములయొక్కయు, పఠనమందిరములయొక్కయు ప్రతినిధులందఱును చేరి మహాజనసభ నొకదానిని గావించి, భాండాగారములయొక్క నిర్మాణమును గూర్చి చర్చించి, ప్రస్తుతమందున్నవి నశింపకుండుటకును, నూతనములైన వానిని ఏర్పాటుచేయుటకును ప్రయత్నించుట యత్యంతావశ్యకమని తోచుచున్నది. ఆమహాజన సభవలన వివిధ సంఘములకు సోదరభావము కలుగుటయేగాక, పరస్పరము సహాయభూతులగుటయును, గ్రంథభాండాగార మహావృక్షము ఆంధ్రదేశమందెల్లయెడల తన వేరులను పాఁగొని యూడలను పాఱించుటయు సంభవింపగలదు."

దీనినిబట్టిచూడగా ఈ మహాసభ పేరు "ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభ" యనియు, అందు పాల్గొనవలసినవారు ఆంధ్రదేశగ్రంథాలయములకు సంబంధించినవారుగను, ఉపన్యసింపబడు విషయములు గ్రంథాలయోద్యమమునకు సంబంధించినవిగను ఉండవలసినట్లు తెలియవచ్చును. అయినను, గ్రంథాలయోద్యమము బాగుగ వ్యాపించుటకై సర్వజనులును పాల్గొనవలసిన బహిరంగసభకూడ యావశ్యకము. కాని అట్టి బహిరంగసభలయందైనను, గ్రంథాలయోద్యమమునకు సన్నిహిత సంబంధములేని విషయములనుగూర్చి ఉపన్యాసములను గావించిగాని, చర్చించిగాని, కాలమును వేఱుపథముగ నుపయోగించుట సరిగాదేమోయని తోచుచున్నది.

ఈ మహాసభకై ఏర్పరుపబడిన కాలమును రెండు భాగములుగజేసి, ఒకభాగమును సర్వజనులకై బహిరంగ సభకును, రెండవభాగము ప్రత్యేకము ప్రతినిధులకై అంతరంగికసభకును వినియోగించుట మేలు. బహిరంగ సభయందు సన్మానసంఘాధ్యక్షునియొక్కయు, అధ్యక్షునియొక్కయు ఉపన్యాసములును, ఆంధ్రదేశగ్రంథాలయసంఘ సంవత్సరవృత్తాంత నివేదికమును, మఱియు గ్రంథాలయవ్యాప్తికి సంబంధించిన విషయములను గూర్చి ఉపన్యాసములను జరిగింపవచ్చును. రెండవసభయందు కేవలము ఆంధ్రదేశమందలి వివిధ ఆంధ్రగ్రంథాలయములకు సంబంధించిన ప్రతినిధులుమాత్రమేగూడి తమతమ గ్రంథాలయముల కార్యనివేదికములను చదివి అవసరమైన తీర్మానములను గావించుట యుక్తము. ఇందువలన ఒక నష్టము కలుగవచ్చును. గ్రంథాలయములు ప్రతిగ్రామమునందు లేనందుననో, లేక మఱియేకారణముననో, గ్రంథాలయాభిమానులు కొందఱు ప్రతినిధులుగ రాలేనంతమాత్రమున అట్టివారి సలహాలను కోల్పోవలసివచ్చును. అటులజరుగకుండుటకై వారు, ప్రతినిధు

లుగ రాలేకపోయినను, ఆంధ్రదేశమందలి ఏదోయొక ఆంధ్రగ్రంథాలయముతో, చందాదారులుగనో, లేక గౌరవసభ్యులుగనో సంబంధము కలిగియుండవలసినదని మనము వారిని కోరుటమేలు. అట్టివారిని మనము ప్రతినిధులనుగా అంగీకరింపవచ్చును. ఇంక నీప్రతినిధుల సభయందు జరుగవలసిన విషయములేవనగా: (1) వివిధ గ్రంథాలయముల సాంవత్సరిక రిపోర్టులను చదువుట. (2) ప్రతినిధులు గ్రంథాలయోద్యమమునుగూర్చి తమ తమ యనుభవములను దెలుపుకొనుట. (3) ఆయనుభవములనుబట్టి తీర్మానములను జేసికొనుట మొదలగునవి; ఈ పనులన్నియు సర్వజనులుచేరి బహిరంగసభలో జరిపినయెడల, అందుజేరిన పెక్కండ్రు ప్రేక్షకులకు విసుగుగా నుండును. కావున కేవల ప్రతినిధులకై ప్రత్యేక సభ యవసరము. మఱియు ఈ ప్రతినిధుల సభయందు యీవఱకు కావింపబడిన యే యే తీర్మానములు ఎంత వఱకు అనుసరణమునకు దేబడినవో, తేబడనియెడల అందుకు కారణములేవో యున్నగువాటినిగూర్చి చర్చించుకొనవలయును. ఈ సభయందు గావింపబడు తీర్మానములు రెండు తరగతులుగా నుండును. (1) ప్రభుత్వమువారు సహాయమునర్పవలసినవి. (2) మనంతట మనము చేయవలసినవి. కడచిన నాలుగు సభలయందును గావింపబడిన తీర్మానములలో ముఖ్యమైనవి 12 గలవు. అందు

I. మొదటితరగతివి.—

౧ గ్రంథభాండాగారములకు మ్యునిసిపాలిటీలు, జిల్లా, తాలూకాబోర్డులును, ప్రావిన్షియల్ రివిన్యూనుంచియు, విరాళము లొసంగవలెనని గవర్నమెంటువారిని కోరుట.

౨ ఆంధ్రదేశమధ్యమున అనుకూలమైన స్థలమందు, ఆంధ్రభాషయందు ప్రచురింపబడు గ్రంథములనన్నిటిని, పత్రికలనన్నిటిని, చెన్నపట్టణప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి ఇతర అముద్రితగ్రంథప్రతులనన్నిటిని జేర్చి, ఆంధ్రదేశమందలి ఇతరగ్రంథాలయములకు సహాయభూతముగ నుండునటుల గ్రంథాలయ మొకదానిని ప్రభుత్వమువారు నెలకొల్పునట్లు కోరుట.

3 దొరతనమువారిచే ప్రచురింపబడు పరిశ్రామిక, ఆరోగ్యకరములగు ప్రచురణముల నన్నిటిని, జిల్లాగెజట్లను, ఆంధ్రభాషయందు ముద్రింపబడిన గ్రంథముల పట్టికలను ఆంధ్రదేశమందలి గ్రంథాలయములకన్నిటికిని ఉచితముగా ప్రభుత్వమువారు దయచేయునట్లుకోరుట.

౪ పుస్తకభాండాగారములను, పఠనమందిరములను, ౧౮౬౦ సం॥ ౨౧ నంబరు ఆక్టుననుసరించి రిజిష్టరీచేయుటకు చెల్లింపవలసిన రుసుము లేకుండగనే రిజిష్టరీ చేయించుటకు ప్రభుత్వమువారిని కోరుట.

౫ ఎలిమెంటరీబోర్డు పాఠశాలలయందలి పుస్తకభాండాగారములను ఆయాగ్రామములయందలి జనులు ఉచితముగా నుపయోగించుకొనునట్లు చేయవలెనని గవర్నమెంటువారిని కోరుట.

౬ విద్యాశాఖాధికారులవద్దనుండు మాజిక్లాంతరు మొదలగు పరికరములను గ్రంథాలయములకు అరువిచ్చునట్లు ప్రభుత్వమువారిని కోరుట.

II రెండవతరగతివి.—

౧ ఆంధ్రదేశ గ్రంథభాండాగారసంఘమునకు సంచారకార్యదర్శి నేర్పాటుచేయుట, పత్రికను ప్రకటించుట.

౨ అన్ని పట్టణములందును, పల్లెలందును గ్రంథాలయములను నెలకొల్పుట.

3 అన్ని గ్రంథాలయముల కార్యనివేదనములను, గ్రంథాలయసర్వస్వమునందు ప్రచురించుటకై, గ్రంథాలయసంఘకార్యదర్శికి బంపుట.

౪ గ్రంథాలయములన్నియు గ్రంథాలయసర్వస్వమును దెప్పించుకొనునట్లు చేయుట.

౫ గ్రంథాలయములన్నియు ఆంధ్రుల ప్రత్యేకవ్యక్తిని, కళలను, ఆచారములను, పండుగలను, వర్ధంత్యుత్సవములను ప్రోత్సాహపరుచుటయు; తమకు సంబంధించిన రాత్రిపాఠశాలలయందు ఆంధ్రుల ప్రత్యేకవ్యక్తిని, కళారూపమును దెలుపు విద్యావిధానము నవలంబించుట.

౬ ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము వ్యాపింపజేయుటకును, గ్రంథాలయములను సర్వజనోపయోగకరములుగను, జనాకర్షకములుగను జేయుటకును కావలసిన విధానమును ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమును నడుపుటకు కావలసిన చిత్తుచట్టములను తయారుచేసి, ఆసంఘమువారు ఈ అయిదవ గ్రంథాలయ ప్రతినిధుల సభలో తీర్మానము నిమిత్తము సిద్ధపరుచుట.

ఈ పై చెప్పినవాటిలో మొదటితరగతి తీర్మానములు ప్రభుత్వమువారికి సరిగా సకాలమున తెలుపబడినవా, తెలుపబడినయెడల వారేమి జవాబిచ్చిరి; జవాబియ్యనియెడల, తిరిగి వారు జ్ఞాపకపరుపబడిరా మున్నగు విషయములను గూర్చి ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ కార్యదర్శి ఇట్టిసభలలో దెలుపుట మంచిది. స్వపరిపాలన మనుభవించుచున్నందున ప్రజలకు జ్ఞానాభివృద్ధి కలుగజేయుట తమకు విధాయకకృత్యమని బాగుగా గ్రహించిన బరోడాసంస్థానాధీశులు తమ సంస్థానమున అనేక గ్రంథాలయములను స్థాపించి, వాటిని సరిగా నిర్వహించు భారమును చాలవరకు తమ సంస్థానపు టుద్యోగస్థులగు తహాస్సిల్దారు, రివిన్యూఇన్ స్పెక్టర్ల మీదనే బెట్టిరి. అట్టి స్వపరిపాలనస్థితి మనకువచ్చు పర్యంతము కొంతవఱకు మనము మన ప్రభుత్వమువారిని ప్రాధేయపడి సహాయమును గోరుచు, కొంత మనమే చేసుకొనవలసియున్నది. ప్రభుత్వమువారు పూనుకొననిది ఈ గ్రంథాలయోద్యమము బాగుగా అభివృద్ధిపొందనేరదనుట నిశ్చయమేయైనను ప్రస్తుత స్థితిగతులు అనివార్యములైనందున మనము కొంతవఱకైనను శ్రద్ధవహింపక వీలులేదు.

మన ఆంధ్రదేశమందలి ౧౨ జిల్లాలలోని అధమము ప్రతి-తాలూకాముఖ్యపట్టణమందైనను తప్పక ఒక గ్రంథాలయము ఏర్పడునట్లు చేయవలయును. ఆంధ్రదేశములో ఏజన్సీలను వదలిపెట్టగా ౧౨౦ తాలూకాలు గలవు. ప్రస్తుతము కొన్నిచోట్ల ఒక్కతాలూకాలోనే పెక్కు గ్రంథాలయములు గలవు. కాని కొన్నితాలూకాలలో గ్రంథాలయములే లేవు. తాలూకా గ్రంథాలయములతోబాటు జిల్లాగ్రంథాలయములనుగూడ స్థాపించి, గ్రంథాలయములన్నియు అన్యోన్యసంబంధములను కలిగి, వలనూడిరి దేశమున నల్లుకొనునట్లు చేసినచో వాటివలన దేశాభ్యుదయమున కవసరమగు అనేకపనులను సామాన్యజనులవలననైతము జరిపింపవచ్చును

స్నేహితులారా! ఈ విషయములన్నియు మీకు క్రొత్తవిగావు. అయినను ఇట్టిసమావేశమున అందరము వీనిని జ్ఞాపకము తెచ్చుకొనినచో విశేషలాభము కలుగునని యూహించి మనవిచేయుచు నింతటితో విరమించుచున్నాను.

వెలిదండ శ్రీనివాసరావు.

---

# భరతమాతృస్తవము

సీ॥ అమృతంబుతోఁ బోరు ♦ నట్టి గంగాది పుణ్య నదీజలంబుల ♦ మనిచినావు
స్వాదుఫలంబుల ♦ సౌఖ్యంబుఁ గూర్చు నామ్రాది వృక్షంబుల ♦ నలరినావు
నియమంబు మీఱక ♦ నెగడు నిశావాసరముల ప్రవృత్తిని ♦ ప్రబలినావు
అన్యదేశ్యులకు నా ♦ హారమౌ శాల్యాది, సస్యంబుల నొసంగ ♦ జాలినావు
గీ॥ ఐక మత్యంబు సకల ని ♦ వాస్యప్రశస్తి, నీ సుతుల కెల్లఱకు దయ ♦ చేసి తేని
నీకు సములెవ్వరింక నీ ♦ లోక మందు, పరమకరుణాపమేత యో! ♦ భరతమాత.
సీ॥ సకల రాజ్యమురోసి ♦ సంసారమును బాసి, మునియైన బౌద్ధుని ♦ జనని నీవ!
చిన్నతనాన నే ♦ రెన్నికఁ గాంచిన, యాచార్య శంకరు ♦ నవ్వ నీవ!
కవికుల రత్నమై ♦ ఘనతను గాంచిన, కాళిదాసుని కన్న ♦ కలికి నీవ!
శ్రీరాముఁ బాదియౌ ♦ వీరాగ్రణులఁ గని, మహిఁ బన్నెకెక్కిన ♦ మాత నీవ!
గీ॥ గానశాస్త్రమునందుస ♦ మానుఁడైన, త్యాగరాజ కవీంద్రుని ♦ తల్లి నీవ!
అట్టి నీకిల సములెవ్వ ♦ రనఁగఁ జెల్లు, పరమకరుణాసమేత యో! భరతమాత.
సీ॥ జనియించి నాఁడు గా ♦ సార్వభౌముఁడశోకుఁ, డుర్వి బౌద్ధమతంబు ♦ నుద్ధరింప
జననమందెను గదా ♦ సర్వసర్వంసహా, చక్రంబుఁ బాలింప ♦ విక్రమార్కుఁ

డుదయించినాఁడు గా ♦ యొగిఁ బ్రోవ, గను దేవ, భావను భోజభూ ♦ వల్లభుండు
ప్రభవించినాఁడు గా ♦ ప్రభుఁడు రాయలువారు, శత్రులఁ బరిమార్ప ♦ సమయు మెనవి
గీ॥ బలిమి ఢిల్లీపురీ నాథు ♦ ప్రక్కలోని, వాడి బల్లెము గాదె శి♦వాజి విభుఁడు
నిన్ను సామాన్యవని మది ♦ నెన్నఁ దగునె, పరమకరుణాసమేత యో! ♦ భరతమాత.
ఉ॥ భారతమాత! నిన్ను పరి♦పాలనముం బొనరించి కీర్తిఁ గ
న్నారలు రాజులెల్లరు, స♦నంతశుభావహమైన కార్యముల్
దీరిచి యెల్ల దిక్కులను ♦ తేజము నిల్పఁగఁ జాలినారల .
న్నారలు మేటివంచు జన♦నాథులు పెక్కురు పెక్కురీతులన్.
ఉ॥ అమ్మరో! నేఁడు నీ తనయు ♦ లన్యుల సేవలు సేయుచుండ, నీ
విమ్మెయిఁ గాంచి యూరకొను ♦ టెంతయు కాలవిశేషమాయె, శీ
ఘ్రమ్ముగ మాదు సోదరుల ♦ కన్నుల కంజనమిచ్చి వేగ లో
కమ్మునఁ గీర్తిఁ గూర్పు మధి♦కమ్ముగ సాటిజనమ్ము చోటఁగన్.
ఉ॥ పూర్వుల వైభవంబు మఱి ♦ బూర్వుల యద్భుత రాజ్యతంత్రికా
ఖర్వ కుశాగ్రబుద్ధియు ని♦కామ మదోద్ధత వైరిభూమి భృ
త్పార్వణ చంద్రచర్వణ జ♦వంజవ కేతుల సత్కృపాణికా
ఘూర్వహశక్తియున్ వినిన♦తోడ మెయిన్ బులకల్ జనింపవే.
సీ॥ ఇతరదేశము లభి♦వృద్ధికిఁ దెచ్చు రసాయనాదిక శాస్త్ర ♦ సమితి యెల్ల
జాగతానాగత ♦ వ్యవహారములఁ దెల్పు, జ్యోతిష గ్రంథ♦ రాజంబు లెల్ల
విమల బ్రహ్మజ్ఞాన ♦ విధ ముపదేశింపఁ, జాలు వేదాంత శా♦స్త్రంబు లెల్ల
సరసవిద్వన్మనో♦హర కావ్యనాటకాలంకారశాస్త్రజా♦లంబు లెల్ల
గీ॥ అనుపమంబుగ వ్రాసి వి♦ఖ్యాతిఁ గాంచు, ఘనులు సంస్కృత కవులు నీ ♦ తనయు లంట
యింక నీ పురౌన్నత్యంబు ♦ నెన్నఁ దరమె, పరమకరుణాసమేత యో! ♦ భరతమాత.
సీ॥ భారతామ్నాయమ్ము ♦ వ్రాసి యాంధ్రమ్మున, విఖ్యాతిఁ బడయు క♦విత్రయమ్ము
ఘనభాగవతమహా♦ర్ణవనిధి మథియించి, యమృత మందిచ్చు పో♦తన్న సుకవి
కవిసార్వభౌముఁడై గ్రంథరాజంబులఁ, బచరించు శ్రీనాథ ♦ భట్టవాళి
లలితశిరీష పే♦శల కవితామార్గ, దర్శకుండైన ♦ పెద్దన మనీషి
గీ॥ నందితిమ్మన, రామకృ♦ష్ణకవి, రామరాజభూషణకవి రాజ ♦ రాజు లెల్ల
నీదు కుక్షిని జననమం♦దిరి గదమ్మ, పరమకరుణాసమేత యో! ♦ భరతమాత.
సీ॥ వినసొంపు నింపెడు ♦ విమలమౌ గాంధర్వ, విద్యను బోధించు ♦ విబుధు లేరి
రసభరితంబులౌ ♦ రమణీయ జాతిగీతములను బాడించు ♦ తంత్రు లేరి
ప్రకృతిశాస్త్రంబులఁ ♦ బరిపరిశోధించి, దేశమాతను బ్రోచు ♦ ధీరు లేరి
లలిత నూతనయంత్ర ♦ లాలిత్యమును జూపి, కళల నెంపొందించు ♦ నలఘు లేరి
గీ॥ సమయమును జూచి సంఘలో♦పమును దీర్చ, మానమును బ్రాణమును దేశ♦మాత కొఱకు
ధారవోసెడు యమ్మహా ♦ దారు లేరి, పరమకరుణాసమేత యో! ♦ భరతమాత.
సీ॥ ప్రబల దురాచార ♦ పటలంబు లెల్లను, ఖండింపఁ గలుగు న♦ఖండ శక్తి
పరగు నాంగ్లదేశజుల క్రేఁగంటి ప్రసారంబులను ద్రిప్ప♦జాలు శక్తి

అజ్ఞాన సాగరమందు నల్లలనాడు, నీపుత్రకులు లేచి నిలుచు శక్తి
అన్యోన్యవైరంబు లణచి యేకీభావ,మంది స్వరాజ్యంబు నందు శక్తి

గీ॥ భారతీయుల కాదియా బాహుబలము, బుద్ధిబలమునుబొందు విశుద్ధ శక్తి
నిచ్చి, యసమానవరవిఖ్యాతి దెచ్చుకొమ్మ, పరమకరుణాసమేత యో! భరతమాత!

—జంధ్యాల వేంకటశివకవులు.

---

# తృతీయ గోదావరి మండల గ్రంథాలయ సభ.

## ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీ చెలికాని లచ్చారావుగారి ఉపన్యాసము

ఈ మహాసభ రెండేండ్లనుండి గోదావరీమండల రాజకీయసభ యందుఁజేరి యద్దాని క్రీగంటి ప్రసారంబున బ్రతుకుచున్నది. సర్వలక్షణ లక్ష్యోపేత సుంప్రైప్రసిద్ధంబగు నాంధ్రమాత తన సుధామహాత్ములను స్వాతంత్ర్య ప్రయత్నమును తన ప్రియపుత్రులకు బోధించ సరగంటయిన కాలవ్యవధి లేకుండుట విచారించి మీదు మిక్కిలి పై సభ నాహ్వానించినవారు దానితో బాటైన రమ్మనమని యొక్క మాటయైన బలుక కుండుటయు, "పిలువని పేరంటము"నకు బోవనేలయనియు, స్వాతంత్ర్యంబులేని జీవనంబు నిరర్థకంబనియు, తలంచి సభాతిథ్యానంబున భాషామతల్లి మోగంబుఁజూచి మేమీకు గ్రామంబున నాహ్వానించితిమి. ఇఁక నీ యాంధ్రమాతను కమశ్రద్ధతో నాదరంబుతో స్వతంత్రముగా పోషించు భార మామెపుత్రులమగు మనయందే యున్నది. మా చిత్రాడపురీ పుణ్యవశంబున సంగీతసాహిత్య కళావిశారదులును, భాషాభిమానులును, బంధుమిత్రగురు బుధజనవర్గంబును నగు మహనీయులెల్లరు నీ సభ నలంకరించి నందులకు మాకృతజ్ఞతావందనంబు లర్పించుచున్నవారము. మాచిత్రాడ చిన్నగ్రామమై (1800 జనాభా) నప్పటికీ నీమధ్య నాంధ్రపరిశోధక మహామండలి నిమిత్తమై గ్రంథములను వెదకుచున్నతఱి రమణక్కపేటలో దొరకిన యొక్క తాళపత్ర గ్రంథమందు సుమారు 140 సం॥రముల క్రింద రచించిన చిత్రాడ వేంకటేశ్వర స్తోత్రంబు చూచిన నప్పటికంతో కాలమునుండియు చిత్రాడ గ్రామము వెలసియుండినట్లు కానబడుచున్నది. అది సంస్కృతమున రచింపబడిన వేంకటేశ్వరశతకము. చిత్రాడనుగుఱించి పురాణప్రసిద్ధంబగు గాథ యేదియు గానరానప్పటికి నిందుండు పోతురాజు మొదలుగాగల శిలావిగ్రహంబుల శిల్పనైపుణ్యంబు తిలకించిన జైనుల కాలము జ్ఞాపకమువచ్చుచున్నది. మఱియు నిప్పుడు కానరాని నెన్నోతరముల క్రింద నశించిన రాజనాలవారు చక్కావారు, బచ్చువారు మొదలగు కుటుంబముల నామములతో పెద్దలవలన వాడబడుచున్న పెరడులను బట్టి చూచినను నిదిపురాతన గ్రామంబని తోచుచున్నది. ఇప్పుడీ కుగ్రామమునకు తూర్పుననున్న నొక భూభాగమును "ధనపుదిబ్బ" యని వాడబడుచుండుటయు, గోలెంబులకొలంది ధనమున్నట్లు వాడుకయుఁగలదు. ధనము భూమియందు దాచుకొనుట, నిక్షేపముచేయుట, శత్రువులు వచ్చునప్పుడు పాతివేయు నలవాటుండుట, దోపిడుల కాలమందు రెడ్లు, మహమ్మదీయుల పరిపాలన కాలమున నున్నతస్థితి నున్నదాయని జ్ఞాపకము వచ్చుచున్నది. ఇందు సాలి, కుమ్మర, బలిజ, గొల్ల, ఈడిగ చాకలి, మంగలి, జంగము, మాల, మాదిగ, మహమ్మదీయ, బ్రాహ్మణ, రాచవెలమ, వైశ్యశూద్రాదులు గల వర్ణంబుల దిలకించినను యెటుఁజూచినను పురాతన గ్రామంబని తేలుచున్నది. ఇందు బోర్డుస్కూలును, నైట్ స్కూలును, పంచమస్కూలును గలిగి నూటికి డెబ్బదిమంది చదువను, వ్రాయను సమర్థతగలవారు కలరు. సుప్రసిద్ధ కవివరులగు శతావధానులు తిరుపతి వేంకటేశ్వరుల గురువులు షడ్దర్శనీ వేత్తలగు చర్ల బ్రహ్మయ్యశాస్త్రి వరేణ్యుల నాదరించి ధవళేశ్వరంబున పాఠశాలను నెలకొల్పిన లక్ష్మీనరసయ్యమ్మగారి దీగ్రామంబె. లోకంబునందెల్ల సుప్రసిద్ధివడసి బొబ్బిలి

రణరంగంబున మరణించిన రంగారావుగారి సతీరత్నంబు మల్లమ్మదేవియు మా గ్రామవాసుల బిడ్డయనుటకు గర్వించుచున్నారము. ఇంక ననేకచరిత్రాంశము లీగ్రామమునకు గలవు. గ్రంథవిస్తర భీతిచే విరమించి ప్రస్తుతాంశంబునకు వచ్చెదను. భారతవర్షంబున చరిత్రాంశంబుల దిలకించినను, యుక్తినిపరికించినను, దేశాభ్యుదయంబునకు భాషాభివృద్ధియే ప్రథమ సోపానంబని తెలియుచున్నది. భాషాభిమానములేని రాజ్యంబుగాని, భాషాభివృద్ధిలేని దేశంబుగాని యభివృద్ధిపొందినట్లు ఏ చరిత్రమునందును గానరాదు. ఏదేశము నాగరికతాభివృద్ధిలో, సకలసంపదలతో, జ్ఞానసంపత్తితో తులతూగుచున్నదో యాదేశంబు తప్పక భాషాభివృద్ధిగాంచియున్నదనియే యెఱుంగవలెను. ఇట్టి పరస్థితిగమనించియె ఇట్టి సర్వోత్కృష్టత గ్రహించియె, అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు మొదలగు దేశంబుల ప్రతిపట్టణంబునను, గ్రామంబునను, తుదకు యింటింటియందును భాషాభివృద్ధి కనువగు జ్ఞానసాధనంబగు పుస్తకభాండాగారంబులు వెలయింపఁజేసి ప్రపంచకమండలి జాతులలో నాగరికాగ్రగణ్యులై వినుతికెక్కిరి. వారి దేశంబుచూచియే బరోడా ప్రభువు తన దేశంబున గ్రంథాలయంబుల నెలకొల్పి ప్రజలను మిగుల యౌన్నత్యదశకు తీసుకువచ్చెను. మనదేశంబు తొల్లిటి యౌన్నత్యంబు పొందవలెనన్న సిరిసంపదలు సత్కళాభివృద్ధిగాంచవలెనన్న, యిహపరసౌఖ్య మందవలెనన్న గ్రంథాలయ స్థాపనంబే ప్రథమ కర్తవ్యంబు. సర్వస్వాతంత్ర్యంబు లలవడుటకు, విజ్ఞానధనంబు నొందుటకు, ప్రకృతి ఆధ్యాత్మికంబుల దెలుసుకొనుటకు సూక్ష్మములో మోక్షమనునట్లు యీ గ్రంథాలయంబులె సాక్షిభూతములగును. ఇట్టి సర్వోత్కృష్టత గుణాతిశయములనుబట్టియె మన పూర్వులు పెక్కుచోట్ల దేవాలయంబులతోడు నీ గ్రంథాలయంబులను నెలకొల్పుచుండిరి. ఒక్క దేవాలయంబున నాముష్మికసాధనంబు దెలుపును గాని గ్రంథాలయంబు విజ్ఞానసంపత్తితో గూడుకొని ఐహికాముష్మిక సుఖసాధనంబులు గలుగజేయును. మనకుబుద్ధులుచెప్పు తలిదండ్రులు, హితోపదేశముజేయుగురులు, సలహాజెప్పు మంత్రులు, తోడునీడగుభార్య, సోదరులు, యోగులు జ్ఞాతులు, యెందఱో మహనీయులు, స్త్రీపురుషరత్నంబులు యింతయేల తుదకు దైవంబు నీగ్రంథరాజంబులందు వసించియుండునప్పుడు అట్టి పవిత్రవంతంబై సర్వోత్కృష్టమైన గ్రంథాలయముం గాంచుట యెంతశుభప్రదమో లాభకరమో యోచింపుడు. అట్టి సర్వశుభప్రదమైన యిహపర సాధనమైన కార్యంబుగాబట్టియె మున్ను మనవారు తక్షశిల, నలందల, ధాన్యకటక మొదలగు పలుచోట్ల గ్రంథాలయములు స్థాపించి దేశాభివృద్ధికరముగ జేసి వన్నెకెక్కిరి. మఱియు వైదేహ, కాశి, కోసల, కురు, పాంచాలాది ప్రభుస్థానంబులు గ్రంథాలయంబులు గలిగి సకల కళావిభూషితులగు పండితవర్యులచే నలంకరింపబడి యుండెను. ఎక్కడ జూచినను విద్యా వినోదంబులచే వర్ధిల్లుచుండెను. ఈ గ్రంథాలయంబులకడ కరిగి కర్మిష్ఠులు, యోగులు మొదలగు వారెల్లరు తమ తమ సంశయంబుల దీర్చుకొనుచు కృతార్థులగుచుండిరి. దేశము భాగ్యభోగ్యజ్ఞానాధికంబు లొందవలెనన్నచో గ్రంథాలయంబులె ముఖ్యావసరంబులు, గ్రంథాలయంబె ప్రథమాలంకారంబు. శ్రీకృష్ణదేవరాయలు "భువనవిజయ"మను పేర నొక సభనిర్మించి కవినాథులతో విద్యావినోదంబులు సలుపుచుండె. మఱియునిది యిట్లుండ మనదేశంబున కొందఱువచ్చి మనలను దోచుకొనినను, దేవాలయంబులను పడగొట్టినను, వివిధ దురాచారంబులు బోధించినను, ఏదిపోయినను, ఏమిజరిగినను మన పెద్దలు తమ దారాపుత్రాదులకన్న, సోదరసోదరీమణులకన్న, గ్రంథరాజంబులను కాపాడి కీర్తిశేషులైరి. మన పెద్దలు మనకొసంగిన దివ్యధనమిదియె. వాటియందుండు జ్ఞానసంపద గ్రహించి శ్రేయోభివృద్ధులందు భారము మనయందున్నది. ప్రపంచకంబు పుట్టియెన్నో యుగంబులైనది. ఎందఱో యోధులు, రాచకీయధురంధరులు, ఘనసంఘసంస్కర్తలు, జ్ఞానధనులు, కవులు, గాయకులు, పరోపకారపరాయణులు బయలుదేరిరి. దేశంబున కెన్నియో మేళ్ళుచేసిరి. గతించిరి. ఇన్ని యుగంబుల చరిత్రము, జ్ఞానధనము, గతించిన వారల అనుభవములు, వారల త్రోవలు మనము పొందుటెట్లు? పుస్తకంబునగాదె? అట్టి దివ్యధనమును కాపాడుకొని యభివృద్ధిజెందుటకు గ్రంథాలయంబు లావశ్యకంబులు

గావె. అట్టివిశేషమండిన లోకజ్ఞానంబెట్లుండును. మున్ను మనదేశంబున గ్రంథాలయాభివృద్ధిగాంచుట వినియుంటిమిగదా. రానురాను అన్యపరిపాలనంబునను, మతద్వేషంబుల మనగ్రంథాలయంబులు క్షీణించినవి. ఇప్పుడు మనమత విషయమునకు 'మేమురాము'ని వాగ్దత్తము చేసిన ఆంగ్లేయపరిపాలనవలన మన గ్రంథాలయాభివృద్ధికి సావకాశము చిక్కినది. తరుణము పోగొట్టుకొనజనదు. గ్రంథాలయాభివృద్ధివలననే అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు దేశంబు లమిత లాభంబులుపొంది జన్మహర్షములు బడసినవి. ఎన్నో గ్రంథరాజంబులను మన దేశంబునుండి తీసికొనిపోయి వారిభాండాగారంబుల నింపిరి. లాభము జెందిరి. ఒక్క శాకుంతల నాటకమును ఆంగ్లేయపండితుం డొకండు తన భాషకు భాషాంతరీకరించి నప్పు డద్దానిని జూచినప్పటి నుండియు పాశ్చాత్య పండితవరులు భారతీయులకు విజ్ఞానవిస్తరంబగు వాఙ్మయంబుండెనని నమ్మి వారుకూడ సంస్కృతిభాషాపఠనంబునకు దగలిరి. విపులగ్రంథపఠనం బొనర్చిరి. మనదేశమందలి యపూర్వగ్రంథరత్నంబులను తమదేశంబునకు దోలించిరి. ఈమధ్య తంజావూరు తాళపత్ర గ్రంథముల లైబ్రరీనిగూడ తీసికొనిపోవ జర్మనీవారు ప్రయత్నించిరి. అంతలో యుద్ధదేవత అడ్డుపడినది.

సోదరులారా! పరహస్తగతంబగుట చేతనేమి, క్రిమిభక్ష్యంబుననేమి, అగ్నిదగ్ధంబుననేమి అంతరించగానున్న వాటినైన తాళపత్రాది గ్రంథంబులగూడ సేకరించి సంరక్షించి భాండాగారంబుల నింపి మాతృభాషాపోషకులై యభివృద్ధిగాంచుడు. ఈ గ్రంథాలయాభివృద్ధియే మన కామ్యార్థముల నొసంగునది. గ్రంథాలయాభివృద్ధియే మనకు ఐహికాముష్మిక సాధనము. సౌఖ్యప్రదము. ఇంగ్లాండు జర్మనీ మొదలగు దేశములందు గ్రంథాలయంబులేని గ్రామంబులేదని చెప్పియుంటిని. సంవత్సరమునకు వేలకొలంది గ్రంథంబులు సంపాదించి కుతూహలు లగుచుందురు ధనికు లెంతయు సాయముచేతురు. ఒక ఆండ్రూకార్నీజీయను ధనికుడు యెన్నియో పుస్తకభాండాగారంబులు నిల్పి ప్రోత్సాహపరచెను. అక్కడ ధనికుల ప్రోత్సాహము మెండు. పాశ్చాత్య దేశంబున ౮౫౦౦౦౦ జనాభాగల యొక చిన్నరాజ్యమగు ఆస్ట్రేలియాయందే ౧౫౦౦౦ కలవు. రెండువందల లక్షలజనాభాగల మన ఆంధ్రదేశంబున నెన్నియున్నవో చూచితిరా? సుమారు ౮౫౦ కలవు. మనదేశంబు విద్యాభివృద్ధియందెంత వెనుకపడి యున్నదో చూచితిరిగదా. ఇంతవఱకు ౧౧ జిల్లాలలో గోదావరీ మండలమందే ౧౯,౫౪,౭౫౯ జనాభాగలిగియుండి సుమారు ౧౦౦ గ్రంథాలయంబు లున్నందుకు మనము సంతసింపవలసినదే. సోదరులారా! ఇంతమాత్రంబున గర్వింపవలదు. ఈ గ్రంథాలయోద్యమముయొక్క ఫలితంబు మహోత్కృష్టత మనయాంధ్రదేశంబునకేగాక భారతవర్షంబునకంతకు గూడమార్గదర్శి యగునట్లు జేయుదురు గాక. గ్రంథాలయంబులందుండు కార్యదర్శులు శాంతచిత్తులుగాను విద్యావంతులుగాను, జనాకర్షణపరులుగాను, సుగుణవంతులుగాను, ఉండవలయును. ఇట్టి సుగుణములు గలిగియుండిన గ్రంథాలయంబులు సర్వజనాదరణీయంబులై దినదిన ప్రవర్ధమానంబులై తేజరిల్లు.

## అగ్రాసనాధిపతులగు శ్రీ ప్రభల లక్ష్మీనరసింహం పంతులుగారి ఉపన్యాసము.

ఆంధ్రభాషకు పుట్టినిల్లయి, వాఙ్మయమునకు బట్టుకొమ్మయై, వాగనుశాసనుకావ్యసంరంభణమునకు కేళీగృహంబై, రాజరాజనరేంద్రపరిపాలిత రాజమహేంద్రపురశోభితమై, నిరంతరశోభాభాసమాన నానావిధసస్యసంభరిత కేదారలక్ష్మీవిలాసపరిశోభితమై, గౌతమీ పుణ్యనదీపవిత్ర జీవనపునీత ప్రజాజీవనరమ్యంబై విద్యలకు నెలవు, సిరులకునిక్క, పంటలకొటారమని ప్రసిద్ధిగాంచిన యీగోదావరీమండలమున నేసభనైన నాధిపత్యము వహించుట పున్నెములపంటయనుటయం దించుకయు సందియము లేదు. వర్తమానమున నాంధ్రభోజుండని యనన్యసామాన్యకీర్తి నిగాంచిన శ్రీరాజా శ్రీ వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరు శ్రీపిఠాపురాధీశ్వరాధిష్ఠితమండలమున నభినవగ్రంథాలయోద్యమ పటుకార్యనిర్వహణదీక్షితులగు శ్రీ చెలికాని ధర్మారాయ తత్సోదరనివాసంబగు నీ చిత్రాడనగరమున నీవిద్వజ్జనాకీర్ణంబగు నిమ్మహాసభ నధ్యక్షపదవిని నెలకొల్పబడుట యెట్టిభాగ్యోదయమని యెన్నదగును? ఇట్టి మహోన్నతపదము శుభకలభ్యయోగమున నాబోటి పామ

రుని పొల్పు డెననిమాత్ర మించుక మనమెఱియుచున్నది ఎల్లచదువుల తుదిచూచిన పండితవర్యులును, వింతకబ్బములచే వెన్నెలలబఱపి తల్లిబాస దెల్వినొందజేసి క్రొత్తలగు తేనెసోనల కెనయగు మృదుమధురఫణితుల నమృతంపువానల గురియుచు వాఙ్మయమండలమున నిండువెలుంగుతో వెల్గు కవిచంద్రులును, దేశసేవానిరతులయి నిజదారసుతోదరపోషణార్థముగాక దైవదత్తమగు నుత్తమజీవితమును మానవసేవకై ధారవోసిన మహోదారహృదయులును పెక్కండ్రుండ ననుబోటి యుల తిని నిరంతరకుక్షింభరవ్యాపారపారీణు, విస్మృత మాతృదేవతావాగ్ధురీణు, వాదప్రతివాదఖండనవిలుంఠనక్రియాసంప్లవు నేల యిట్టి యుత్తమపదమునఁబెట్ట నా మిత్రు లమితానుకంపదృష్టితో సమకట్టిరో తెలియరాకున్నది. ఎట్టులయిన నిప్పట్టున నీమండలసభామండలాధిపత్యమునఁబట్టభద్రుఁడనైతిని, కాని ముందు కార్యంబెట్లు? అగ్రాసనాధిపుని యారంభోపన్యాసమను గంభీరశ్రీరిక వాక్‌స్తంభనము గావించుచున్నది. నాభాగ్యవశమున నీవిధముననే గతవత్సరమున గంజాముమండలమున గ్రంథాలయ సభాధిపత్యము వహించితిని. మన్నివాసమగు విశాఖపురమున సాంధ్రసారస్వతసభాహ్వాన సంఘాధ్యక్షత్వమున బ్రతిష్ఠింపఁబడితిని. నాయల్పతోషము వంగల వాగ్గుంభనమంతయు సంతరించిపోయినది. నా మిత్రులగు గ్రంథాలయసర్వస్వనిర్వాహకులు దానినంతయు ముద్రించి ప్రకృతమందు నాభాషాదారిద్ర్యమును ద్విగుణీకృతము గావించిరి. నేనెటుల యీకార్యక్రమమున బ్రథమసోపానము నారోహణముచేసి కృతకృత్యుడ నయ్యెదనని యెంచుచుంటిని. తమ కరుణయే శరణముగాగల నాకు వేఱొండు భయములేదు. నాయిక్కట్టులకు దోడు నామిత్రులు రెండుగడియలయిన దడయకుండ పనికి గడువులు నాలోచించి ముందడుగిడ బ్రేరించిరి. కానిందు విషయము గ్రంథాలయములు, వినువారలు విద్వాంసులు, కాలము సంక్షేపము, గ్రంథవిస్తర మప్రశస్తము. తమ సాన్నిధ్యమున నించుకేని యు తమ తేజము నామనఃఫలకమున బ్రతిఫలించునేని నేనీకార్యము నెరవేర్పగలనను ధైర్యముతో సాహసించితిని.

## సమరవిజయము.

కలియుగకురుక్షేత్రమున ఘోరసంగ్రామము పరిసమాప్తిగాంచినది. మిత్రమండలివారి యుదారాశయములు, దుర్జేయపరాక్రమము విజయము గాంచినవి. ప్రపంచము శాంతిభూయిష్ఠమై సద్యోజాతసాంఘికశక్తుల నభినవమార్గముల బ్రసరింపఁజేసి ప్రపంచనాగరికతా పునర్నిర్మాణమునకు యత్నములు సలుపబడుచున్నవి. అదృష్టశ్రుతపూర్వమగు నీసంగ్రామచారిత్రము మహాభారతరూపమున నభివర్ణింపగల యభినవవ్యాసుండు బయలుదేరినచో భారతవర్షపర్వమందు దొడ్డదియై విరాజిల్లగలదను నానందము మన డెందముల నిండియున్నది. జర్మనీ దోర్మదరూపమగు నధర్మము నశించినది. ప్రాపంచిక రాజ్యాంగతత్వనిర్ణేతయగు విల్సను నేత మూలసూత్రముల నిర్వచనము చేసియున్నాడు. "స్వస్తిప్రజాభ్యాం పరిపాలయంతు న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః। గోబ్రాహ్మణేభ్యః శుభమస్తునిత్యం లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అని గ్రంథపఠనానంతరమున నిత్యము విప్రాశీర్వాదము వినబడుచునేయుండును. దీని భావమిప్పుడు తేటపడుచున్నది. "దైవీ స్వస్తిరస్తునః। స్వస్తిర్మానుషేభ్యః। ఊర్ధ్వంజిగాతుభేషజం। శంనో అస్తుద్విపదే। శంచతుష్పదే। ఓంశాంతిశ్శాంతిశ్శాంతిః॥" అని నిత్యమును పురుషసూక్తపారాయణము కావింపబడుచున్నది. అయినను భగవంతుని కరుణ మనయెడ పూర్ణముగా రాకున్నది. రాజకీయ వాతావరణము కాలజీమూతపటలసంఛన్నమై యున్నది. అయిన తుది నమృతము వర్షించుగాక! —

## విద్యావ్యాప్తి.

సంగ్రామానుభవము వలన పెక్కులగు నూతనవిషయములు గ్రాహ్యములయినవి. ముఖ్యముగ విద్యాదానక్రమ పద్ధతులు విమర్శలోనికి వచ్చినవి. పాశ్చాత్య విద్యయు శాస్త్రము నింతవఱకు మతవిదూరములై కేవల మైహికతంత్రప్రావీణ్యజనకములయి యుండెను. అందువలన సర్వోత్కృష్టమగు శాస్త్రముకూడ పరహింసాసాధనమయినది. ధర్మగ్లాని సంభవించినది. మఱియు యువకులందఱును నూతనయుగమున భావిపౌరత్వకార్యనిర్వాహణమునకు దగిన శారీరక మానసిక సిద్ధులన్నియు

నుచితరీతిని బడయుటకు వలయు విద్యాపద్ధతులు నిర్ణీతము లగుచున్నవి. దేహమాత్మకర్మక్షమమై యుండవలయును. విద్య యైహికపారలౌకికజ్ఞానప్రదమై యుండవలెను. అప్పుడే నిజమగు నాత్మస్వారాజ్యస్వాతంత్ర్యము పురుషునకు లభించును. ఇదియే యుపనిషదర్థముకూడ.

## గ్రంథాలయములు.

ఇట్టి విద్యావ్యాపనమునందు గ్రంథాలయములు ముఖ్యసాహాయ్యములు. పండితునకు నుత్తమగ్రంథములకంటె వేఱొండు ధనములేదు. అపరిగ్రహులగు సన్యాసులకు గూడ గ్రంథములే ధనముగా నెంచి తద్దాయవిభాగమును గూర్చి విజ్ఞానేశ్వరయోగి సూత్రము లేర్పఱచినాఁడు. నిరతిశయమగు సర్వప్రాపంచిక సౌందర్యసారము నొక్కచోఁ జేర్పఁగవలసినచో శాకుంతలమును స్మరింపజనునని జర్మనుకవి యుగ్గడించి యుండెను. ఒక్కగ్రంథరాజముయొక్క మహాత్మ్యమట్టిదియగు నెడ నద్భుతగ్రంథరత్నభాండాగారమగు గ్రంథాలయమహిమ నెట్లువర్ణింపనగును. పూర్వకాలమునుండియు గ్రంథప్రశస్తి మనదేశమున గ్రహింపబడి సుప్రసిద్ధరాజ్యస్థానములయందును నవద్వీపాది విద్యానిలయములయందును మఠములయందును దేవళములయందును పండితగృహములయందును గ్రంథములు పెక్కులు సంగ్రహింపబడుచుండెను. కాశ్మీరదేశమున శ్రీనగరమున సరస్వతీపీఠమని ప్రశస్తిగాంచినది. అచ్చటి గ్రంథరాజములును విద్వచ్ఛ్రేణియునై యున్నవి. మతోద్ధారకులుకూడ దూరాధ్వములు నడచి యచ్చటికేగి విజయముగాంచి తమగ్రంథములనిచ్చి మతవ్యాపనదీక్ష వహించియుండిరి; గ్రంథాలయముల యాకర్షణశక్తి యట్టిది. వారణాసిక్షేత్రముకూడ నట్టిదే. బౌద్ధమతప్రచారముగల కాలమున బౌద్ధవిహారములయందెన్నియో యుత్తమగ్రంథము లుండియుండెను. మతములు క్షీణదశకు వచ్చి రాజ్యము పరహస్తగతంబైన పిదప ప్రజలయందుదరభరణమే కష్టమగుటను విద్యావ్యాసంగము గ్రంథసంపాదనాసక్తియు తగ్గిపోయియుండుటను గ్రంథము లనేకములు ఖిలమయినవి. భారతఖనియందమూల్యరత్నములగు గ్రంథరాజములు కొన్ని విదేశరాజ్యగతములయినవి. సంధివిషయమున భరతఖండమునుండి జర్మనుచోరులవలన గొంపోబడిన గ్రంథరత్నముల దిఱిగి మనదేశమున కర్పింపబడునటుల గోరుడని వాక్రుచ్చిన హిందూమహాసభాధ్యక్షకోపన్యాసము మనసంతాపమును వెలిబుచ్చుచున్నది.

## గ్రంథాలయోద్యమము.

పూర్వగ్రంథాలయచారిత్ర మటులుండ నవీనగ్రంథాలయవిజృంభణ మించుక యాలోచింతము. పాశ్చాత్యదేశములయం దీయుద్యమము బాగుగ బాదుకొని ప్రభుత్వములవలనను విశ్వవిద్యాలయములు మున్నగు ప్రతిష్ఠాపనముల వలనను బోషింపబడుచున్న యంశము తమకందఱకును విదితంబయి యున్నది. పుస్తకసామగ్రియు విజ్ఞానమును విచ్చలవిడిగా ప్రజలకందఱకును సులభ్యములగు నటుల దగుయత్నములు నిరంతరమును జేయబడుచుండును. దివ్యభవనములు పుస్తకాలయములుగ నిర్మింపబడియున్నవి. ఉచితముగను అల్పములగు చందాలవలనను నమూల్యములగు పుస్తకముల ప్రజలు జదివి జ్ఞానాభివృద్ధి చేసుకొనుసాధనములు పాశ్చాత్యదేశములయందు గలవు. స్త్రీలకును పురుషులకును నీరూపమున విద్యాగ్రహణము సులభసాధ్యమై యున్నది. లక్షలకొలది ద్రవ్యము వెచ్చింపబడును. చదువరుల నాకర్షింపదగు నానావిధసౌకర్యములుగూర్పబడును. పుస్తకములలోని సారమున కనురూపముగ బాహ్యాలంకారములు, చిత్రముద్రణము, సొగసైన యట్టలు మొదలగు నెన్నియో యలంక్రియ లొనగూర్పబడును. మఱియు పుస్తకము లసంఖ్యాకములగుటచే పెక్కుచోట్ల పుస్తకవివరణపట్టికాక్రమమే యొకశాస్త్రముగా నభ్యసింపబడుచున్నది. అమెరికాదేశము నన్నివిధముల నీయుద్యమ ముత్కృష్టదశయందున్నది. మనదేశమున బరోడాసంస్థానమునందు శాస్త్రసంశోధితపద్ధతుల నీయుద్యమము వ్యాప్తజెందునటుల జేయబడుచున్నది. మనయాంధ్రదేశమున ముఖ్యముగ నామిత్రులగు శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులు శ్రీయుత నూరి నరసింహశాస్త్రిగార్లచే నీయుద్యమము వ్యాప్తము కాబడినది. వారిభాషాభిమానము దేశసేవారతియు సంస్తవనీయములు. ఉద్యమ మారంభమయినది మొదలు సర్వాంకషముగ నాంధ్రలోకమునం దంతటను కొనలు సాగినది అభినవదీప్తితో విరాజిల్లుచున్నది. ఇతర

దేశములకు మార్గప్రదర్శకమగుచున్నది. ఈసంవత్స
రమున రాబోవు నాంధ్రదేశగ్రంథాలయ మహాసభతో
గూడ అఖిలభారతదేశీయ గ్రంథాలయ మహాసభ గావిం
పబడుటకు ప్రయత్నములు సలుపబడుచుండుట హృద
యానందదాయకముగా నున్నది. ఇదియే యీయుద్య
మముయొక్క జీవశక్తికిని, ముఖ్యతత్త్వమునకు దృష్టాం
తమై యున్నది. ఆంధ్రజీవితమును విద్యావాసనా
యుతముగ జేసి యన్నివిధముల నైసర్గిక తేజముతో
ప్రజ్వరిల్లఁ జేయసమకట్టిన దీయుద్యమమే కావున ఆం
ధ్రోద్యమమున కుపాంగములగు నుద్యమములలో నిది
ప్రాముఖ్యమును గాంచినది.

## గ్రంథాలయములు, వానికార్యములు.

సరస్వతీనిలయములగు గ్రంథాలయము లూరూరను
ప్రబలుచున్నవి. మండలముల ముఖ్యపట్టణములయం
దుత్తమగ్రంథాలయములు వెలయుచున్నవి. ఆంధ్ర
దేశమున కేంద్రగ్రంథాలయములనుగూర్చి సత్ప్రయత్న
ములు సాగుచున్నవి. వాగ్దేవి నిజపద మంజీరమంజుల
ధ్వనులతో గ్రంథాలయసీమల నాట్యమాడుచున్నది.
చదువరుల వాఙ్మందిరమున శాశ్వతవసతిని గొన యత్నిం
చుచున్నది. సదా వాక్కున నివసించు నధిష్ఠానదేవత
కావునమన పెద్దలు శారదాదేవికి లక్ష్మీపార్వతులకు బోలె
దేవళములు నిర్మింపరైరి. వాక్సుమములచేతను భవ్యభా
వాతరంగవిధులచేతను నిత్యము పూజింపఁబడుచున్నది.
అటు లుపాసింపబడిన వాగ్దేవి సంప్రీతురాలై యభీష్టము
లనొసంగుగాని వేఱొండువిధమున కరుణాపాంగదృష్టిని
ప్రసాదింప నేరదు. "నారాయణం నమస్కృత్య నరంచైవ
నరోత్తమమ్। దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీర
యేత్" అని మహాభారతముఖమున వ్రాయబడియున్నది.
జనప్రబోధమునకై అత్యంత దయాశాలినియగు సరస్వతీ
దేవివలన నావిష్టుడయి గ్రంథరచనమునకు వ్యాసుండు
గడగెను. ఆదికవి వాల్మీకికూడ బ్రహ్మవలన "మచ్ఛం
దాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ" యనియాదే
శింపబడి యాదికావ్యరచనకు దొడఁగెను. అటుల సర
స్వతీప్రేరణమున రచింపబడిన గ్రంథములు దక్క
వేఱొండు శాశ్వతకీర్తిని గాంచనేరవు. సరస్వతీ
భూషణములగు నుత్తమగ్రంథముల గ్రంథాలయములు
సమకూర్చి భద్రపరచుచున్నవి. లేనియెడ మాఱు
మూలల మాటుమడిగి కొన్నియు, క్రిమికీటకములపాలయి
కొన్నియు, మఱియు నితరవిధముల నశించిపోవును.
గ్రంథాలయోద్యమము వెలువడిన కొలదికాలములోపల
నెన్నియుత్తమగ్రంథములు తాళపత్ర సంచికల సంపు
టములుగా నొనర్పబడినవి బయటికి వచ్చినవి! నా
మావశిష్టములగునవి యెన్నియో ప్రత్యక్షానందము గలుగ
జేయుచున్నవి. ఈవిషయమున చిత్రాడ నెలకొల్ప
బడిన శ్రీరామవిలాసగ్రంథాలయ సభ్యులయొక్కయు
శ్రీ చెలికాని ధర్మారావుగారియొక్కయు వారిసోదర
వర్గముయొక్కయు ప్రయత్నములును, ఉత్సాహము
లును శ్లాఘాపాత్రములు. గ్రంథాలయోద్యమము వెలు
వడకపూర్వమునుండియు శ్రీవీరేశలింగపుస్తకభాండాగా
రాద్యుత్తమపుస్తకాలయముల నెలకొల్పి స్త్రీపురుషు
లకు విద్యాదాన మొనరించుచున్న యీ గోదావరీ
మండలవాస్తవ్యుల కంతగా వీనియుపయోగములగూర్చి
చర్చించుట యనవసరమును సూర్యునకు కరదీపికను గను
పరచినయట్లు వృథాప్రయాసమును అగును. గ్రంథాల
యములు పైనివరించినవిధమున గ్రంథసంగ్రహణము సం
రక్షణమునుమాత్రము నిర్వర్తించుచుంటయేగాక గ్రంథ
రచనకు దోడ్పడుచుండుటయు మఱియు సభ్యుల వివిధ
కళాయుక్తులుగను జ్ఞానసంపన్నులుగను జేయుటకు
యత్నించుచుండుట కడు సమంజసమయి యున్నది.
కావుననే యీయుద్యమము సర్వాంకషమయి యాంధ్ర
లోకమున కుపకృతి నొనర్చుచున్నది.

## గ్రంథరచనము.

ఈ విషయమున నాయభిప్రాయముల నేకస్థలముల
వ్యక్తపరచియుండుటచే పునరుక్తికాకుండ కొలఁదియంశ
ములనుమాత్రము విశదీకరించి విరమించెదను. గ్రంథరచ
నకు కారణభూతము సరస్వతీప్రేరణమని యిదివఱకే
నుడివియుంటిని. ఆలంకారికవచనము లటుండ కావ్యము
నకు ప్రయోజనము ముఖ్యము. కవి యొక యుత్తమ
సందేశ వాహుండయి యుండవలెను. కవి హృదయమా
యుత్తమసందేశప్రపూర్ణమయి పొంగి పొరలి కావ్యస్వ
రూపఝరీ వేగమున ప్రవహించును. అట్టిసందేశ మాయా
దేశకాలపరిస్థితుల ననుసరించి యుండును. లోకోత్తరవర్ణ

నములచే సామాన్యవిషయములగూడ వినూత్న భావద్యోతకములుగా సత్కవీంద్రుడు ప్రదర్శించుచుండును. ప్రకృతిలీనమగు భగవత్తత్త్వము కవికన్నులయెదుట గట్టబడియుండును. కవి తన మనోభావముల చదువరుల హృదయవీథుల బ్రవర్తింపచేసి యంతరింద్రియమోదము గూర్చుచుండును. ఉత్తమకావ్య మీవిధమున రసముప్పతిలజేసి విమలానంద మొనగూర్చుచుండును. శబ్దములందలి నిగూఢమాధురిని మథించి యమృతస్వరూపమున శ్రోతల శ్రవణపుటముల జొనిపి యంతర్నాడీతంత్రుల తదనురూపముగా నవ్యగానామృతము వెలువడునట్టుల జేసి నిరతిశయసుఖమున నోలలాడించుచుండును. కుశలవులవలన రామాయణమును విని మునులీతీరున నానందించిగదా ప్రశంసించిరీవిధమున "అహో గీతస్య మాధుర్యం శ్లోకానాంతు విశేషతః । చిరనిర్వృత్తమప్యేతత్ ప్రత్యక్షమివ దర్శితమ్॥" ఇట్టి కావ్యములన్ని భాషలయందును మహాకవులవలన రచింపబడియున్నవి. భారతవర్షమున ప్రస్తుతమందు భారతజాతీయతత్త్వము నిజహృదయమున ప్రతిఫలించుచుండ దివ్యతేజః ప్రభాదీపితుండయి శ్రీయుత రవీంద్రనాథ ఠాకురు కవిచంద్రుండు భారతసందేశము నేవిధమున కావ్యరూపమున రచించుచున్నవాడు! ఆయన కవిత్వము ప్రపంచమునందంతట ప్రశస్తిగాంచినది. రవీంద్రుని వంటి కవీంద్రుం డాంధ్రమునగూడ వెలయుగాక! అంగాక గ్రంథాలయములు రవీంద్రుని కావ్యములసారమును నాంధ్రజనులు గ్రోలునటుల సౌకర్యము లొనగూర్చుచుండుగాత! వర్తమానమున నాంధ్రవాఙ్మయమున నాంధ్రతత్త్వము ప్రతిఫలించుచు వికాసము గాంచుచున్నయది. కాని యింకను అభినవ సంశోభచే దివ్యతేజముతో తేజరిల్ల దగియున్నది. ఆంధ్రసరస్వతి యింతదనుక కావ్యక్రీడలచే శైశవావస్థయందు క్రీడించుచున్నది. నాట్యరంగమున నూతనపద విన్యాసము లభ్యసించుచున్నది. భావగాంభీర్యమును వెలిబుచ్చుచున్నది. శాస్త్రమర్యాదల కొలదిగ నభ్యసించుచున్నది. బాహ్యదృష్టిచే బ్రకృతిసౌందర్యమును దిలకించి వర్ణనాతిశయమున భావోద్రేకమును జెందుచున్నది. కాని యాధిభౌతికమగు సంపదనుగాని భావప్రపంచమున నంతరింద్రియగోచరమై నిరతిశయానంద సంధాయకమగు ప్రకృతిస్వభావమునుగాని గ్రహించినటుల గానరాదు. కావున నే సావయవరూప భూతసృష్టి యందలి నిరుపమ సౌందర్యజాలము చక్కగ నభివర్ణింపబడుచున్నది. కాని నిరవయవమును స్వాత్మైకవేద్యమును నిగూఢమునగు భావతత్త్వమును బాగుగ గ్రహించినగాని యుత్తమసందేశము కవి మనోవీథి శబ్దబ్రహ్మస్వరూపమయి నాదము చేయుచుండుట యరిది. కవి త్రికాలజ్ఞుడు లోకజ్ఞుడు. "నాఋషిః కురుతే కావ్యమ్" అని పెద్దలు నుడువుదురు. "కంఠమందున నోంకారఘంటమొరయ । వెలుగుగావుత మన్మనః క్షేత్రసీమ । గవికుటుంబంబుపాలిటి దివిజసురభి । జలజసంభవుబోటి భాషావధూటి"॥ యనిభావగర్భితముగా శ్రీనాథుండు సరస్వతీస్తవమును జేసి యున్నాడు. ఆంగ్లమున నుత్తమసందేశ ద్యోతకములగు కావ్యములు మెండుగలవు. శబ్దనిగూఢమాధురీవిలసితములగు కావ్యజాలములు సారస్వతము నలంకరించుచున్నవి. ఆంగ్లకవిత్వమును మాతృకగా నిడుకొని యాధునికులలో శబ్దార్థగౌరవముల నసమానపాండితీమహిమగల టెన్నిసన్ (Tennison) స్విన్‌బర్న్ (Swinburen) మున్నగు కవీశ్వరుల కవనచాతురులను గ్రహించి కావ్యములు రచించుచో నాంధ్రవాఙ్మయాభివృద్ధి గలుగునని నాయోజనయై యున్నది. రవీంద్రుని గ్రంథము లవశ్యము పఠనీయములని యిదివరకే నుడివియుంటిని. అభినవకవిసార్వభౌము లీవిషయమును గుర్తింతురుగాక! అనుకరణిపద్ధతి యప్రశస్తమయినను నారంభదశయందనివార్యము. ఉత్తమాచరణానుసరణమున వివేకము జనించి భావోదయము గలుగును.

## శాస్త్రములు - కళలు.

వర్తమానమం దాంధ్రవాఙ్మయవాహినియం దన్నివిధముల గ్రంథజాలములు ప్రవహించుచున్నవి. పల్వలోదకమయిన పవిత్ర గౌతమీ ప్రవాహమున గలసి పునీతమైనభంగిని యాంధ్రత్వమును ప్రతిఫలించుచు నాంధ్రసందేశమును ప్రకటీకృతము గావించుచున్నందున నన్నిగ్రంథములు నాదరణీయములగుచున్నవి. ఉత్తమవిమర్శగ్రంథములును భాషాచారిత్రమును వాఙ్మయచారిత్రమును యింకను వెడలవలసియున్నవి. అభినవాంధ్రకవితాపితామహులగు రాయబహద్దరు కందుకూరి వీరేశ

లింగము పంతులుగారు కవిజీవితముల వ్రాసిరి. సారస్వతచరిత్రమునుగూడ వ్రాసి యాంధ్రలోకము నుద్ధరింతురుగాక! కాని దేశపరిస్థితులనుబట్టి శాస్త్రగ్రంథములు కళలనుబోధించుగ్రంథములు విస్తరిల్లవలసియున్నవి. వీనికి దగు పదసామగ్రికూడ మనభాషలో లేదు. అన్యభాషాపరిచయమునగాని శాస్త్రసంబంధములగు భావములు నామములు సువ్యక్తములుగ నాంధ్రమున బలుకబడ నేరవు. దేశభాషలలో గొన్నిట యీకొఱంత కొంతవఱకు దీర్చుకొనబడుచున్నది. అఖిలభారతపండిత సమ్మేళమునగాని సర్వజనసమాదరణీయములగు పదములు నిర్ణయింపబడుటకు వీలుకాదు. అట్టిపనికయి పండితులు గడగుదురుగాక! ఆంధ్రనిఘంటువునందయిన కొంత యత్నము సలుపబడునని యోచించుచున్నారము. గ్రంథాలయము లన్నివిధముల శాస్త్రములు కళలు వృద్ధిజెందు నుపాయము లన్వేషింప కృషి సల్పుచుండుట నీయంశ మిచ్చట జర్చించితిని.

## ఉ ప సం హా ర ము.

సావధానచిత్తులై యాదరభావముతో సోదరప్రీతితో నానుడువుల నింతవఱకు నాలించిన తమకు పునఃవందనము లాచరించుచున్నాడను. భారతవర్షమున నాంధ్రమాతకు బుత్రులమై జనించిన మనభాగ్యమునకు పరాత్పరుని గొనియాడుచుంటిమి. సకలజాత్యభీష్టసంధాతయగు గజన్నిర్మాత మనహృదయముల నాత్మావబోధమగు శుద్ధాంధ్రతత్వప్రకాశమును నెలకొల్పియున్నాడు. అఖిలభారతజాతీయతత్వమున నాంధ్రవ్యక్తిప్రత్యేకత్వ విధానమున నిమిడియున్నది కాని భిన్నముకాదు. ఆంధ్రజాతీయతత్వవిస్ఫురణమునకు మూలాధారరూపమగు నీ గ్రంథాలయోద్యమమును పరాత్పరుఁ డనుగ్రహించి సంపూర్ణసంపదలతో దులదూగ జేయుగాక!! తదుద్యమనాయకులు చిరాయురున్నతుల విలసిల్లుదురు గాక!!

---

# ఎవరు ముద్దు ?

సంజకెంజాయమిసిమిచే సొరుగాంచి
నిండుగా విరిసిన పూలనెవళమ్ము
చూడ్కులకును సౌభాగ్యముల్ సొగసుఁగూర్ప
చిత్రచిత్రముగను వెల్గు చిచ్చుబుడ్డి
మీఁద నెంతయు సొంపుగా మీరుచుండు
కృత్రిమపుఁజెట్టురీతిగా నెసగి గుబురుఁ
జెన్నుఁజక్కని పొందిక నెలఁగి సొంపు
కలిమిఁగురుపించు జవ్వని కరణిఁ దోఁచె
నొక గులాబిచెట్టు కనుల కుత్సవముగ.

కన్నెయొక్కరితె గులాబి కడకుఁ జేరి
నిలువఁబడి మానసంబున నివ్వెఱపడి
చూడ్కిఁ దల్లగ్నముం జేసి చూచిచూచి
తన్మధురతఁ గన్నవతోడఁ ద్రావుచుండె.

మధురముగభీరముం గడు మంజులంబు
నయిన పూవుమొగమ్ములో నందముగను
సరసముగను జీవనగవు సలుపుచున్న
యా గులాబి కన్నియఁ గని యాత్మయందుఁ
గన్నె యొక తీరు భావంబుఁ గాంచఁజొచ్చె.

తీవియందును గంభీరభావమందు
సొరునందును మాధుర్యసరణియందు
నెంతయేని తన నతిశయించెనంచు
నా గులాబికన్నె విభవమందు లేక
మీను చిత్రంబునందు వహింపఁబోలు !

చిత్త మెంతో నిర్మలమయి చెలఁగుఁగాక
భావమది యుదారమగుచు వరలుఁగాక
కోమలమునగుఁగాక యా కోమలాంగి
హృదయఫలకమున రవంత యీను సోఁక.
సోఁకినంతనె దోష మెంచుటయెఁ జనునె ?
ఉన్నతివహింప నెంచుచునుండువారు
సమతఁ దమతోడఁ గోరెదు జనులవిభవ
సంపదల ననూయఁ గనుట సహజమొకద ?

పాదులకు నీరు వోయుటవలన లవము
కందియుఁ గడు సొంపగు వ్రేళ్ళు కఠినమతిని
నందమౌ నొక్క పూవుపై నాసఁగొనుచు

తోడిమమీదను జేరిచి త్రుంపఁబోయి
మనసురాక గాఁబోలు నాక్షణమునందె
చేయివెనుకకు మరలించి చిత్రగీతి
నిడుదదేహంబు చెట్టుతో నెమ్మిసలుప
నొక్కతీరుగా వీక్షించుచుండె నపుడు

సుగుణమైన గులాబీపై మానసమ్ము
నిలిపి యుండఁగ సగమున వెలయుచుండు
తమ్మితీఁగియపజ్జవాన్షమ్ముగాఁగ
నగములం జేర్చి విరియు తామరలతోడ
సగసమాడు మిత్రుని గన్నెయగయాలేదు.

గాన మన్న నుల్లాసంబు కలదుగాని
నిర్మలాంబరమునఁ గడు నెమ్మదిగను
"కృష్ణ! కృష్ణా!" యటంచును గీర్తనమ్ము
జేయు గరుడిపాటను జెవిఁ జేర్పలేదు.

ఒంటిగానున్న కన్నెను గొంటెతనము
గాఁగ దరిఁజేరి ముంగురుల్ గదలఁజేయు
గంధవహుని విలాసమ్ముఁ గాంచలేదు
గరువపుం గులాబి కుసుమముఁ గాంచుచున్న
చూడ్కి మరలింపలేదేమి చోద్యమొక్కద ?

చూచి చూచి సౌందర్యంబు చూఱఁగొనియుఁ
దృప్తిఁగనలేక యానంద మెచ్చిపోవ—
గోయఁబోయిన పూవును గొంతవడికిఁ
దెలివివచ్చి చెలువగు పాలుపుఁగల్గు
మోముఁజేరిచి తా నొక్క ముద్దుఁగొనియె
నెంతహర్షమ్ము మది నావరించెనోటు !

కమ్మతావులు వెదజల్లు కలిమిఁ గల్గు
వెడదవ్రేలచే గర్వించి విఱ్ఱవీగు
నా గులాబికన్నియయె ముద్దా ? మనోజ్ఞ
మైనమోము నెత్తమ్మికి వాసిలమదియుఁ
గొంత రమ్యమౌ తీరుగు గూర్పు నెసగు
నామనోహరమూర్తి ముద్దా ? వచింపు
మొకరు ముద్దు ? ... ...

—గుగ్గిరాల రాఘవచంద్రచౌదరి.

---

# నాల్గవ కృష్ణామండల గ్రంథాలయ సభ.

సభాధ్యక్షులగు బారిష్టరు కందుల వీరరాఘవస్వామినాయుడుగారి ఉపన్యాసములోని కొన్ని భాగములు:—

పూర్వకాలమునం దున్నతస్థితిని వహించిన ప్రపంచమునందలి ప్రతిదేశమునందును గ్రంథరాశి మిక్కుటముగ జేర్పఁబడి విద్వాంసులకెల్ల నుపయోగకరములుగ నుండెను. అస్సీరియా దేశ మున్నతస్థితియందున్న కాలములో నా దేశప్రభువు లాకాలమునందలి యుద్గ్రంథములఁ బలకలపై వ్రాయించి యొక గొప్పభాండాగారమును గూర్చియున్న విషయమును, ఆదలి గ్రంథము లిప్పటికిని నిలిచియుండి వేనోళ్ల శ్లాఘింపఁబడుచున్నవి. అలెగ్జాండ్రియా మహాపట్టణమున లక్షలకొలది యుద్గ్రంథములతో నిండియుండిన గ్రంథాలయ మొకటి నిలసిల్లియుండి విద్వత్కోటి కాహ్లాదజనకముగ జాలకాలముండి, యొక మహమ్మదీయ ప్రభుని దురాగ్రహమున కాహుతియయ్యెను.

మనభరతవర్షమునందు సయితము యూరోపుదేశము గ్రీసుదేశము మున్నగు దేశములన్నియును గాఢాంధకారమున మునిగియున్నప్పుడు జ్ఞానజ్యోతి భరతవర్షమున దేదీప్యమానముగఁ బ్రకాశింప సాగెను. ఆ కాలపు మహారాజులు, చక్రవర్తులు, విద్వాంసుల ఉపయోగమునకై అసమానగ్రంథరాసిని గూర్చి, విద్వత్ప్రపంచమునకమితోపకారముఁ గావించియున్నారు! వేదము వేదాంగములును, పురాణములును, శిల్ప వాస్తు, జ్యోతిశ్శాస్త్రములును వైద్యగ్రంథములును వెలువడినవి. ఆర్యుల మాతృభాషయగు సంస్కృతభాషయొక్క ఘనత యింతయని వర్ణింప నేరికిని శక్యము గాదు!

"హిందూ సారస్వతములో, తగుభాగమును పఠించుటకు నొకమానవుని జీవితము చాలద"ని సర్ విల్లియము జోన్సుదొరవారు నుడివియున్నారు. "ప్రస్తుతమున నిలి

చియున్న సంస్కృత లిఖితగ్రంథములయొక్క సంఖ్య పదివేలు. ఈసంఖ్య గ్రీసు ఇటలీదేశముల రెండింటి యొక్క యుద్గ్రంథముల సంఖ్యకన్న నధికముగానుండు న”ని మ్యాక్సుముల్లరు పండితుండు నుడివియున్నాడు. ఇక్లే రివరెండువార్డు దొరవారును మ్యానింగను యువతీ గత్నమును నుడివియున్నారు. ఇట్టి యమూల్యములైన గ్రంథములను సేకరించుట మితిమీరిన ధనమును గూర్చుటయేగదా!

## గ్రంథాలయములయొక్క యావశ్యకత

మనదేశమునందు ఈస్టిండియాసంఘమువారి ప్రభుత్వపాలనలో చివఱకు ఏదియో యొక విధమున గాజ్యాంగమువారి ప్రయత్నమువలనను విదేశీయమతాచార్యులయుదారత్వమునను రాను రాను స్వదేశీయుల శ్రద్ధవలనను పాఠశాల లేర్పడి హిందూబాలురు విద్య నభ్యసించుచున్నారు. కాని కృతార్థులైనతోడనే యొజ్జల పాఠములను యొజ్జలకే యొప్పజెప్పి యేలేఖకవృత్తి యందో ప్రవేశించి కాలముబుచ్చుచున్నారు. సద్గ్రంథపఠనమునందొకానొకప్పు డభిమానముపుట్టినను, గ్రంథములు కొనుటకు తగినయుపాధి లేకపోవుటచే అట్టికోరిక సఫలము కాకపోవుచున్నది. ఒక్క లేఖకవృత్తియందున్న వారికిమాత్రమే కాదు. ఎంత సంపన్నగృహస్థునకును తాను చదువదలచిన ప్రతిగ్రంథమును కొనుటకు సాధ్యపడదు. సాధ్యపడినను దానివలన ప్రయోజనము నుండదు. నవలలు, చరిత్రలు- సాధారణనాటకములు మున్నగునవి యొక్కతడవకన్న నెక్కువగా చదువవలసిన యవసరముండదుకదా? కావున బీదలకు సామాన్య జనులకు ధనికులకు చదువ ననువగుమార్గము పుస్తకభాండాగారములను స్థాపించుటయేయై యున్నది.

## గ్రంథాలయము లెవరు నెలకొల్పవలెను?

పాఠశాల నెట్టివారు నెలకొల్పుచున్నారో గ్రంథాలయములును నట్టివారే నెలకొలుపవలయు నని నా యభిప్రాయము. బాలికాబాలురులకు విద్యాభివృద్ధికై పాఠశాలల నేర్పఱచుట రాజ్యాంగమువారి కెట్టి బాధ్యతయో స్త్రీపురుషుల జ్ఞాననేత్రమును వికసింపజేయుటకు గ్రంథాలయముల నెలకొల్పుటయు నట్టి బాధ్యతయేయైయున్నది. ఇట్లనుటచే తదితరులమీద నట్టి భారము లేదని నా యభిప్రాయమెంతమాత్రము గాదు. గ్రంథాలయనిర్మాణభారము ముఖ్యముగా పట్టణములయందు పురపారిశుద్ధ్యసంఘమువారియందును గ్రామములయందు స్థానికపరిపాలనాశాఖవారియందును నున్నయది. విజయవాడ పురపారిశుద్ధ్యసంఘమువారు తమ పట్టణమునందలి రామమోహనగ్రంథాలయమునకు గొంత విరాళము నిచ్చియున్నారు. మా రాజమహేంద్ర పురపారిశుద్ధ్యసంఘమువారు ఆ పట్టణమునందలి సర్వజన పుస్తకభాండాగారమునకు గొంత సాంవత్సరికవిరాళమును నిచ్చుట మాత్రమేగాక గోదావరీతీరమునందలి కొంతస్థలమును నయితము గ్రంథాలయనిర్మాణమునకై సులభమగు విలువకు నొసంగియున్నారు. ఇందులకు రాజ్యాంగమువారును సమ్మతించినారు.

కావున గ్రంథాలయాధికారులిక ముందు పైసంఘముల వారిని ధైర్యముగ సాంవత్సరిక విరాళములను గ్రంథాలయనిర్మాణమునకగు వ్యయములో కొంతభాగమును గోరవచ్చును. ప్రజాప్రతినిధు లిందుకు సుముఖులుగా నుండరు.

## గ్రంథాలయములయం దెట్టిగ్రంథము లుండవలెను?

“జనసామాన్యమునకు ప్రతి విషయమును గూర్చియు అనుభవజ్ఞుల యభిప్రాయములను సులభముగ దెలిసికొను గ్రంథములు ముఖ్యముగా ప్రతిగ్రంథాలయమునందును నుండవచ్చును.” ప్రపంచమునం దిపుడున్నట్టియు మున్ను చన్నట్టియు జ్ఞాననిధుల విజ్ఞానము సామాన్య జనులకు లభింపజేయుటయే గ్రంథాలయాధికారుల ముఖ్యోద్దేశముగ నుండవలయును. నీతిదాయకములును, మనపురోవృద్ధికి మూలకారణములును నగు గ్రంథరాజముల సేకరించుట ముఖ్యావశ్యకము! సంస్కృతభాషావ్యాప్తి ప్రస్తుతము మితముగనున్నను ఆభాషయందలి కావ్యాదులును లక్షణగ్రంథములును నీతిశాస్త్రములును ధర్మశాస్త్రములును గణిత, అర్థ, శిల్ప, వాస్తుజ్యోతిశ్శాస్త్రములును గూర్పవలయును. ముఖ్యముగా చరిత్రలును, జనుల హక్కులను దెలిపెడి గ్రంథములను మిక్కుటముగ జేర్పవలయును. ప్రతి గ్రంథాలయమునందును బాలురకు విచిత్రములగు కథలను దెలుపుగ్రంథములును, స్త్రీలు గృహనిర్వాహణనిపుణలగునట్లు బోధించు పుస్తకములును పండితులకు సా

స్వతమును బోధించు గ్రంథరాజములును వృద్ధులకు ఆధ్యాత్మికమును దెలుపు సద్గ్రంథములును నుండవలయును.

చేతిపను లమితముగానున్న ప్రదేశములందలి గ్రంథాలయములయం దట్టి చేతిపనులనుగూర్చి తెలియఁజేయు గ్రంథములను, వర్తక మమితముగానున్న ప్రదేశములయందు వర్తకపు నేర్పులను, ధరలను, సరకులు లభించు ప్రదేశములను, దెలుపు గ్రంథములును ముఖ్యముగాఁ జేర్పవలయును. మనము నాగరికతగల ప్రదేశములతో సంబంధము కలుగఁజేసికొనవలయునన్నను, నూతన శాస్త్రములను, ప్రస్తుతయుద్ధపద్ధతులను, శస్త్రాస్త్రవిషయములను దెలిసికొనవలయునన్నను మనమింగ్లీషుగ్రంథముల నమితముగ సేకరింపవలయును. ఇంగ్లీషుగ్రంథములఁ గూడఁ జేర్చినగాని మన గ్రంథాలయములవలన గలుగవలసినంత ప్రయోజనము కలుగ నేరదు.

## గ్రంథాలయములు ప్రజల నాకర్షించునట్లు చేయుట?

నాగరకాగ్రేసరు లగు అమెరికాదేశస్థులవలె మన గ్రంథాలయములను జనులనాకర్షించునవిగా జేయవలయును. ఇయ్యది గ్రంథాలయములు నిర్మించు ప్రదేశములు మిగుల ననుకూలముగ నుండునటుల చూచుటచేతను విశాలముగను రమణీయముగను నుండు గృహములను నిర్మించుటచేతను నట్టిగృహముల నుచితరీతి నలంకరించుటచేతను అందు సర్వజనులకు సామాన్యముగ కావలసినవస్తువులను సేకరించి యుంచుటచేతను జనుల నాకర్షింపవచ్చును. ఇందు దినవార్తాపత్రికలను, మాసపత్రికలను, చిత్రపటములతోనుండు పత్రికలను జేర్పవలయును. ఈగ్రంథాలయములను జేర్చి సారస్వతమును గూర్చిగాని సంస్కరణమును ప్రోత్సాహమును జేయునట్టిగాని రాజ్యాంగములను చర్చించునట్టిగాని సమాజములు స్థాపింపబడవలయును. పర్వదినములయందు తగు పౌరాణికులవలన పురాణముల జదివించి గ్రామస్థులకు వినిపించుటగాని ప్రజోపయోగములగు విషయములనుగూర్చి యుపన్యాసముల నిప్పించుటగాని యొనర్చుచుండవలయును. సత్కవుల గ్రంథములలోని చక్కనిపద్యములను చదివి వినిపించుటవల్లను కొన్నిగ్రంథములలోని సంగతుల నుపన్యాసములమూలమున ప్రజలకు దెలియఁజేయుటవల్లను గ్రంథములను జదువవలయునను యాసక్తి జనింపఁజేయవలయును. ఇతరప్రదర్శనములతోఁబాటు గ్రంథప్రదర్శనమును నొకశాఖగా నేర్పఱచుట ప్రయోజనకారిగా నుండకమానదు.

## తీర్మానములు.

౧ కైకలూరు తాలూకా కోరుకొల్లు గ్రామమున నున్న 'శ్రీరామగ్రంథాలయమునకు గృహనిర్మాణముఁ గావించుకొనుటకు సుమారు రు. 800 లు విలువగల యిరువదిసెంట్ల స్థలమును దాన మొసగిన శ్రీచన్నంశెట్టి సీతారామయ్యగారి కుమారుఁడు వెంకయ్యగారి యౌదార్యమున కీసభవార లెంతయు నభినందించుచు ప్రతి గ్రామములోను తగు విధముల గ్రంథాలయములకు సహాయ మొనర్ప మహాజనుల నీసభవారు ప్రార్థించుచున్నారు.

౨ కృష్ణాజిల్లాయందున్న అన్నిపట్టణములయందును, ముఖ్యగ్రామములయందును గ్రంథాలయములను బఠనమందిరములను స్థాపించవలెనని మండలప్రజల నీసభవారు ప్రార్థించుచున్నారు.

౩ (క) కృష్ణామండలమందున్న గ్రంథాలయములకును బఠనమందిరములకును డిస్ట్రిక్టు తాలూకాబోర్డులయొక్కయు మునిసిపాలిటీలయొక్కయు ద్రవ్యములనుండి విరాళముల నొసంగుటకును. (చ) ఈ జిల్లాలయందున్న గ్రంథాలయములన్నిటికిఁ బ్రభుత్వము వారిచేఁ బ్రచురింపఁబడుచున్న వ్యవసాయ కారోగ్య పారిశ్రామిక వాణిజ్య ప్రచురముల నన్నిఁటిని యుచితముగా నొసంగుటకును ప్రభుత్వమువారి నీ సభవారు ప్రార్థించుచున్నారు.

౪ కృష్ణాజిల్లా గ్రంథాలయసంఘము పక్షమున (౧) నిడమర్తి లక్ష్మీనారాయణగారు, (౨) నంగల్వల సత్యనారాయణ గారు, (౩) దుగ్గిరాల వేంకట సుబ్బయ్య గారు వైసాలునఁ గార్యదర్శులుగా నుండుటకు ఈ సభవారు కోరుచున్నారు.

౫ గ్రంథాలయము లన్నియు దేశభాషావాఙ్మయచరిత్రాభివృద్ధికై తమకు సమీపగ్రామముల యందున్న ప్రాచీన తాళపత్ర గ్రంథములు రాగి శాసనములు మొదలగునవి సంపాదించి పిఠాపురమునందు స్థాపించిన యాంధ్ర పరిశోధక మహామండలికి బంపుదని యీ సభ

వారు కోరుచున్నారు. బహుజనాభిప్రాయముమీఁద నీ తీర్మానమంగీకృత మయ్యెను.

అనంతర మీక్రింది గ్రంథాలయములను గూర్చిన చరిత్రములను ఆయా గ్రంథాలయముల ప్రతినిధులు చదివిరి:—౧ శ్రీ భారతీ గ్రంథాలయము మాధవరం. ౨ శ్రీ పఠనాలయము:—తాళ్ళపూడి:—౩ శ్రీలక్ష్మీనృసింహ పుస్తకభాండాగారము, కుమారదేవము. ౪ శ్రీ మల్లేశ్వర పుస్తకభాండాగారం, జగన్నాథపురం. ౫ నన్నయ భట్టారక గ్రంథాలయము.

---

# ఓ నల్ల మేఘమా?

ఎందుకే ఎందుకే ఓనల్ల మేఘమా,
అందుకో రాకుండ ఎగిరిపోతావే ?
అబ్బాయి, అబ్బాయి, అందుకోబోకుమా,
నను బట్టుకోలేరు నీలాంటివాళ్ళు,
ఎక్కడికిపోతావు ఓ నల్లమేఘమా
నన్ను నీతోగూడ తీసుకోపోవే !
దూరదేశాలకూ పోయివస్తానురా
అబ్బాయి నాతోటి నీవు రాలేవు.
దూరదేశాలన్ని నేను చూస్తాను, (నే)
వీపుమీదెక్కించి తీసుకోపోవే,
దూరదేశాలకూ నీవు రాలేవురా
నా వీపుమీదెక్కి కూర్చుండలేవు
పోనిపోనీగాని, ఓనల్లమేఘమా,
ఎక్కడికిపోతావో చెప్పవే నాకు !
అల్లా సముద్రానికిపుడు పోతానురా,
మంచినీళ్ళన్ని త్రాగి మళ్ళీ వస్తాను.
ఆసముద్రంలోను ఏమేమి ఉంటాయి,
ఆడుకోవచ్చునే వేటితోనైన ?
ఓడలూ, నావలూ, అచ్చటుంటాయిరా,
ఆడుకోలేవురా వాటితో నీవు
మానాన్న నాకొక్క ఓడకొనియిచ్చేను
ఓడతో నావతో ఆడుకోగలనె.
వద్దురా వద్దురా, నీవు రాలేవురా.
వస్తాను వస్తాను తీసుకోపోవె.
రాబోకు రాబోకు
వస్తాను వస్తాను
వద్దమ్మ వద్దమ్మ
వస్తానుసుమ్మ.

---

# గ్రంథాలయోద్యమము - దానిపవిత్రత.

పూర్వకాలమున మహోన్నతపదవి నధిష్ఠించి మధ్యకాలమున అతి నికృష్టదశయందుండిన మన భారతదేశము యిరువదియవశతాబ్ద మారంభింపఁగనే, వసంతాగమంబునందు వనరాజంబునుంబలె నలుదెసలను జాతీయభావంబులు మొలకలెత్త, నాయకపికద్విజంబులు జాతీయనానారావంబులచే, కలకలాయితమై చూపరుల యుల్లంబులఁ బల్లవింపఁ జేయుటయేకాక, ప్రతి భారతీయుని హృదయసీమయందును నేదియో యస్పష్టంబగు నుత్కంఠతనుత్రేయోభిలాషను బాదుకొల్పినది. ఈ యుత్కంఠయు శ్రేయోభిలాషయు ప్రతికాలము వారియొక్క సంఘీభావ రూపముగను, బంగాళా విభజననిరోధరూపముగను, ముసల్మానుసంఘాదిరూపముగను, నవవిశ్వవిద్యాలయాది రూపముగను, బీహారపృథగ్రాష్ట్రాది రూపముగను బరిణమించినది. వెంటనే యాయావేళమే ఆంధ్రరాష్ట్రాదర్శము నుపాయముగాఁ జేసికొని సర్వతోముఖోత్సాహభరితంబగు నాంధ్రోద్యమముగాఁ బరిణమించినది. ఇది యన్నిపథముల నాంధ్రులనుద్ధరింపఁ దలపెట్టినను ముఖ్యముగా రెండు రాజకీయేతరములగు రూపములఁ గలిగి యున్నది. ౧ ఆంధ్రసాహిత్య విజ్ఞానాభివృద్ధి ౨ గ్రంథాలయముల విస్తరింపఁ జేయుట.

పై యుద్యమముల పేరువిన్నంతనే యేలికయినను కొన్ని సందియములు పుట్టక మానవు. ఇట్టి జాతీయోద్యమములకు దగినయోగ్యత జనసామాన్యమున కున్నదా?

ఇపు డెంతవరకు వ్యాపించ వీలున్నది? దీని యవధి యేమి? దీని ప్రయోజనమేమి? ఇపుడట్లు వ్యాపింపమికి కారణము లేమి? ఇట్టిప్రశ్న లెన్నియో పుట్టును. పుట్టినవి. మనము శాంతతతో విచారించినచో వీనికవకాశము లేకపోలేదని తెలియును కాని యిట్టి ప్రశ్నల కిపుడు ప్రత్యుత్తరముల నీయఁజాలము. దేశాంతరములయందు త్వరగా వ్యాపించి శీఘ్రముగనే యా దేశములను సమున్నతస్థితులకుఁ దెచ్చిన జాతీయోద్యమము లీదేశమున వ్యాపింపమికి పై కారణములు కొన్ని కొంతవఱకైనను పనిచేయుచుండవలెను. అందుకు మనదేశము నితర దేశములతో నవంత పోల్చి చూచెదము. ఆధునిక నాగరికత కగ్రగణ్యములగు నితర దేశములలో ప్రారంభవిద్యసార్వజనీనమై యున్నది. ప్రాచీననాగరికత కగ్రగణ్యమగు మన దేశమున నదియే శూన్యప్రాయమై యున్నది. ఆధునికోన్నతి గల దేశములవారి సారస్వత స్వభావము సర్వజనసంగతమగుటచేతని సకలవిద్యలను బ్రకటించుటయై యుండెను. ప్రాచీనోన్నతిగల మన దేశపు సారస్వతస్వభావము మొన్న మొన్నటివఱకును పండితైకగోచరమగు శైలిని శాస్త్రవిజ్ఞానమును బ్రకటించుటయై యుండెను. అచట రాజకీయవ్యవహారములును నాధ్యాత్మిక లేక ధార్మిక వ్యవహారములును దేశభాషలలోనే చాలాకాలమునుండి జరుగుచుండెను. ఇచ్చట నన్నో రాజకీయవ్యవహారములు విదేశభాషలలోను ధార్మిక వ్యవహారములు జనసామాన్యమున కగమ్యగోచరమగు సంస్కృతభాషలోను జరుగుచున్నవి. అందుచే నా దేశముల గ్రంథాలయోద్యమము మూడుపువ్వులు నారుకాయలుగా నొప్పారుచున్నది. పై చెప్పిన కారణములచేతనే యీ దేశమున, పాశ్చాత్యమార్గానుసారముగ నీ గ్రంథాలయోద్యమ మిప్పుడిప్పుడు మొలక లెత్తి క్రమవృద్ధి నొందుచున్నది.

౧౮౭౦ సం॥న నాటికి ౮౩ ప్రాప్తిని, పాఠశాలలకుఁ బోదగినవారిలో పాఠశాలలకు బోవువారుగల యాంగ్లదేశము షుమారు పాతిక సంవత్సరముల క్రిందటనే అట్టి వయస్సుగలవారిలో పాఠశాలలకుపోనివారు లేరు అనిపించుకొనఁ గలిగినది. అమెరికా దేశమున ౧౯౧౩ సం॥న పాఠశాలలకుఁ బోదగిన ౨౫ కోట్ల జనములోను ౧౮ కోట్లమాత్రమే పాఠశాలలకుఁబోవుచున్నను అమెరికనులందఱునుఁ బోవుచున్నట్లే. ఏలయన మిగిలిన ౭ కోటుల జనమునుఁ బరదేశీయులై యుందురు.

ఇఁక మన దేశస్థితి చూచెదము. జనసామాన్యమునకై ప్రభుత్వము విద్యాసంస్థలను పాఠశాలలను ఏర్పఱచుట మన పూర్వులలో నున్నట్లు కానము. విద్యల సంపాదించిన తర్వాత ప్రభువులచే బహుమానింపఁబడుచుఁ గాని లేకయే గాని గురుకులముల, విద్యాభ్యాసమును దేశీయమార్గముల ననుసరించి చేయు యువకుల సంఖ్య నానాటికి తీసిపోవుచున్నది. ఆంగ్ల ప్రభువులు విద్యాశాఖ నేర్పాటుచేసి పాఠశాలలఁ బెంచినకొలఁదిని జనసామాన్యమునందునుఁగూడ నక్షరజ్ఞానము క్రమముగ హెచ్చుచున్నది. కాని యిప్పటికిని మొత్తముమీఁద హిందూదేశములో నొక యుత్తరమును వ్రాయను చదువను నేర్చినవారు ౧౦౦ కి ౫ మందికంటె నెక్కువ లేరు. ౧౦-౧౫ సం॥ మధ్యవయస్సుగల బాలురలో విద్య నభ్యసించువారు నూటికి ౨౩.౫ కంటె ఎక్కువ లేరు. ఇంతియకాదు. అట్టి విద్యాభ్యాస కాలము గడచినమీఁదట ౧౫-౨౦ సం॥ లమధ్యవయస్సువారిలో సాక్షరులు అని చెప్పఁదగినవారు ౧౦౦ కి ౯ కంటె ఎక్కువలేరు. స్త్రీలలోనన్నో ౧౫-౨౦ మధ్యవయస్సుగలవారిలో నూటికి ౨ మాత్రమే. మొత్తముమీఁద నన్నో ౧౦౦ కి ౧ మాత్రమే. ఇదియైనను యిప్పటి బాలికాపాఠశాలా పద్ధతివలన కల్గినది. భారతరాజ్య మంతటిలోను స్త్రీ పురుషుల విద్యావిషయమున ప్రథమముగ బర్మా రాష్ట్రమును, ద్వితీయముగ తిరువాన్కూరును నిలుచుచున్నవి. మన రాజధాని, అందును మనయాంధ్రదేశము యిప్పటికిని దానికంటె చాల వెనుక బడియేయున్నది. అయినను, యీ సందర్భమున నొకటివక్కాణింపసాహసించుచున్నాను. విద్యాసంపాదనమునందలి కృతక సాధనములగు పఠన లేఖనములను సామగ్రియు, ఆధునిక పాశ్చాత్యజ్ఞాన సంపత్తియు లేకున్నను, మనదేశమున నిరక్షరకుక్షు లని మనమనుకొనుచున్నవారిలో ప్రతికులములోను, సాంప్రదాయ రూపముగాగాని, కథాకీర్తనాది రూపముగాగాని సంగ్రహింపఁబడిన మన ప్రాచీన విజ్ఞానముకలవారు చాలామంది కల

రు. అయితే వారు మన వెనుకటి పురుషాంతరము వారగుటచేఁ గ్రమముగ నుత్పన్నులు కానున్నారు. ప్రస్తుత రాజభావ విదేశీయమగుటచే వారి తెల్వితేటలు రాణకు వచ్చుటలేదు. ధార్మికభావ వారికి స్వాధీనము లేమిచేతను, యిప్పటివారి కాలమంతయు నన్యదేశీయ, రీతి నీతి వ్యవహారాధ్యయనములనె వినియోగింపఁబడుటచేతను మన జాతీయ విజ్ఞానము తగినంతగా నిపుడు విస్తరించుటలేదు.

ఇంతియకాక మధ్యకాలమున మన దేశము విదేశీయుల దండయాత్రలచేతను, స్వదేశీయుల పరస్పరాంతఃకలహములచేతను, అరాజకములచేతను, కరువులచేతను, దుష్టరాజాది పీడలచేతను నానాకష్టములకును బాల్పడుటచేత, నిన్న మొన్నటివఱకును దస్సియున్న యున్నదై ఎట్టకేలకు తెప్పరిల మొదలిడినది. ఈ యుద్బోధము యీ పునరుజ్జీవము, యీ యభినవశక్తి విజృంభణము, శాఖోపశాఖా రూపమున నభివృద్ధినొంది మన దేశమును కాలక్రమమున మహోన్నతదశకు దెచ్చుననుటకు సందియములేదు.

ఇందుకు ముఖ్యోపాయములలో నొక్కటి గ్రంథాలయోద్యమమే— ఇంతవఱకు మన దేశముయొక్క పూర్వస్థితిని యిప్పటిస్థితిని, మన దేశస్థితిని పరదేశస్థితితో బోల్చి చూపుటలోను కాలము గడపినందులకు వన్నుమన్నింతురుగాక! నా యభిప్రాయమేమన (౧) పూర్వకాలమునుండి యానుపూర్విగా వచ్చుచున్న మన జాతీయవిజ్ఞానాదికము పోకుండఁ బట్టవలెనన్నను, (౨) క్రొత్తగఁ గొలఁది కాలమునుండి మనకు బ్రసన్నమయిన యభినవవిజ్ఞానమును నాత్మసాత్కరించుకొనవలెనన్నను, (౩) జనసామాన్యమును విద్యాలోలురఁ జేయవలెనన్నను, (౪) పూర్వాచారపరాయణుల జనసామాన్యముతో సమ్మతులఁ జేయవలెనన్నను, (౫) నవీన విజ్ఞానమధువునుమాత్రమే గ్రోలి లోకాయతికులయి పోవుచున్న యాధునికుల, మన జాతిధర్మానుసారముగను మానవధర్మానుసారముగను నాధ్యాత్మికమార్గమునఁ గూడఁ బ్రవేశపెట్టవలెనన్నను (౬) ఆధ్యాత్మికాది విద్యాభూయిష్ఠమగు ప్రాచీనవిద్యాప్రవాదంబున నోలలాడుచుఁ బ్రపంచజ్ఞానమును నవీనపరివర్తనములనుఁ దృణీకరించుఁ బూర్వాచారపరాయణుల లక్షణజ్ఞానముతోపాటు లక్ష్యజ్ఞానముఁగూడఁ గలవారిగాఁ జేయవలెనన్నను, నీగ్రంథాలయోద్యమమే అమోఘరసాయనము. ఇదియే తరణోపాయము. ఇదియే పరమధర్మము. అని నిస్సందేహముగ నిట్టి మహాప్రయోజనములుగల యీ యుద్యమము నెడఁ గూడ, లేనిపోని యపోహలఁ బెట్టుకొనిగాని, దాని విలువలఁ గ్రహింపలేమిచే తుస్కరించిగాని, యపకారులగువారు కలరు. అట్టి పురోభాగులను, నట్టి యశక్తదుర్జనులను సరకుసేయక తాఁ బూనినయీ ధర్మోద్యమదీక్షను నిర్వక్రమముగఁ జరుపుటయే యీ యుద్యమమునఁ బ్రవేశించిన ప్రతియాంధ్రునికిని కర్తవ్యమని నా నమ్మకము. ఏలయన నిది సర్వవిధముల విద్యను జనసామాన్యమున విరఁజల్లుటకును పైన సూత్రప్రాయముగ సూచించిన నీయుద్దేశ్యములను నెఱవేర్చుటకును మాత్రమే పుట్టి పెరుగుచున్నదియని, నేను గట్టిగ నమ్ముచున్నాడను.

రాజకీయక్షేత్రమున గుంటూరు పురంబున నాంధ్రరాష్ట్రసమస్యాంకురములుదయించి యెటు సస్యరూపము నొందుచున్నవో యటులనే విద్యాక్షేత్రంబున విజయవాటికాపురంబున గ్రంథాలయ సమస్యాంకురములుదయించి కొలఁదికాలములోనే తామరతంపరలుగా నైరయి వెలుంగుచున్నవి. అది రాష్ట్రోద్యమము రాజనీతిమార్గమున మాతృదేశము నుద్ధరింప సమకట్టినది. ఇది గ్రంథాలయోద్యమము విద్యామార్గమున నుద్ధరింప సమకట్టినది. కాన నిట్టి సదుద్యమము సర్వజనాదరణీయమని నొక్కి వక్కాణింపనగును.

ఈ యుద్యమము సలక్షణముగఁ గొనసాగవలెనన్నచో, పైనే సూచించిన యుద్దేశములు పూర్ణముగ నెరవేరవలెనన్నచో గ్రంథాలయములు చేయవలసిన విధులు పెక్కుగలవు. వానిలో నతిమతి ముఖ్యముయినవి రెండు అవి యెవ్వియన:—(౧) బోధకులతయారు చేయుట. (౨) బోధనను జరుపుట.

రెండవది మఱల రెండువిధములు:—(క) పాఠశాలలద్వారా. (ఖ) ఉపన్యాసములు, వాగ్వాదములు, ప్రసంగములద్వారా. ఇందుకు ముఖ్యసాధనములు రెండు:— (౧) అన్నివిధముల గ్రంథములుగల భాండారము (౨) మంచి పత్రికలుగల పఠనమందిరము. వీనికిఁ బ్రసం

గవళమున మఱియొకటి కలుపవచ్చును అది (౩) వ్యాయామశాలః—లేక తాలింఖానా.

వీనిలో నొక్కొక్కటియె తీసికొని నాకుతోఁచిన నాల్గుమాటలు ముచ్చటించెదను:—(౧) స్థితిగతులుగల ప్రతి గ్రంథాలయమును, జనసామాన్యములో చదువు రానివారికి నక్షరజ్ఞానము నిచ్చుటకును, గ్రంథములనుఁగాని, ఒక్కొక్క విషయమునకు సంబంధించిన పాత్రముల క్రమమునుగాని, వార్తాపత్రికాదులఁ బఠియించు క్రమమునుఁగాని, అందలి విషయమునుగాని యితరులకు బోధించుటకై బోధకులను కాలక్రమమున తయారుచేయుటకు బ్రయత్నించవలెను. గ్రంథాలయోద్యమమునకును దాని విద్యావ్యాపన ప్రకారమునకును "సాంప్రదాయము ఏర్పడవలెను." "సాంప్రదాయము" ఏర్పడనిచో స్థాయిస్వభావమేర్పడదు. ఇంతియగాక స్వవత వ్యాపనమునకు క్రైస్తవమిషనరీలు బైబిలుబోధకుల తయారుచేయు మార్గములనించుక యరసినచో నేరికైనను వానివిలువ మనస్సునకు దట్టకపోదు. అట్టి సాంప్రదాయమును నట్టి బోధకవర్గమును ప్రపంచములో నేర్పడిననె ఆయుద్యమము శాశ్వతమగును. ఈ రహస్యమునే భగవద్గీతా శాంకరభాష్యోపోద్ఘాతములోని "బ్రాహ్మణత్వేవరక్షితే రక్షితస్స్యాద్వైదికోధర్మః" యనువాక్యము స్ఫురణకుఁదెచ్చును.

౨ బోధనజరుపుట యనునది చాలాగ్రంథాలయములు వెంటనే యనుష్ఠించుటకు వీలయినవిధి. భాండారికుఁడు కార్యకుశలుఁడును బుద్ధిసూక్ష్మత, విశ్రాంతి, సదుద్దేశ్యము, ఓపికయు గలవాఁడైనచో వెంటనే పనిజరుగును. లేక గ్రంథాలయములు డబ్బుకలవైనచో వేరే యుపాధ్యాయు నేర్పరుచుకో వచ్చును. ఇది పైనుడివినతీరున రెండువిధముల సాగింపవచ్చును. (క) ప్రాథమిక పాఠశాలలను గ్రంథాలయముల కనుబంధములుగా నేర్పాటు చేయుటచేతను, ఇఁక సాధారణముగా పైన భాండారికునికిఁ జెప్పిన లక్షణములనుఁ గొన్నిఁటిఁగాని యన్నిటిఁగాని కలవారును, విశ్వవిద్యాలయపు చదువులలో దెబ్బఁదినిగాని లేకకాని, పరాఙ్ముఖులైనవారును నగుయువకుల ప్రియవచన విద్యార్థులుగఁ జేర్చుకొనవలెను. అచ్చటఁ బఠనీయములుగ నిర్ణయింపఁబడు పుస్తకములును పాఠములును నిప్పటివాటివలె అతిచుల్కని పిట్టకథలతో నిండినవిగాక మన దేశముయొక్క ప్రాచీనార్వాచీన నాగరికతా విషయములు బోధించునవిగా కొంతమట్టుకును, సామాజిక పత్రికలనుండియు కవితలనుండియు నుపాధ్యాయులచే గ్రహింపఁబడి, నూతన భావోత్తేజకములుగా నుండినవిగా కొంతమట్టుకును నుండవలెను. (ఖ) ఉత్సాహము కొలఁదిని సామాజికులు వాగ్వాదములను భిన్నభిన్న విషయములగుఱించి సల్పుచుండినచో పరస్పరేంగిత జ్ఞానములకు, నూతన భావోద్బోధమును గల్గును. అట్లై ఉపన్యాసములవల్లను, మనుకొనునంతగాఁగూడ సల్లాపముల వలనను గల్గును. ఇవి మఱి చుల్కనగా ననుష్ఠింపవచ్చును.

వీనికి సాధనములు రెంటిని వాక్రుచ్చితిని. వానిలో (౧) గ్రంథభాండాగారము. ఇదియేగదా మన ప్రకృతము. దీనిలోనా యా గ్రంథాలయముల స్థితిగతులకు దగినట్లు సర్వవిధ గ్రంథములను నుంచుటకుఁ బ్రయత్నించవలెను. వానిని భాండారికుఁడు (క) విషయములఁబట్టియును, (చ) గ్రంథకర్తలబట్టియును విభాగముఁజేసి పట్టీలను వ్రాయవలెను. (ట) ఇంతియగాక యొక్కొక శాస్త్రమున, లేక యొక్కొక సాహిత్యమున నేక్రమముగా గ్రంథముల జదువవగునో యట్టిసూచనలనుగూడ నేరుపరుపదగును. (త) విద్యలు విడఁదీయు నప్పుడు దేశీయ మార్గమునుఁబట్టియే సాధ్యమైనంతవఱకు విభజించినచో జనులకును రుచించును. గ్రాహ్యమునగును. (ప) ఇచటఁ గొందఱు గ్రామచరిత్రలుగూడఁ గ్రమముగా సమకూర్చుట కర్తవ్యముగా సూచించుచున్నారు. అది మన దేశములకు భావికాలమున చాల నుపయోగము కలదియగును.

౨ పఠనమందిరములు మన రెండవ సాధనము. ఇవి యంతటను తగురీతి నుపయోగింపఁబడుట లేదని నాయభిప్రాయము. భాండారికుఁడును మఱికొందఱును సంప్రదించుకొని, మాస, వార దిన పత్రికలలో వెలువడుచుండు ముఖ్యవిషయములను, ఒక్కొకటి లేక కొన్నికొన్ని, నొక్కరొకరే గ్రహించి, వాటిని గుఱించిన రేఖల నెక్కుడుశ్రద్ధతో జదువుచు భిన్నభిన్న కాలములయందు, నితరుల బోధార్థమై యుపన్యాసాదుల సల్పుచున్నచో చాల యుపయోగమగును. అట్టి సాధారణవిషయముల బోధించుచున్ననే, యిపుడు కొన్ని గ్రంథాలయ

ములలో తిలువలుమూసికొని కాపురముండు నీవిద్యాదేవ
తనుఁ బారద్రోల, జను లాబాలగోపాలమును, తండోప
తండములుగ దినదినమును వచ్చుచుందురు. అపుడు పఠన
మందిరములవలన సాక్షరులకును. నిరక్షరులకునుఁగూడ
నత్యంతోపయోగము కలుగును ప్రాథమికవిద్య యింకను
జనసామాన్యమునకు లేక, గ్రంథాలయోద్యమము
ప్రాతిపదికావస్థలోనే యున్న ఈ సమయములో నై
విధాన మత్యంతావశ్యకమని తోచుచున్నది.

గ్రంథాలయోద్యమముయొక్క యుపయోగము లింత
వఱకు చర్చించినపిమ్మట, వీనివిషయములోఁ గొన్ని
సమస్యలు అవశ్యముగాఁ దట్టువవి యీవటఁ బొందు
పరచక వీడఁజాలను, అవియెవ్వియన ఈ భాండార
ములలో 1 పాశ్చాత్యవిజ్ఞానమేనా-దేశీయముకూడనా?
మార్గము లెవ్వి? ప్రయోజనమేమి? 2 ఆంధ్రమేనా-
సంస్కృతముకూడనా? ప్రయోజనమేమి? మార్గము
లెవ్వి? 3 లౌకికమేనా- ధార్మికముకూడనా?
ప్రయోజనము లేమి? మార్గములెవ్వి?

1 దేశీయవిజ్ఞానమునకు తావులేదని సందియమేల
కలుగవలెను. ఆ గ్రంథములుమాత్రము లేవా? యని
ప్రతిప్రశ్న వచ్చును. నా యభిప్రాయము. ఇట్టి సమ
స్యను చర్చించుకొని రెండువిధములగు గ్రంథములకు
తగు ప్రాముఖ్యతనిచ్చి సంగ్రహించవలయును. అట్టివి
రెండు పెద్దశాఖ లున్నవని గ్రహింపవలెను. భేదమును
జ్ఞాపక ముంచుకొనవలెను. దాని నశింపకుండఁ జేయుటకు
మార్గముల నాలోచింపవలెను. ప్రయోజనము ఇతరుల
ననుకరించు దాసులు కాకుండ స్వజాతియొక్క పృథ
క్త్వమును కాపాడుకొనుటయె.

2 ఆంధ్రమేనా సంస్కృతముకూడనా యను
సమస్య మొదటిదానికి మూలకారణమై యున్నది.
నాకు తెలిసినంతలో నిపుడేర్పడుచున్న గ్రంథాలయ
ములలో సంస్కృతగ్రంథములు అత్యల్పములై యున్నవి.
ఆంధ్రగ్రంథములె ప్రధానముగా నుండవలెననుట నిర్వి
వాదాంశమే కాని సంస్కృతమున నెట్టిపదవి యుండవ
లెననునది మన నాగరికతయొక్క తత్త్వజ్ఞానమునుఁ బట్టి
యుండును. అది యిట చర్చించుటకు వలనుపడదు.
ఆంధ్రసంవత్సరాది సంచికలయందు చూడనగును. ప్ర
యోజనములును మార్గములును నట్లే విచారించనగును.

3 లౌకికమేనా ధార్మికముకూడనా యను సమ
స్యయును మొదటిది రెండవదివలెనే విచక్షణతో నాచ
రింపఁబడుచున్నదియును, యీ నా యుపన్యాసమున నే
పూర్వమున సూత్రప్రాయముగఁ జర్చించినట్టి స్థితి
మనస్సున దిగినగాని సరిగా నిలువ కనుగొనలేనిదియు
నయి యున్నది. ఇది మిగిలిన రెంటికి నాదికారణము.
దీనినిఁ బట్టియే మన భారతీయజాతియొక్క పృథక్
స్థితి నిల్చును. ధార్మికగ్రంథములనఁగా నాయభిప్రా
యము ఏయొక్క మతముగాని గ్రంథాలయముల తమ
సొంతసొత్తుగా నగునట్లు చేసికోవలయునని గాదు.
ఆ గ్రంథాలయపు ప్రచారముగల దేశభాగమునఁ బ్రసిద్ధ
మగు మతముల గ్రంథము లటయుండుట. ఎవరిమత
మును వారు చదువుకొని, మిత్రభావముతోను నన్యోన్య
గౌరవముతోను పరస్పరమతజ్ఞానమును సంపాదించుట.
ఇది విరోధములకే హేతువగునని కొందఱనుకొనవచ్చును.
కాని యది పొరపాటు. పరస్పరమతపరిచయకాజ్ఞాన
మే విరోధములకు హేతువుగాని జ్ఞానము కాదు. ఇది
సామరస్యముతోడ నుపన్యాసాదులద్వారా విస్తరింపఁ
జేయుట గ్రంథాలయముల కృత్యములలో నొకటియని
నా యభిప్రాయము. ఇదిమాత్ర మేలయన మనదేశమున
నేమహాకార్యమయినను నాత్మసామ్రాజ్యమున ధర్మరూప
మునఁ బొడుకొన్నగాని తగినంతఫల మీయదు. కనుక
నాధ్యాత్మికజ్ఞానము నుద్బోధము చేయుచు, ఈ మహో
ద్యమముల కృత్యములు ధర్మైకదేశములే గాని అధర్మవి
షయములు కావని కోవిదులగు నాయకులు నిరూపించు
ప్రకారము జనసామాన్యమునకు విశ్వాసము గలిగినచో
జయము కరతలామలకమే యని వేరె చెప్పనక్కరలేదు.
ఇట్టి ధార్మికతాత్త్వికవ్యాఖ్యానములు 'కృష్ణాపత్రిక'
'ఆంధ్రపత్రిక' 'ఆర్య' మొదలగువానిలో పదేపదే
బయలు వెడలుచునే యున్నవి. వానివిలువ గ్రహించు
టకు తగిన ఆధ్యాత్మికవిషయమగు పూర్వజ్ఞానము
లేమియే మనకూపాతితో పనిజరుపమికి హేతువయి
యున్నది. ఇందుకు దృష్టాంతముగ మన ప్రాచీనులు
దేవాలయములలో గ్రంథభాండారమునిల్పుట మొద
లగు పద్ధతులను, గ్రంథవిధానములను ధర్మాంతర్గతములు
గ ప్రచారములో నుంచుటనుఁ బరికించినచో విదితమగు
ను; ఇది యిక్కడికే విస్తరమయినది. కనుక నింతట నాపి

గ్రంథాలయములు కాలక్రమమున సంపాదించవలసిన హక్కులను సదుపాయములను కొంత సూచించెదను.

ఇతర దేశములయందు వలెనే మన దేశమునందుగూడ నీ గ్రంథాలయోద్యమము పదుపాటులును సఫలములయి గ్రంథాలయములు జాతీయ జీవనమునను, సాంఘిక, ధార్మిక వైజ్ఞానిక జీవనములందుగూడ ముఖ్యములగు పదవిని సంపాదింపవలెనన్నచో క్రమముగా నీముందు సూచించెడి వసతులను, హక్కులను కాలక్రమముగ సంపాదింపవలెను. (౧) ఆంధ్రదేశమున ప్రసిద్ధివడసిన ముద్రణాలయములన్నియును తాము ప్రచురించు గ్రంథములను ముఖ్యములగు గ్రంథముల నొక్కొక్కటిని, ప్రతి ముఖ్య గ్రంథాలయమునకును యుచితముగా గాని, అసలు ధరకైకాని యిచ్చుచుండవలెను.

ఇట్టి జాతీయ ధర్మమును శ్రీ॥ వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండు సన్సు వారు యిప్పటికే యనుష్ఠించుచున్నారని వినుటకెంతయు సంతసించుచున్నాను. మిగిలిన గ్రంథప్రకాశకులుగూడ వారిఁజూచి నేర్చుకొందురుగాక. (౨) ప్రభుత్వమువారి యధికారముక్రింద ప్రతివారమును, ప్రతి మాసమును ప్రతి సంవత్సరమును నెన్నియో యుపయోగకరములగు పత్రములు, పట్టీలు, పుస్తకములును ప్రచురింపఁబడుచున్నవి. అవి ప్రభుత్వమువారుచితముగా ముఖ్యగ్రంథాలయములకు సమర్పించుచుండవలెను. రాష్ట్రప్రభుత్వమువారు రాష్ట్రములోని ముఖ్య గ్రంథాలయముల కొసంగినట్లే, మండలముల ప్రభుత్వములు, మండలములలోనివాటి కొసంగవలెను. (3) బరోడారాష్ట్రమునందువలె ప్రభుత్వమువారు కొంతసొమ్ము జనులు పెట్టుకున్నచో మిగిలిన ఒక యిబ్బడియో రెండిబ్బడులో తాము సహాయము చేయుచుండవలెను. ఈ ప్రకారము వారిచే నంగీకరింపఁబడిన పాఠశాలలలోని భాండాగారములకును, సామగ్రి, ఉపకరణములు మొదలయినవి కొనుక్కొన్నపుడును యిపుడిచ్చుచునే యున్నారు. అటులె, అంత గట్టి నిర్బంధములుమాత్రము చేయకుండ, నీయవలెను. (౪) కాలక్రమమున గ్రంథాలయపాలనముచేయు స్థాయిసంఘమునకు క్రొత్తగ బయలువెడలు గ్రంథముల మంచిచెడ్డలనరసి రూఢము (Register) చేయునధికారము రావలెను. ఇపుడు ప్రభుత్వమువారిచేతులలోనుండఁగనే యెన్నియో నీరసములును దుష్టములునగు గ్రంథములు రూఢములగుచున్నవి. వాటిలనెన్నిటినో దుష్టములని తొలగించి వేయవలసివచ్చినది. ఈ సందర్భమున కొన్ని గ్రాహ్యములయినవికూడ హేయములుగఁ బరిగణింపఁబడుచున్నవి. ఇందుకు గారణము, ఆపథమున నెవ్వరో యొక్కరు వ్యాపారాంతరనిమగ్నులుండుటయు, అవిచక్షణులును, దేశీయ సాంప్రదాయములఁ దెలియనివారును, న్యాయేతరభావములుకలవారును నగు సామాన్యులు యీపనిని నెరవేర్చుటయె. కనుక నా నిర్ణయాధికారము యోగ్యతగల యొక విద్యాసంఘము చేతులోనున్నచో నట్టివి తటస్థింపవు (౫) ఇట్టి వసతులను నధికారములనుఁ జేకురినతర్వాత, రాష్ట్రాంతములలోని గ్రంథాలయ సంఘములతో వ్యవహరించి గ్రంథవినిమయాదికము చేసికొనుట. ఇది కొంతవఱకు నిపుడైనను చేయవచ్చును. కాని కొన్ని విషయములలో పై యధికారాదులున్నఁగాని వలను పడదు.

ఈపైనఁ జెప్పినవాటిలోఁ గొన్ని మన గ్రంథాలయోద్యమ మిదివఱకె, సంపాదించుటకై తీర్మానములవల్లను, నితరోపాయములవల్లను, ప్రయత్నించుచున్నది. మఱికొన్ని దేశాంతరములఁగల వాటిఁజూచి యట్టివాటిని మనముకూడ నవధులఁగాఁ జేసికోవలయునను నుద్దేశ్యముతో సూచించినవి. ఇట్టివి యిపుడె, తాలూకా ప్రతినిధి సభలయందు నడుపుట యత్యాతురతగాఁ గనపడవచ్చును. కాని నా యభిప్రాయమేమన యివియే యుద్యమమునకు, నాకిప్పటికిఁ దోచినంతవఱకు పరమావధులు. ఇవి రాష్ట్రీయగ్రంథాలయ సంఘమె మొదలనుడువవలయునని నియమము లేదు. ప్రతి పల్లెటూరి గ్రంథాలయమువారుఁగూడ నట్టి పరమావధులఁ దృష్టిలోనుంచుకొని, తదనుకూలముగనే, ప్రవర్తించవలెను. అట్లు గ్రామములు, పట్టణములు, తాలూకాలు, మండలములు, పనిఁబూని నడచినచో రాష్ట్రసంఘమప్పుడే ప్రయత్నించును. రాష్ట్రీయ సంఘముకూడ, జనాభిప్రాయమును కనుఁగొని ప్రయత్నించినచో గొలది కాలములోనె కోర్కెలు సిద్ధించును. "జనవాక్యంతు కర్తవ్యం" కదా! ఇపుడును, అపుడు, ప్రథమమునుండియును, అట్టికోర్కెలు సఫలములయిన తర్వాతనుఁగూ

డ, శ్రద్ధయును, కార్యదీక్షయును, భాండారికునికి, ముఖ్యములు. అవి యున్నచో లేనిది లేదు, సభ్యులకు, ఆమోదకులకును నభిమానులకు నందజేకిని —కొలచల వేంకటప్పాశర్మ. ఎం.ఏ.

---

# బంగాళా జాతీయగీతము.

1 జనగణమనఅధినాయక జయహేభారత భాగ్యవిధాతా
పంజాబ్ సింధు గుజరాట మరాఠా ద్రావిడ యుత్కల వంగా
వింధ్య హిమాచల యమునా గంగా ఉచ్ఛలజలధితరంగా
తవశుభనామే జాగే తవశుభఆశిసమాగే గాహే తవజయగాథా
జనగణమంగళదాయక జయహేభారతభాగ్యవిధాతా
జయహే జయహే జయహే జయ జయ జయ జయ హే

2 అహరహ తవఆహ్వాన్ ప్రచారిత సుని తవ ఉదారవాణీ,
హిందూ బౌద్ధ సిఖ జైన పారసీక ముసల్మాన క్రీస్తానీ,
పూర్వ పశ్చిమ ఆశేతవ సింహాసన పాసేప్రేమహారహూమ గాథా
జనగణఐక్యవిధాయక జయహే భారత భాగ్యవిధాతా
జయహే జయహే జయహే జయజయజయజయ హే॥

౩ పతితఅభ్యుదయ బంధురపంథా యుగయుగధావితయాత్రీ
తుమిరసారథి తవరథచక్రే ముఖరితపథ, దినరాత్రీ
దారుణవిప్లవమాఝే తవశంఖధ్వనిభాజే సంకటదుఃఖత్రాత
జనగణపతపరిచాయకజయహేభారత, భాగ్యవిధాతా
జయహేజయహేజయహేజయజయజయజయహే ॥

4 ఘోరతిమిర ఘన నిబిడ నిశీథే, పీడితమూర్ఛిత దేశే
జాగ్రతచలతిమ, అవిచలమంగళ నతనయనే అనిమేషే
దుస్వప్నే ఆతంకే రక్షాకరిలే అంగేస్నేహమాయే తుమిమాతా
జనగణదుఃఖత్రాయకజయహే భారతభాగ్యవిధాతా
జయహేజయహేజయహేజయజయజయజయహే॥

5 రాత్రిప్రభాతిల, ఉదిల, వియచ్ఛవిపూర్వఉదయగిరిభాలే
గాహివిహంగమ పుణ్యసమీరణ నవజీవనరసఢాలే
తవకరుణారుణరాగే నిద్రితభారతజాగే తవచరణేనతిమాలా
జయజయజయహే జయరాజేశ్వర భారతభాగ్యవిధాతా
జయహేజయహే జయహే జయజయజయజయహే॥

— రవీంద్రనాథఠాకూరు.

---

# నెల్లూరు మండల ప్రథమ గ్రంథాలయ ప్రతినిధుల సభ.

## ఆహ్వాన సంఘాధ్యక్షుని యుపన్యాసము.

వనంబులకెల్ల నందనవనమువోలె, వృక్షరాజంబులలో కల్పతరువుమాడ్కి, సర్వవస్తుమయమై, వివిధజ్ఞానంబుల కునికిపట్టయి, దైవ దేశభక్తాగ్రేసరులకు నిలయమై, ప్రఖ్యాతిఁగాంచిన మతంబులకు ముఖ్యస్థానమై, భూతదయ, త్యాగము, ఆత్మగౌరవాది కుసుమంబులకు తవునై, ఈ భారతదేశము భూమండలములో నాయకమణియై తనరారుచున్నది. అందాంధ్రరాష్ట్రము తక్కుంగాని శక్తులచే నొప్పుచున్నది. పంచమవేదంబను పేరుచే నొప్పు భారతమునకు గ్రంథకర్తయగు తిక్కనయు, పంచమవేదములోని శిథిలభాగముల నాంధ్రీకరించి ప్రబంధకారులలో ప్రఖ్యాతివడసిన ఎఱ్ఱాప్రగడయు, సర్వజ్ఞుడగు నాచనసోముఁడు, అభినవదండియను పేరుగాంచిన కేతనయు, రామాయణ గ్రంథకర్తయగు గోపీనాథకవిపుంగవులును, తరిగొండ వెంగమాంబ మొల్లలాది కవయిత్రులును; ఖడ్గతిక్కనాది మహాశూరులును, ఈ యాంధ్రదేశములోచేరిన నెల్లూరుమండలవాసులు. ఇట్లొప్పు నెల్లూరుమండలమున పెన్నా, బొగ్గేరు, కీరాపేరు సంగమంబులచేత సార్థకనామధేయమును గలిగినట్టియు, రాజులపేరు రూపుమాపిన పరశురాముని ఆరాధనాస్థలమగు నీ సంగమము కవివరేణ్యులకును, స్వాతంత్ర్యప్రియులగు రాజులకును సహితము వెనుదీయలేదు. స్థలపురాణముమాత్రము ఖలులచే మ్రుచ్చిలింపఁబడినది. అయినను పాండురంగమహాత్మ్యమును రచించిన తెనాలి రామలింగకవి నిరూరులోని కరణము వేంకటాద్రిగారి కంకితమిచ్చినట్లు వ్రాయఁబడిన వాక్యములవలనను, పరశురామప్రతిష్ఠాపనమైన ఈశ్వరాలయమునకు దేవాదాయ వివయనూచికను దెలుపు శిలాశాసనములును వైవానికి తార్కాణములై యొప్పుచున్నవి. నద నగంబులచేతను, మిట్ట పల్లంబులచేతను, ఫలపూరితంబులగు తోటలచేతను నొప్పి యింపునగొలుపు యీగ్రామమునకు మిమ్ముల సన్మాన సంఘము పక్షమున నే నాహ్వానము సేయుట నా జన్మసాఫల్యమునకు మార్గమేగాని వేరుగాదు. ఈ మహాభారమైన కార్యము సర్వసమర్థుఁడును, ఉత్సాహపరుఁడును, సన్మానసంఘముచే నేకగ్రీవముగ నెన్నుకొనఁబడిన శ్రీయుత గూనులూరు శివరామయ్యగారు నిర్వహింపవలసి యుండెను. గాని వారికిఁగలిగిన యాపత్తుచే విరమించుకొనవలసివచ్చినందున నే నాకార్యమునకుఁ గడంగి యసమర్థతను జూపవలసి వచ్చినది.

దేశమునందు,యొకవైపున కాలవర్షములు లేనందునను కఱవుబాధలచే జనులు మలమలమాడుటచేతను, మఱొకవైపున మహాసంగ్రామములఁ గలుగు మహావిపత్తులచే నశాంతి ప్రబలుచున్నను, ప్రాణ, ధనరక్షణము దుర్భరముగ నున్నను, మేముచేసిన యాహ్వానమును మీరుగౌరవించుట మీ దేశాభిమానమును వెల్లడి సేయుచున్నది. మేము మీకొనర్చిన యల్పవసతులవలన మీకసౌఖ్యము గలుగవచ్చును. కాని మమ్ముల వాత్సల్యతతో క్షమించి సభను జయప్రదముగ జరిపి గ్రంథాలయోద్యమము నీ మండలమున వ్యాపనము సేయు మార్గముల నారయుదురని వేఁడుచున్నాఁడను.

## యుద్ధము.

న్యాయస్థాపనార్థము, స్వల్పదేశస్వాతంత్ర్య రక్షణార్థమును రణరంగమున బ్రవేశించిన మన ప్రభుత్వమువారికి జయమును, ఏతత్ ధర్మపరిపాలనమందు నిష్కామదీక్షయు, సర్వేశ్వరుండు ప్రసాదించుఁగాత. సర్వేశ్వరుని మాయయగు నీయుద్ధము, కురుక్షేత్రయుద్ధరంగము అర్జునునికి నిజజ్ఞానము నార్జించుటకు తగుసమయమగునట్లు మనకు స్వాతంత్ర్యమున నభిలాషయును, విద్యయం దెక్కువ ఆసక్తియుఁ గల్పించినది. పూర్వపు ఆచార్యులు, గురువులు నశించినను, వారు గ్రంథరూపమున సజీవులై యున్నారు. ఈజీవుల కాలయములు నిర్మించి యారాధన సేయవలయు.

సీ॥ అక్షరాస్యులకు నిరక్షరాస్యులకును
విద్య సుబోధమై వెలయవలయు
ధనమున్న లేకున్నఁ దగినగ్రంథముఁ జూడ
నభిలాష గలయప్పు డందగవలయు

పదుగురొక్కెడఁ జేరి భాషించుతఱివాణి
భువనమోహినియౌచుఁ బొరలవలయు
వీనులచేనైన వీక్షణంబులనైన
మంచిపెద్దల తుష్టిమనుపవలయు
దేశమెల్లెడ విజ్ఞానదీపవితతి
వలయునదియెల్లఁ గనుపింపవలయు నెపుడు
భుక్తియును ముక్తియును మహాశక్తివెలుఁగ
గ్రంథభాండారములు భువిఁ గ్రాలవలయు॥

## సుజ్ఞానము.

జిజ్ఞాస, అసంతృప్తి, అశాంతి, వృద్ధికి మూలబీజములు. ఈ జిజ్ఞాసచేతనే ఉపనిషత్, శ్రుతి, స్మృత్యాదులు వెలువడెను. ఈ యసంతృప్తిచేతనే బౌద్ధుఁడు, శంకరాచార్యులు లోనగువారు నూతనమతోద్ధారకులగుటకు కారణభూతులైరి. అశాంతిచేత పాశ్చాత్యదేశములందు సహితము, శాంతిని, స్వాతంత్ర్యమును, సర్వవస్తు మంగళమయముల నార్జింపసాగిరి మానవుల సకల ప్రయత్నములు పైవానిని జయించుటకొఱకై యున్నవి. ఆదినుండియుఁ జేసిన ప్రబలప్రయత్నము సంతతులవారికి జ్ఞానరూపముగ పరిణమించుచున్నవి. ఈ జ్ఞానమును పోషించుటకు నేఁటివఱకు మూఁడు సదుపాయముల నారసియున్నారు.

## ౧. వాగ్రూపము.

మనుజుల మనంబులు వికాసముచెందినప్పుడు, భావములను సంజ్ఞలచే వ్యక్తీకరించవలసి వచ్చెను. ఈ సంజ్ఞలే భావమై వాఙ్మయమును వృద్ధిచేసెను. ఈ వాఙ్మయముద్వారా సంతతివారినుండి సంతతివారికి వేదములు మొదలైన గ్రంథములు నిలువఁబెట్టఁబడినవి. వేదవ్యాసులు లోనగు మహాత్ములు, జ్ఞానమును రక్షించుటకై సలిపిన మహాప్రయత్నములలో

## ౨. లిపి రూపము

లగు సంకేతములచే దివ్యజ్ఞానమును చెట్ల పట్టల మీఁదను, శిలలపైనను, లోహములపైనను, శాసనరూపములుగను, మంటిపైనను, తాళపత్రములపైనను, సంక్షిప్తము జేసిరి. ప్రజాభివృద్ధియగు కొలఁదియు నూతనదేశముల నాక్రమించుట యనివార్యములయ్యెను. ఆర్జించుచున్న జ్ఞానమును వ్యాపనజేయుట కష్టసాధ్యమయ్యెడు స్థితియందు మహాపురుషులు

## ౪. ముద్రితరూపము

న జ్ఞానమును వ్యాపింపఁ బ్రయత్నించిరి. ప్రథమమున చీనా దేశస్థులు సదుపాయంబును వెదక, పాశ్చాత్యులు బుద్ధికుశలతచే వృద్ధిపొందించి వేనవేలుగ వివిధభాషల యందు పాత్రము లచ్చొత్తించి స్వల్పక్రయమునకు సులభముగ జ్ఞానవ్యాప్తిని జేయుచున్నారు. ఈ జ్ఞానము వ్యాప్తిఁ జెందుటకు విద్యయే ముఖ్యసాధనము. విద్య గ్రామములయందభివృద్ధియై గ్రామముల స్థితిగతులను జక్కపరచినగాని దేశమభివృద్ధికానేరదు హైందవదేశమందు పట్టణములకన్న పల్లెలు మెండుగానున్నవి. ఉన్నతవిద్యాలయములు పట్టణములయందుదప్ప పల్లెలయందుఁగానరావు. ప్రాథమికపాఠశాలలు సహితము లేనిగ్రామములఁ జూచుచున్నారము. నాగరికతఁ జెందిన దేశములందంతటను,

## నిర్బంధోచిత ప్రారంభవిద్య

ను ప్రభుత్వమువారు నెలకొల్పి, దేశమును, దేశములలోని కళలను వికసింపఁజేయుచున్నారు. కాని నాగరకతఁ జెందిన ఆంగ్లేయప్రభుత్వముక్రింద రమారమి ౧౫౦ వత్సరములుగ నడుగులమడుగులొత్తుచుఁ జరిగుచుండిన ఈ భరతఖండమునకు మాత్రము ఈ విద్యావిధానమును ప్రసాదించరున్నారు. ఇటీవల ప్రాథమిక పాఠశాలల నెక్కుడుగ స్థాపించినను, అయ్యవి చూపదగినంత యభివృద్ధిఁ జూపుచుండుట లేదు.

ఉన్నతపాఠశాలయందు సహితము నేర్పువిద్య దుర్బలులుగఁ జేసి, ముఖ్యముగఁ అస్వతంత్రులగు గుమాస్తాలుగనుండుట కుపయోగించుచున్నది గాని జాతీయవికాసముఁ బెంపొందించుటకు సహకారిగాక యున్నది. విద్య జాతీయవికాసముఁ గలుగఁ జేయవలయునన్న దేశభాషలలో విద్యగఱపఁబడవలయు. దేశభాషలలో కళలను శాస్త్రములను బోధసేయవలెను. దేశభాషలలో గ్రంథాలయముల నెలకొల్పవలయును. గ్రంథాలయములును, విద్యాలయములును పరస్పరసమాశ్రయములు. విద్య యభివృద్ధిజెందినఁగాని గ్రంథాలయములు వృద్ధిజెందనేరవు. గ్రంథాలయము లభివృద్ధిఁ జెందినగాని విద్యాలయములు యభివృద్ధిఁగానేరవు. ఈ మండలమందు గ్రంథాలయములుగలవియు, గ్రంథాలయములు స్థాపింపనున్న సం

ఘములు 39 గానవచ్చుచున్నవి. మండలములలోని గ్రంథాలయములలో నెల్లూరులోని తిక్కనభాండాగారము సుప్రసిద్ధము. పోట్లపూడి సుందరలివివేకానంద ధర్మపుస్తక భాండాగారమును, గండవరములోని రామమోహన గ్రంథాలయమును పేర్కొనఁదగియున్నవి. గ్రంథాలయోద్యమముపట్ల ఈమండలమున శ్రద్ధతో పనిచేయుచున్నవారలలో శ్రీయుత పొణకా పట్టాభిరామారెడ్డిగారు- నెల్లూరు వెంకట్రామానాయఁడు, వెల్లేటి ఆదినారాయణరెడ్డి, సర్వాభొట్ల గోపాలకృష్ణయ్య, తూమాటి మల్లారెడ్డి, మన్నెపల్లి రామకృష్ణరావు గారలు ప్రశంసార్హులు.

పూర్వులు: పామరజనులందు భక్తినిబురికొల్పుటకై సతీసమేతులైన శివకేశవాలయములు నిర్మించి నిత్యనైవేద్య దీపారాధనలకై మడిమాన్యములు దేవాదాయాదులు సమర్పించి శాశ్వతధర్మముల నెలకొల్పిరి. అట్టిపుణ్యమూర్తుల సంతతివారమగు మనము కొఱఁతబడినవిద్యాదేవతయగు శారదాంబకు భవనములనిర్మించి అర్చకునకు ఆలయసంరక్షణములకు కానుకలను, మాన్యములనర్పించవలయును. ఈనిలయములే గ్రంథాలయములు. అర్చకుఁడే గ్రంథాలయాధిపతి.

ఈగ్రంథాలయములు గ్రామమున మధ్యగట్టఁబడి, దేశీయపరిశ్రమలకు దగిన స్థానములై యుండవలయును. పూర్వమువలె యువకులు పాఠశాలలనుండి బయలువెడలునపుడు సింగపుఁగొదమలవలె గాక, నిరుత్సాహులై, ధైర్యస్థైర్యములుడిగి జీవయాత్రకసమర్థులై యుండుటఁ జూచుచున్నారము. ఈదురవస్థ నుపశమింపఁజేయుట యొకధర్మమైయున్నది. అందలి యధికారి సర్వసమర్థుఁడై గ్రామములోనివ్యాయామములఁజక్కగవరపి యందులకు వలయుపొత్తములను కరపత్రములను తెప్పించి పంచిపెట్టవలయును. విరామములేక కృషిసలుపు వ్యవసాయకులను, సోమరితనముచేతను, చెడ్డవృత్తులచేతను గాలముఁగడుపు బుద్ధిహీనులను సహితము నాకర్షించి జ్ఞానోపదేశముజేయుట కనేకమార్గములుగలవు. అందు

౧ వార్తాపత్రికలుఁ వివిధరకముల గ్రంథములు ధర్మోపయోగమునకై యుంచవలయునను వారలకు శ్రద్ధగలుగుటకు వార్తాపత్రికలనుండి విషయములజదువుచు, వారికి యుత్సాహముపుట్టునట్లు కలసిమెలసి ముచ్చటించుటయు, పూర్వగ్రంథములనుండి రాగయుక్తముగఁబాడి వారికిబోధించవలయును. మఱియు, నవీనపాశ్చాత్య నాగరికతావ్యామోహులై లోక వ్యవహారములయందు కేవలము ధనకాంక్షచే వ్యాపార సంబంధముగ వర్తింపక, పారమార్థికములచే సంచరించి జ్ఞానమునుబడసి నిజమైన భారతీయులమనిపించుకొనవలయును.

౨. ఉపన్యాసములు:— పెద్దల నప్పుడప్పుడు రావించి గ్రామస్థుల కుపన్యాసము లిప్పించుచుండవలయును

3. వివిధవస్తుప్రదర్శనము:— వివిధవస్తువులను సేకూర్చి వాని ప్రాముఖ్యతను వెలిఁబుచ్చవలయును. వాని సంయోగమువలని లాభములును, మార్పులును గ్రామమున కుపయోగించవలయును. ౪. మాజిక్ లాంతరులు, ౫. భోజనకాలక్షేపములు, ౬. పురాణశ్రవణము, ౭. హరికథలు:— వీనియందు యుక్తియుక్తముగ జనోపయోగములగు విషయములఁ గుఱించియు బోధఁజేయుటకెక్కువ యవకాశములు గలుగుచున్నవి. మఱియు, దేశభాషలను పెంపొందింపఁ జేయుటయు, కర్తవ్యమైయున్నది. భావములుగల పండితుఁడైనను, భాషాజ్ఞానములేనిది రంజిల్ల నేరఁడు. కాన మన యాంధ్రభాష సంస్కృతముతో మైత్రికలిగినందున ప్రఖ్యాతిఁగాంచి ప్రజలను రంజింపఁజేయుచున్నది. చిరకాలము క్రిందటనే ఆంధ్రభాష "దేశభాషలందుఁ దెనుఁగు లెస్స" అని కవిపుంగవులచేఁ గొనియాడఁబడియున్నది. ఇట్టి యాంధ్రభాష ఉన్నతదశయందుండియు, భాషను యభివృద్ధిఁగాంచుటకుఁ బెట్టఁబడిన పరిషత్తులలోఁ ప్రఖ్యాతిఁగాంచియు, ఉద్గ్రంథరచనయందు నుత్సాహముతోఁ దోడ్పడుటయుఁ గవివర్యులను, పండితవర్గమును బూజించుటకుమాఱుఁగ "చెట్టుచెడి కుక్కమూతి పిందెలు పుట్టె" ననురీతి గ్రామ్యభాష దేశమునకు యోగ్యమని వాదులాడువారు మాతృభాషాపోషితులు గారని వేఱుగఁ జెప్పనక్కరలేదు.

శారదానిలయములు, వివిధజాతులవారి వ్యక్తులను, ధర్మములను, కర్తవ్యములను, వివిధచట్టములను దేటతెల్లముఁజేయుచున్నవి. కాన యవిమనసముదాయపువ్యవహారములయందెక్కువ యుపయోగకారులై పరిణమింపగలవు. గ్రంథాలయములు స్థాపించినకొలఁది, శారదాంబకటాక్షముచే నజ్ఞానముఁబాసి ఐకమత్యము సేకూర్చి,

గ్రామములోనియంతః కలహములు నిర్మింపఁబడఁగలవు. గ్రామస్థులు వివేకులై, కలహములచే న్యాయస్థానముల కెక్కి ధనవ్యయము సేయక గ్రామములో వివిధవిషయములను బంచాయితీమూలముగఁ బరిపాలించుకొనుచు సంపూర్ణస్వాతంత్ర్యముగ స్వల్పసంస్థానములవలె వృద్ధిఁ జెందఁగలవు. దేశసేవకు మార్గదర్శకము కాఁగలవు. కాన

## గ్రంథాలయ వ్యాపనము

కై సర్వప్రయత్నములు సలుపవలయును. సంచార గ్రంథాలయములచే మండలములోని ముఖ్యపట్టణములకును, తాలూకా ఫిర్కా పట్టణములకును పరస్పరసంబంధముఁ గలుగఁజేసి, అమెరికా, బరోడాసంస్థానములలో జరుపురీతి గ్రంథాలయోద్యమమును జరుపుట యుత్తమము కాని స్వదేశసంస్థానములవలె మనకవకాశములు లేకుండుటయే గాక, రాజాదరణసహితము తగినంత లేక యున్నది. కాన

## స్వయం సహాయము

చే మన యీయుద్యమమును నిర్వర్తించవలసియున్నది.

౧. గ్రామసముదాయమునకు సంబంధించిన బీళ్ళు, కంచలు, దొడ్లు లోనగువానినుండి వచ్చు వరుంబడి, మనలో నిరంకుశాధికారముగల యొకరిద్దఱిచే వసూలుచేయఁబడి, నీతిబోధకు మారు దుర్వృత్తుల కవకాశముఁగలిగించునట్టి యుద్యోగస్థులకు నియ్యవలసిన మామూళ్ళకును, లంచములకును, మిగతపైకమును లెక్కఁజూపకయే స్వార్థముకొఱకు వినియోగపరచుటయు తటస్థించుచున్నది. ౯. మొత్తము గ్రంథాలయముల కార్యనిర్వాహక సంఘమున కర్పించిన, వారు వలయువారికి ఖర్చుపెట్టి మిగతమొత్తమును గ్రంథాలయ నిర్వాహణమునకు వినియోగపరచుట లాభకరముగ నుండును.

౨. సదుద్దేశ్యములతో దేవాలయములను స్థాపించి, భక్తులచే జీవనముల నేర్పాటుజేసినను, దుర్వ్యయములకును, ఉత్సవాదులయందు ననావశ్యకములగు వ్యయములఁబెట్టుట మామూలై యున్నది. దేవాలయములందు, మఠములు, సంస్కృత, వేదపాఠశాలలఁ బోషించుట మానివైచిరి. ఇందువల్ల రాఁదగిన ధనమును యీయుద్యమమున కుపయోగించుట భావ్యము.

౩ నురుపిళ్ళయందును, వివాహాది కార్యములయందు, వ్యాపారములయందు రాఁదగిన లాభములలోకొంత భాగమును, గ్రామములోని కోలగారమువల్ల వచ్చువరుంబడియు, లోనగు యాదాయములచే గ్రంథాలయోద్యమము వ్యాపనము కాఁగలదు.

## ముగింపు.

ఆంధ్రోద్యమప్రారంభమాదిగ యాంధ్రదేశమున నూతనశక్తి వ్యాపించినది. కామ్యార్థములకు శక్తిసాధనము లావశ్యకములు. ఘనకార్యములు త్యాగయుతములై యున్నవి. కీర్తి ఘనకార్యమువల్లఁ బడయవచ్చు. గతించినను సజీవులుగాఁజేయునది కీర్తియై యున్నది. కీర్తిశేషులుగాఁజేయునది శారదాలయములై యున్నవి. ప్రస్తుతమున కార్యశూరత్వమునకు శక్తిజాలక వాక్ప్రౌఢిమతో జరిపింపఁబడు సభలవలెఁగాకఁ గార్యశూరులై గ్రంథాలయములు వెలుఁగుచున్నవి. ఆంధ్ర పత్రికాధిపతియగు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారి నుడువులీతరుణమున స్మరణకువచ్చుచున్నవి. "గ్రంథాలయ ప్రతినిధులు కార్యశూరులుగాని వాక్శూరులు గారు. స్వయంసహాయావలంబులుగాని నివేదనావలంబులు గారు. త్యాగపరులుగాని స్వార్థపరులుగారు; సేవానిరతులుగాని లాభార్థులుగారు. మాతృభాషాభిమానులుగాని మాతృభాషానిరపేక్షకులు గారు."

జన్మసాఫల్యముఁ గాంచుటకు భగవత్ప్రతినిధులగు మానవుల సేవ యావశ్యకము. నిర్గుణబ్రహ్మోపాసనకు సగుణబ్రహ్మోపాసన యావశ్యకము. ఇదియే ప్రపంచముయొక్క పరమావధి కాన యాత్మోపలబ్ధికిని, మదీయ సోదర యాత్మోపలబ్ధికిని ప్రధానసోపానమైన గ్రంథాలయోద్యమము నుత్సాహముతోను శ్రద్ధాభక్తులచే నుత్తేజముఁ గలిగింపవలయును. సర్వేశ్వరుఁడీసభకు సర్వైశ్వర్యములు ప్రసాదించుఁగాత. ఓం శాంతిః

## అధ్యక్షులగు శ్రీవావిలకొలను వేంకటసుబ్బారావుగారి యుపన్యాసము.

సత్యభాషణము దోషావహము కాదు. ఆంధ్రలోక పురోవృద్ధి సూచకముగ దేశమున స్థాపింపఁబడుచుండు గ్రంథాలయములను గుఱించి నేనేమియునింతవఱకుఁ బరిశీలించినవాఁడను గాను నాయందీలోపముగలదని నన్నీసభకాహ్వానింపవచ్చిన వారికి విన్నవించుకొంటిని.

అగ్రాసన మలంకరించినఁ జాలుననియు మీకుఁదోఁచినది చెప్పుఁడనియు వారుచెప్పుటచే దాక్షిణ్యవశమున నీయకొంటిని. మీరందఱు నీవిషయమున వ్యవహరించు ననుభవజ్ఞానముగలవారలు. ఇట్టిమీకు నేనేమి నూతనముగఁ జెప్పఁగలను? కావున నాయుపన్యాసమునఁ గ్రొత్త విషయములు లేవని క్షమింతురుగాక.

### గ్రంథాలయమునకుఁ బ్రాచీననామము.

మనదేశమున గ్రంథాలయస్థాపనమునకుఁ బాశ్చాత్య సాంగత్యము కారణమనియుఁ దత్పూర్వ మీదేశమున నిట్టివిలేవుగనుకనే దానికి నాంగ్లభాషయందు లైబ్రరీ వలె సంస్కృతభాషయందు నేక పదము లేదనియుఁ గొందఱు నాతోఁ జెప్పిరి. ఈయభిప్రాయ మవిమర్శమూలకమని తోఁచుచున్నది.

లైబ్రరి (Library) అను పదము లాటిన్ భాషయందలి లైబర్ (Liber) అను పదమువలనఁ గలిగినది. లైబర్ అనఁగా పుస్తకము. ఈలైబర్ అనుపదమునుండి (Librarium a book case) లైబ్రేరియమ్ అనుపదము పుట్టెను. దీనికి పుస్తకములుంచెడి పెట్టెయనియర్థము. అట్లే లైబ్రేరియ యనఁగాఁబుస్తకము లమ్మెడియంగడి. (Library) లైబ్రెరి యనుదానికి "A collection of books belonging to a private person or to a public institution; an apartment or suite of apartments or a whole building appropriated to the keeping of a collection of books") అను నర్థములాంగ్లనిఘంటువులందుఁ గానవచ్చుచున్నవి.

లైబ్రరియనుదానికి సరియైన పర్యాయపదము సంస్కృతమునఁ గోశము. కోశశబ్దముతొలుతఁ బుస్తకమున కన్వయించుచుండెను. "కోశాంతరేత్వయంపాఠ" యనియు "వైదేశికేషుకోశేషు పాఠభేదాన్నిరీక్ష్యతాన్॥" అనియు వ్యాఖ్యానంబులఁ గానవచ్చెడి. ఆవలనీకోశశబ్దమే పుస్తకసమూహమందు వర్తింపసాగెను. "గృహే దేహే పుస్తకౌఘే పేశ్యామసిపిధానకే" అని నానార్థరత్నమాలయందున్నది. కోశశబ్దము పదార్థములుంచఁబడు స్థలమునందును నన్వయించునుగావునఁ గోశమనఁగాఁ బుస్తకసమూహముంచఁబడు స్థలమునందు నన్వయింపవచ్చును. కావున లైబ్రరీ యనుదానికిఁ గోశమనునది పర్యాయపదముగ గ్రహింపవచ్చును. "కోశవానాచార్య" యను ప్రమాణమునుబట్టి లైబ్రేరియన్ అనుదానికిఁ గోశవంతుఁడనునది పర్యాయముగఁ గొనవచ్చును. నూతనశబ్దసృష్టితోఁ బనిలేదనియు నిట్టియాగారములు మనదేశమున ననాదిగనున్నవనియు వానికిఁ బేరునుగలదనియుఁ దెలుపుటే యిందు నాముఖ్యోద్దేశము. అట్టిశబ్దము నునికి తెలియక గ్రంథాలయశబ్దము సృష్టింపఁబడెనని నేను జెప్పనుగాని యిప్పటివారికి సుబోధముగ నుండుటకై కల్పింపఁబడినదనుట సమంజసమని తలఁచెదను.

### కోశోత్పత్తినిదానము.

ఇఁకఁ గోశములు పుట్టఁగారణము విచారింతము. కోశము పుస్తకసమూహము. పుస్తకము వాక్యసమూహము. వాక్యముపదసమూహము. పదమక్షరసమూహము. ఇది విలోమక్రమము. ఇఁకననులోమముగఁ జూచినఁ దొలుత నక్షరముపుట్టెను. ఆవలఁబదము. ఆపిమ్మట వాక్యము. తదనంతరము పుస్తకము.

పాశ్చాత్యులక్షరములు కొండగుర్తులవంటిసంకేతములు (Conventional signs) అనుచున్నారు. వారివర్ణములవిషయమున నది సత్యమేకాని మనయక్షరములవిషయమై యట్లు చెప్పువాఁడు తెలిసినవాఁడు కాఁడనవచ్చును.

ఆర్యులమతమున నక్షరమక్షరమే శబ్దము బ్రహ్మమని మనవారు సాధించిరి. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" యని కలదుకదా. ప్రణవము పరబ్రహ్మవాచకము. "తస్యవాచకః ప్రణవః" యని పతంజలియోగశాస్త్రమున వచించెను. వాక్యవాచకముల కభేదమని మనవారునిర్దేశించిరి. ఊర్ధ్వముఖముగ వచ్చు ధ్వనులకన్నిటికిఁ గంఠము మొదటిజన్మస్థానము. అందుఁబుట్టుధ్వనులలో నచ్చులు తొలుతఁబుట్టినవి. "అకుహవిసర్జనీయానాంకంఠః" యన్నట్టులు కంఠమునఁ దొలుతఁబుట్టిన యచ్చు అకారము. శిశువులు అమ్మ అత్తలోనగు నకారాదిపదములు తొలుత నుచ్చరింపసాధ్యపడుటచేతనే అకారము ప్రథమాక్షరమని మనము గ్రహింపవచ్చును. అకారము నారాయణప్రథమాభిధాన మనుటకిదే కారణమైయుండవచ్చును. ఆదిదేవున కాద్యక్షరమన్వయించుట సముచితముకదా.

ఆయాయక్షరము నుచ్చరించినపుడు నోటినరములు

మొదలగువానియందు నెట్టియాకారములు గానవచ్చునో యట్టియాకారమే యాయా యక్షరమునకీయఁబడినదని యక్షరవిధానశోధకులు వచింతురు. రూపము సంకల్పించినపుడు మెదడునం దెట్టులో యక్షరముచ్చరించినపుడు నోరనట్టులే మార్పుకలుగును. ఒక్కొక్క యక్షరము పలుమాఱు జపించిన నొక్కొక్క ఫలము గలుగునని మంత్రయోగశాస్త్రములు చెప్పుచున్నవి. అక్షరములన్నియు బీజాక్షరములే. అక్షరజపమువలన ఫలముగలుగుట సత్యము. దీనికిఁ గారణమారయుదము. ఒక్క యక్షరము పలుమాఱు జపించినయెడల నరములందు నొక్క విధమయిన చలనము (Vibration) విడువక కలుగుచున్నది. ఈచలనమేక తాళమువలె నేకవిధగమనము కలదై యుండవలయును. నడుమనడుమ భిన్నించినఁ గీడు కలదు. దీర్ఘసమగమనమువలన నొకశక్తి యావిర్భవించును. ఆశక్తికొలఁది ఫలము గలుగును. మంత్రములు ఫలప్రదములగుటకిదేయొక కారణమై యుండవచ్చును.

అకారస్వరూపము మీరందఱెఱుఁగుదురు. ఆయక్షరమునుచ్చరించునపుడు పెదవి పెదవి కలియక నోరు తెఱచికొనియుండును గదా. అకారమందు మొదటివలయము పైపెదవి యనియు దానికెదురుగనుండు వంపు క్రింది పెదవియనియు రెంటికి నడుమనుండు నెడము రెండు పెదవులనడిమియంతరాళమనియు భావించితిరేని ధ్వనిని గూచించు నడిమిలోఁగీఁత పెదవుల దాఁటిపోవుండుటయు నెఱుఁగఁగలరు. ఇప్పుడు మన మకారమునడ్డముగ వ్రాయుచున్నారము. అటుగాక నిలువుగ వ్రాసితిరేని నేను జెప్పినది సుబోధమగును.

ఇఁక ఉకారము విధము చూతము. ఉకారముచ్చరించునప్పుడు పెదవు లేయాకృతిని బొందునో కనిపెట్టి యాయాకృతికి ఉకారము సరిపోవునోపోవదో చూడుఁడు. ఇందును రెండు పెదవులు, నడుమ కంఠమునుండివచ్చు ధ్వనిని దెలుపు గీఁతయుఁ గలవుగాని యాకారమందువలెఁగాక గీఁత వెలుపలికి బోవనుంకించుచుండును. ఈ గీఁతయందిట్టి యత్నము కలదని దీర్ఘమైన ఊకారమునందు స్పష్టపడుచున్నది. ఉకారము ఓష్ఠ్యము కదా.

ఇఁక ఓకారమును బరిశీలింతము. అకారము ఉకారము సంధికలియఁగా నైనది ఓకారమని మీరెఱుఁగుదురు. అకారము కంఠ్యమనియు, ఉకారము ఓష్ఠ్యమనియు నీరెంటిసంధివలన నైన ఓకారము కంఠోష్ఠ్యమనియును మీరెఱుఁగుదురు. అక్షరస్వరూపమందును నీ సంధి గానవయ్యెడి. ఉకారము నడిమిగీఁత తొలగించి అకారమునందలి మొదటివలయము ఉకారమునకు పైవైపుగఁ జేర్చి యా గీఁతలోఁగలిపిన ఒకారమగును. ఓకారమునధ్వని యూర్ధ్వగతముగావున ఒకారము తలపై గీఁతగీయవలయును.

ఇకారముచ్చరించునపుడెట్లు ధ్వనియధోముఖముగునో యట్లే అదియు నధోముఖముగనే వ్రాయఁబడును. ఏకారముచ్చరించునపుడెట్లు ధ్వని యూర్ధ్వపథగామియగునో వర్ణమునట్లే వ్రాయఁబడును. ఉచ్చారణము ననుసరించి ఏ క్రిందఁ జూచునట్లు వ్రాయుచున్నాము. పరిశోధించువారికిట్టి చిత్రము లింకను దెలియవచ్చును.

వీనినన్నిటిని చక్కఁగనాలోచించినచో మనయక్షరములు కొండగుర్తులని మీరందురా?

ఇంతియకాదు. అన్నియక్షరములుఁ కంఠము మొదలు పెదవులవఱకు లోపుగఁబుట్టును. కంఠమున కావలఁగాని పెదవులకు నీవలఁగాని పుట్టినవి లేవుకదా. ఇఁక నక్షరములనుజూచిన అకారము మొదటిది. మకారము కడపటిది. మకారమోష్ఠ్యము. మ్ అనఁగానే నోరుమూతపడును. తరువాత నక్షరమెట్లు పుట్టును. కంఠమునకుఁ బెదవులకు నడుమ ఉకారధ్వని యెట్లు సంచరించుచు రెంటికి సంబంధముగలుపునో యట్లే అకారమునకు మకారమునకు నడుమ ఉకారమువచ్చి అఉమ్ అయి ఓమ్ అగును. కంఠమునకుఁ బెదవులకు నడుమనే ధ్వనియిమిడియుండునట్లు సమస్తశబ్దప్రపంచము ఓమ్ అను నొంటియక్షరములో నిమిడియున్నది. వాచ్యుఁడైన యీశ్వరునందు సమస్తమెట్లిమిడియున్నదో యట్లే వాచకమైన ప్రణవమందును సమస్తమిమిడియున్నవి. వాచ్యుఁడెట్లు ముక్తిప్రదుఁడో వాచకమట్టులే ముక్తిప్రదము. ఈవిషయమింత కెక్కువ వచించుట యప్రస్తుతమగునుగావి ప్రణవము పరబ్రహ్మవాచకమై ప్రణవమందు సమస్తశబ్దప్రపంచమిమిడి యుండుటచే శబ్దప్రపంచమంతయు బ్రహ్మమయమే యగును. సూక్ష్మమొకటి స్థూలమొకటి. అంతమాత్రమే భేదము. శబ్దప్రపంచమంతయు బ్రహ్మమయ

మైనచో నపశబ్దములని సుశబ్దములని భేదమెట్లు గలిగె ననరాదు.

కం॥ హరిమయము విశ్వమంతయు
హరివిశ్వమయుఁడు సంశయముపనిలే దా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువులేదు వంశపావన వింటే॥

అని కలదుగదా! అట్లైనచోఁ గొన్ని యమేధ్యపదార్థములని యేలభుజింపక మానెదరు? దీనికేమి కారణమో దానికిఁ గారణమదే.

అక్షరములు శబ్దములు దేవతాత్మకములనియు వానియందు మనుష్యుల రక్షింపఁగల మహాశక్తియొకటిగలదనియు నెఱింగియే యాశక్తిని సరస్వతియని పూజసేయుదురు. బ్రహ్మశక్తిపూజ్య గాదా? ఆమె వాణీవీణాపుస్తకపాణియనుట కిదే కారణము. ఈ కారణముచేతనే మూలానక్షత్రము మహానవమినాఁడు పుస్తకపూజఁ గావింతురు. బ్రహ్మవాక్కునందు సరస్వతి వసించుననుపురాణోక్తికిఁగారణమిపుడు విశదమయ్యెనుగదా.

పుస్తకములందిట్టి శ్రద్ధాభక్తులు కలిగినకారణముచేతనే మనపెద్దలపవిత్రగ్రంథములు వ్రాయుట మోక్షదాయకమయినవానిని రచించిరి. కాలముజరుగుకొలఁది సత్త్వగుణము క్షీణించుకొలఁది ధర్మములను బోధించు గ్రంథములు నవల సర్గసాధకములైన గ్రంథములు, తరువాతఁ గామ ప్రధానములైన గ్రంథములు వెలువడెను ఇప్పు డెప్రయోజనములేనివి కొన్ని వెడలుచున్నవి. "కావ్యాలాపాంశ్చవర్జయేత్" అని కావ్యరచనయే నిషేధింపఁబడినకాలమొకటి యుండెను. పైవిధమున నానాగ్రంథములు లోకమున వ్యాపించెను.

కొందఱు మనలోఁ బూర్వకాలమున లిపిలేకుండుటచే లిఖితగ్రంథములు లేకుండెననియుఁ గావుననే వేదాదులు ముఖస్థములు చేయుచుండిరనియు నందురుగాని యిది వాస్తవముగఁదోఁపదు. వేదములపౌరుషేయములై తొలుత శ్రవణగోచరములగుటచే శ్రుతులను పేరుగలవయ్యెను. దానిని ముఖస్థములు చేయుటకు లిపియభావము కారణముగాదు వేదముస్వరప్రధానము. శబ్దమొక్కటియే భిన్నస్వరములచే భిన్నార్థములు గలదగును. 'ఇంద్రశత్రో' యనునది వినరందఱెఱింగినదియే.

వేదములు మాక్సుముల్లరుకుముందు లిఖితముగాలేవనియు నాయనయే తొలుత వ్రాయించి ముద్రించెననియు నొకరనిరిగాని యదిసత్యేతరము. మనలో లేఖనపద్ధతి చిరకాలముగనున్నది. భారతములిఖితరూపకముగ వెలువడియెఁగదా.

భారతమునకుఁ బురాణములకు ముందుపుట్టిన శ్రీమద్రామాయణమునందు 'రామనామాంకితం చేదంపశ్య దేవ్యంగుళీయకమ్' అని కలదు. దీనివలన హనుమంతునిచే శ్రీరామమూర్తి పంపిన యుంగరముమీఁద శ్రీరామనామము చెక్కఁబడినట్లు స్పష్టపడియెఁగదా. దానియందే మఱియొకచోట 'రామనామాంకితైర్బాణైర్వ్యాప్తం దదృశ రణమండలమ్' అని కలదు, బాణములఁజేయువారు కమ్మరవారు, ఉంగరములుజేయువారు కంసాలవారు. వీరుగూడ నక్షరలేఖజ్ఞానము కలవారై యుండినపుడు బ్రహ్మక్షత్రియవైశ్యులందు లిపిలేకుండెనని యెట్లుతలఁపవచ్చును?

శ్రీమద్రామాయణమునకుఁ బూర్వకాలమునాఁటివిగదా వేదాంగములు. మొదటివేదాంగమైన శిక్షయందీ శ్లోకముగలదు.

"గీతీశీఘ్రీశిరఃకంపీ తథాలిఖితపాఠకః
అనర్థజ్ఞోల్పకంఠశ్చ షడేతేపాఠకాధమాః॥"

ఆకాలముననే వేదములిఖితముగాకుండిన లిఖితపాఠకులెట్లు గలిగిరి? పుస్తకముచూచి వేదముచదివిన స్వరముతప్పునుగావున లిఖితపాఠకుఁడు పాఠకాధముఁడయ్యెను. పైప్రమాణమువలన వేదములను ప్రప్రథమమున మోక్సుమూలరు పండితుఁడు వ్రాయించెననుట పొరపాటుకదా? లేఖనములేనిచో వచనభాగములనెట్లు ముఖస్థముఁజేసిరి. ఈవిధముగఁజూచిన మనదేశమున లిఖితగ్రంథము లనాదిగనున్నవి. 'కోశవానాచార్యః' యనునది నేఁటిమాటకాదుగదా.

ఆదిశంకర, రామానుజాచార్యులవారలు గ్రంథాన్వేషణముచేయుచు దేశాటనము గావించిరి. కాశ్మీరదేశమందు రామానుజాచార్యులకు బోధాయనసూత్రములు లభించెను.

పాశ్చాత్యులకు ముందు మనదేశముపై దాడిపెట్టిన తురకలు మనదేశమందలికోశములనెన్నిఁటినో దగ్ధముఁగావించిరి. ఈకారణముచే నుత్తరహిందూస్థానమందుఁ

గోశములరుదయ్యెను. ఆసమయమున దురకలరాయిడి కష్టపడి వారిని దక్షిణమునకు రానీయక శ్రీకృష్ణదేవరాయలేలిన విజయనగరసంస్థానము వెళ్ళకుండులు పోరాడెను. ఆకారణముచేతనే దక్షిణదేశమునఁ గోశాగారములు గానవచ్చుట కలిగెను. మతాచార్యులనేకులు దక్షిణమందుద్భవించుటకదియే హేతువు. ఇట్టిమేలు దక్షిణహిందూస్థానమునకంతయుఁగావించిన విస్మృతాంధ్రరాజ్యమునుదలఁచి యాంధ్రులు గర్వింపవలయునో తన్నాశమునకు శోకింపవలయునో.

ముద్రాక్షరశాలలేర్పడుటకుముందు మనవారు పుస్తకములను నిక్షేపమువలెఁ గాపాడుచుండువారు. ఇప్పటిబంగారునగలవలె ముందుపుస్తకముల నప్పులకై కుదువబెట్టుచుండువారు. కోశవంతుఁడాచార్యుఁడనుపట్టము వహించియుండెను. ఆగ్రంథములన్నియుఁజదివినతఁడు పఠించి యెవ్వరేమడిగినను జెప్పసామర్థ్యముఁగలవాఁడగుటచే నట్టిపట్టమునకు యోగ్యుఁడయ్యెను. కాలక్రమమున నిప్పటిత్రెజరీయుకలవలె వారును బుస్తకములకుఁగావలియుండువారుమాత్రమగుటచేఁ గోశవంతుఁడాచార్యుఁడనుట పండితపుత్రుఁడనుటవలె నయ్యెను. కావున నేఁటికోశవంతులు గృహములు కాచుకుక్కలవలెఁ, గోశాగారములకు రక్షకులుమాత్రము గాక సేకరించినపుస్తకములనెల్లఁ జక్కఁగఁ బఠించి వానియందలి సద్విషయములు లోకులకెఱిఁగించుచుండవలయును. కోశవంతుల కిది ప్రథమకర్తవ్యము.

## పుస్తకపఠనమువలని లాభములు.

పుస్తకములు మౌనమువహించిన మిత్రములు. తనతోఁ జేరినవానియందు స్నేహభావముఁగలిగి, కలసినయుపకారముచేసి రక్షించుట మిత్రలక్షణము. నిజమైనమిత్రుఁడు మనస్సున నొకటి యుంచుకొని తద్భిన్నముగ మాటలాడఁడు. ఒక్కొక్కసమయమునఁ గోపించియు దూషించియుఁ జెప్పును. సద్గ్రంథములు నిట్టివి.

సద్గ్రంథములు మనకుఁ దథ్యములు పథ్యములునైన వానిని బోధించునుగాని మనకు రుచిగానుండు వానినిమాత్రమే తెలుపవు. మీమేలు మీరుకోరుదురేని యెట్లు నిజమైనమిత్రుని సంపాదింప యత్నింతురో యట్లు పుస్తకములను సేకరించి పఠించుటయందును యత్నింపవలయును. పుస్తకములవలన బాగుపడఁగోరువారు తొలుతఁ దమచిత్తవృత్తియెట్టిదో యేవిషయమందుఁ దమకభిరుచి మెండో యాలోచించి యావల నావిషయమై వ్రాయఁబడిన మంచి పుస్తకములను బఠింపవలయును. పరలోకవాంఛగలవానికి యోగము-భక్తి-విరక్తి-జ్ఞానము లోనగు విధములఁ దెలుపు పతంజలియోగశాస్త్రము, ఘేరండసంహిత, హఠయోగప్రదీపిక, భాగవతము, రామాయణము, భగవద్గీత, విష్ణుపురాణము, ఉపనిషత్తులులోనగు పెక్కుగ్రంథములు గలవు. ఇట్టివే ధర్మవిషయమై- యర్థకామముల విషయమై వ్రాయఁబడినగ్రంథములును, కళలగుఱించి వ్రాయఁబడిన గ్రంథములును గలవు. దుష్టమిత్రు లెట్లు కీడుచేయుదురో దుష్టగ్రంథములునట్లు పాఠకులకుఁగీడు చేయును. ఏవిషయమై మీకాసక్తిమెండో యావిషయమును బోధించు గ్రంథములను బలుమాఱు చదువవలయును. గొప్పకవులు మహాత్ములు వ్రాసినగ్రంథములందు నొక్కొక్కసారి చదువునప్పు డొక్కొక్కక్రొత్తవిషయము మనస్సునకువచ్చుచుండును. మొదటిసారి బోధపడనిది రెండవసారి బోధపడును. తొలుత నిస్సారమని యుపేక్షించినది యావలనెంతో సారవంతముగఁ గానవచ్చును. సద్గ్రంథములకిది లక్షణముగావున నిట్టిగ్రంథములందుఁగల సారమంతయు హృదయమున బాగుగనాటుకొని, పాదుకొని, దృఢపడి నిశ్చలముగ నిలువఁజేయవలయును. తన్మయత్వము నొందవలయును. శ్రీరామానుజాచార్యులవారు శ్రీమద్రామాయణమును నిరువదియొక్కసారులు గురుముఖముగఁ బఠించిరి. పారాయణముచేయు నుద్దేశము మీఁదఁ జెప్పినదియ. ఇట్టిపఠనము వలన ఫలము గలదుగాని యొకసారి చదివి యావల నుంచిన మేలులేదు. ఒక్కసారి చదివిగూడవలఁ బాఱవేయవలసిన విషపుఁబుట్టుచుండు నవలలు వీనినిఁ జదువకయే పాఱవేసిన నాయువు దుర్వ్యయముగాకుండును.

యోగము భక్తిలోనగు విషయములు మీకురుచించునో రుచింపవో కావున నీకాలమునఁ గవులుగాఁ బెక్కురు బాలురు కోరుచుందురు కావున వారికి గావలసినమార్గము సూక్ష్మముగఁ దెలిపెదను.

కవులు గాఁగోరువారు తొలుత ఛందోవ్యాకరణలక్షణజ్ఞానమును సంపాదింపవలయును. అపై వారివారి తెలివికొలఁది యుత్సాహము ననుసరించి యలంకారగ్రంథములఁ బఠింపవలయును. అమరము రాని వానికేనమరనను సూక్తిగలదు కావున నామలింగానుశాసనము

ఆంధ్రనిఘంటువులు కొంతవఱకైనఁ బఠింపవలయును. ఈయధ్యయనము నిత్యకృత్యముగ విధిగనుంచుకొని విరామకాలములందు లక్ష్యగ్రంథములు కవిత్రయ రచితములు, భాగవతము, రామాయణము లోనైనవి ముందుపఠింపవలయును. వీనిని బఠించుటవలన ననేక విషయములు హృద్గతములగును. ఆవలఁ బంచకావ్యములులోనైనవి యొకసారి పఠింపవలయును. ఇప్పుడు చదివిన గ్రంథములందేది తనకు నిష్టగ్రంథమయి మనస్సునెక్కువగరంజింపఁజేయునో దానిని బలుమాఱు చదివి దానియందలి ప్రయోగములు గమకవిధము మనస్సునకుఁదెచ్చుకొనవలయును. ఆగ్రంథముతన్ను రంజింపఁజేసిన కారణమేదో యదియుఁ దెలిసికొని యట్టి గుణము తనయందును గలుగఁజేసికొనవలయును. ఈవిధముగఁ బునాది యేర్పడిన తరువాత నేగ్రంథమైనఁ జదువవచ్చును. దానియందలి సారముగ్రహింపవచ్చును. లక్ష్యలక్షణజ్ఞానము కుదురు వఱకు గ్రంథరచనకు సాహసింపరాదు. అభ్యాసమునకై విడివ్రాతలువ్రాసి పండితులయొద్ద సవరింపఁజేసికొనుచుండవలయును. పాండిత్యమునకుఁ గవితాశైలికి సంబంధములేదు. విద్వత్కవులే కవులు. కేవలకవులు కేవల కవులేయని సూక్తిగలదు.

"దేవునాఁ దొల్లి దేశానికొకకవి
యిప్పుడూరనూరనింటనింట
నేవురార్వురేడ్వురెనమండ్రు తొమ్మండ్రు
పదుగురేసికవులు పద్మనాభ"

యన్నట్టులిప్పుడు బాలకవులు వెల్లివిరియుచున్నారు. ఏదేశమునఁ గవులెక్కువమందియుందురో యాదేశము వృద్ధిచెందుననియు నేదేశమునఁగవులుజనింపరో యాదేశము క్షీణించుననియు విజ్ఞులమతము. ఏల? బుద్ధివికాసముగలవారు కవులు. వారు వైకుంఠము మొదలు పాతాళమువఱకు సంచరించి యాప్రదేశవాసులకుఁదెలియని విషయములను మనోదృష్టిచేఁ జూచిచెప్పుదురు. కావునఁ గవులు హెక్కురుపుట్టుట శుభోదర్కమే కాని యట్టిపేరుపొందఁగోరువారు వంచనలేక లక్ష్యలక్షణజ్ఞానము, దానికిఁదగినయోగ్యత సంపాదించుకొనవలయుననియే నా యభిలాష గాని యితరముకాదు.

గ్రామములనుండువారు పేదలుగను బుస్తకనామములు తెలియనివారుగను నుందురుగావున గ్రంథాలయములందుఁ బుస్తకములలరడిన నట్టివారికెంతో సహాయపడును. జ్ఞానముసంపాదింపఁ గోరికకలిగియు బీదలగుటచేఁ గొనలేకయుండువారును, యేపుస్తకములను జదువవలయునో తెలియనివారును గొందఱు కలరని నేనెఱుఁగుదును. అట్టివారికిగ్రంథాలయములు నిక్షేపములు.

సద్గ్రంథముఁ జదువుఁడని పలుమాఱు చెప్పితివిగాని గ్రంథము చదువక యదిమంచిదో చెడ్డదో తెలిసికొనుట యెట్లని ప్రశ్నవచ్చునుగదా. ఇదియడుగఁదగినప్రశ్నయే. నా ప్రత్యుత్తరమేమన,

గ్రంథాలయసర్వస్వము మూఁడవసంపుటము రెండవ భాగముపైపుటయందు వెనుకప్రక్క నిట్లుప్రకటింపఁబడియున్నది.

When you buy a book this test.

ఒకగ్రంథమును గొనునపుడు పరిశీలింపవలసిన ముఖ్యవిషయములు.

౧ అందముగానున్నదా?
౨ మంచిభాషయందు వ్రాయఁబడినదా?
౩ మనజీవితవిధానమును దెలుపునా?
౪ మనజ్ఞానమును అభివృద్ధిఁజేయునా?
౫ మనవ్యవహారమునకు ఉపకరించునా?
౬ హితమును బోధించునా?
౭ సన్మార్గజీవితమునకు సాయపడునా?
౮ మనజీవితమును సారవంతముచేయునా?
౯ ఆప్తునివలెఁ బ్రేమింపఁదగియున్నదా?

ఈప్రకారము పరీక్షించి పుస్తకముల గ్రహింపవలయును. ఎట్టిపనికిమాలినపుస్తకమందైనను నేదోయొకమూలనొకమంచిమాటయో నీతియో యుండును. అట్టిదానితోఁ బ్రయోజనములేదు. కొన్నిటియందు విపరీతనీతులు దురాచారములు వర్ణించి లోకమట్లు ప్రవర్తింపకుండుటకై యదివ్రాయఁబడినదనియు నిదియు నీతిహితబోధకమనియు నందురు. అది సరిగాదు.

గ్రంథాలయములందు దుష్టగ్రంథములు నిస్సారగ్రంథములు ప్రోగుగాకుండుటకు వేఱొకసదుపాయము కలదు.

ఇప్పటిగ్రంథాలయస్థాపకులు గ్రంథకర్తలపాలి చీడపురుగులై యున్నారు. ఒకగ్రంథకర్త విద్యసేకరించుటయందు, నాలోచించుటయందు, గ్రంథము వ్రాయుట

యం దెంత శ్రమించునో, యెందఱనాశ్రయించిపది రూకలసంపాదించి దాని నచ్చొత్తించునో కోశస్థాపకులకు బొత్తిగ మనస్సునకుఁ దగులలేదు. పదిపుస్తకములు వెచ్చమగునా పదిరూపాయలువచ్చునాయని డబ్బిచ్చి పత్రికలయందుఁ బ్రకటితముచేయఁగానే యుండేభిక్షాటకుల యుత్తరములు స్తుతిపాఠములతో దినమునకొకటిరెండువచ్చుచుండును. కోశస్థాపకులలోదొంగలుకొందఱుకలరు. మూరేఁడుపొడుగు పేరితో నొకగ్రంథాలయమని పేరుపెట్టి తాను గార్యదర్శినని యాబిచ్చగాండ్రుత్తరములు వ్రాయుదురు. విచారింపఁబోయిన వ్రాసినవానితలలోఁ దప్ప నీగ్రంథాలయ మాయూరనుండదు; ఉండినను వానియింటనుండును. అదిపదుగురకుపయోగపడునది కాదు. కొన్నిగ్రంథములుచేర్చి యావలవానిని విక్రయింతురు. ఇట్టివారినిగుఱించి సువర్ణలేఖయందొక వ్యాసముఁజదివియుంటిని.

ఇప్పుడుగ్రామగ్రామమునఁ గోశాగారములు నెలకొల్పఁబడుచున్నవి. గ్రంథకర్త ముద్రించు గ్రంథములసంఖ్యకంటె వీరిసంఖ్యయెక్కుడుగనున్నది ముద్రించినపుస్తకములు వీరికిఁబంచిపెట్టి తరువాతగ్రంథకర్తయేమిచేయవలయును? కావునఁగోశస్థాపకులీపుస్తకభిక్షము లెత్తకుండుట ప్రథమకర్తవ్యము. పుస్తకములయాచించుటకు మాఱు ధనవంతులయొద్ద ధనముయాచించి పుస్తకములను వెలయిచ్చి కొనవలయును. అట్లు కొనువారు మంచిగ్రంథములనే కొందురుగాని పనికిమాలినపుస్తకములను గొనరు. ఇదియొక మేలు. పుస్తకము మంచిదాయెనా గ్రంథాలయములవా రందఱుకొనుటచే గ్రంథకర్తకెంతో సాహాయ్యముచేసినవారగుదురు. దానివలన నతఁ డుత్సాహియై యింకను సద్గ్రంథములు వ్రాయువాఁడగును. ఈవిధానమున గ్రంథకర్తలు పోషింపఁబడుదురు. భాషయుఁ బోషింపఁబడును. కావునఁ గోశస్థాపకులు పుస్తకభిక్షయను నీచవృత్తిని మానుదురుగాక.

## ముద్రణమువలని లాభనష్టములు.

తక్కువవెలకు లభ్యపడుట, సర్వజనులకుఁ గొనఁదగియుండుట, యామూలమున విద్యాజ్ఞానములు లోకమున విరివిగ వ్యాపించుట లోనగునవి ముద్రణమువలనఁగలుగు లాభములు. ఇవిమీరందఱెఱింగినవియే. లోకమున నీడలేని దీపములేదు. దుఃఖములేని సుఖములేదు. అట్టులే యిదియు. ఇప్పుడుధనవంతులకువలె బీదలకును బుస్తకములు దొరకుచున్నవి. విజ్ఞానము, వీథిజలదారియందలి నీళ్ళవలె వీథులవెంటఁబాఱుచున్నది. అయినను నిట్టి గ్రంథపఠనమువలన విశేషలాభము లభించుటలేదు. పుస్తకములు కొలఁదిగను వెలయెక్కువగనుండు కాలములో వానిని గొనువారు వానినిబలుమారు చదివి దానిసారమంతయు హృదయమునఁ బాదుకొనఁజేసియుండిరి. అట్టివారికట్టి పుస్తకములు వాస్తవముగ మిత్రములేయైయుండెను. ఇప్పుడో, యతిపరిచితి యవజ్ఞతకుఁగారణమయ్యెను. శ్రమపడక లభించినదానియందు గౌరవముతక్కువ. కావునఁ బుస్తకములందు మిత్రభావముపోయి సామాన్యమైనపరిచయభావముకలిగెను. బ్రాహ్మణకల్లుదుకాణములని పేరుగొన్న కాఫీహోటల్సునందుఁజేరువారి పరస్పరపరిచయమెట్టిదో యిప్పటిపుస్తకపరిచయ మట్టిదని యొకఁడుచెప్పెను. ఇప్పుడు వెలువడు ననేకపుస్తకములు సోమరులుకాలముగడుపుటకై వినియోగపడునవియేకాని వాస్తవజ్ఞానదాయకములు గావు. సద్గ్రంథములు కొన్ని యున్నను గడ్డిగాదమువలెనివి పెరుఁగుటచే వానినిఁగని పెట్టుటకుఁగాని వానియందే విశేషకాలము వెచ్చించి బాగుపడుటకుఁగాని వలనులేకుండఁ దటస్థించుచున్నది. ఏదిపొట్టో యేదిగట్టియో తెలిసికొనుటకష్టము. రసము స్నిగ్ధముస్థిరమునగు నాహారముగొని దేహబుద్ధిపటుత్వము సంపాదించుకొనుటయుం దుపేక్షించి కాఫీనీళ్ళు త్రావి రోగములపాలవువారివలె నుత్తమగ్రంథపఠనము నలక్ష్యపెట్టి సులభంబులగు నల్పగ్రంథములఁజదివి వానియందలి విషయములఁగొన్నిఁటినెఱుఁగుటచే జ్ఞానులమైతిమనుకొను మహాజ్ఞానులు కొందఱు వెలువడుచున్నారు. కావున గ్రంథాలయములందునల్పవిషయములగుఱించి వ్రాయఁబడిన గ్రంథములుండుటతగదని నాయభిప్రాయము.

చదువనేర్చినవారు పుస్తకములయందుద్దేశమేమి? కాలవ్యయముచేయుటకా? జ్ఞానవిజ్ఞానముల సంపాదించుటకా? యని యాలోచింపవలయును. ఆహారముదేహమును, పుస్తకపఠనము మనస్సును, మంచిదశయందుంచవలయును. తద్విరుద్ధములైన యాహార, పుస్తకములు త్యాజ్య

ములు. తెలిసికొన యోగ్యమైనది విద్యగాని యచ్చొత్తింపఁబడినదేదియైనఁ జదివి తెలిసికొనుట విద్యనార్జించుట కాదు. ఇంతయేల? పుణ్యమా పురుషార్థమా యను వాడుక మాట యిందు ముఖ్యముగా నన్వయించును.

## కోశవంతులకృత్యములు.

౧ కోశవంతులు సద్గ్రంథములేవేవి యెందెందుఁ బ్రచురింపఁబడుచున్నవో తెలిసికొని వానినార్జింపసదుపాయములు వెదుకవలయును.

౨ సంపాదించినపుస్తకములనన్నిటిని దానుజదువవలయును.

3 తానుజదివినవానిలోని సద్విషయములను గ్రామములోనివారికి నుపన్యాసములొసంగియో పురాణపఠనముగఁ జదివిచెప్పియో మఱియేవిధముగనో నప్పుడప్పుడు దెలుపుచుండవలయును.

౪ తెలిసినవారిని బిలిపించి యప్పుడప్పు డుపన్యాసములొసఁగఁజేయవలయును.

౫. మంచినడవడికలవాఁడై జనులగౌరవమునకుఁ బాత్రుఁడుగా యత్నించుచుండవలయును.

౬ ఏవిషయమైనఁ బరిశోధింప మనస్సుగలవారికేయేగ్రంథములం దావిషయము వ్రాయఁబడియున్నదో తెలిపి సహాయుఁడు కావలయును.

౭ అముద్రితగ్రంథములెందైనఁ గలవాయని విచారించి యట్టివియుండిన సేకరింపవలయును.

౮ అపూర్వగ్రంథమేదైన లభించిన ముద్రింపయత్నమైనఁ జేయవలయును. లేక తక్కినకోశవంతులకావిషయము వ్రాసి కోరినవారికి దానిప్రతులు లభింపఁజేయవలయును.

౯ చదువుకొనుటకుఁ బుస్తకములనిచ్చిన యెడల వానిని తీసికొనినవారు మరలనిచ్చునపుడు దానిచ్చిన పుస్తకమునే యిచ్చిరా, వేఱొకపుస్తకమునిచ్చిరా, పుస్తకములోని పత్రములను బటములఁజించికొనిపోలేదుగదా యని శోధించి మఱల వానిని యథాస్థానమునసుంచవలయును. పుస్తకమును మార్చు పెద్దమనుష్యులు, పటములను జించికొనిపోవు పెద్దమనుష్యులు కొందఱుందురు.

౧౦ హైదరాబాదునగరమునందు గ్రంథాలయమందుఁ బుస్తకమింటికిఁగొనిపోవుసభ్యులు దానివెల ముందుగనియ్యవలయును. పుస్తకము మంచిస్థితిలో మరల నీయఁబడునేని వారిచ్చినపైకము వారికినొసఁగఁబడును. ఇట్టినియమము తక్కినచోటులనుండవచ్చును.

౧౧ వ్రాఁతపుస్తకముల సేకరించువారు మంచిపుస్తకములను దాము హరించి తక్కినవానిని గ్రంథాలయములకుఁ బంపకుండునట్లు గ్రంథాలయములకు సంబంధించినవారందఱు కనిపెట్టవలయును.

౧౨ ఏపుస్తకములు జనులచేఁ జదువఁబడుచున్నవో యందువిశేషముగ నెట్టివిచదువఁబడుచున్నవో కనిపెట్టవలయును. దీనికై పుస్తకములఁజదువువారిపేరు చదివిన పుస్తకములపేరు వేఱొకపుస్తకమున వ్రాసియుంచుచుండవలయును.

## కోశవంతులు సంపాదింపఁదగిన గ్రంథములు.

గ్రంథసంపాదనమందు భాషానియమమక్కఱలేదు. తత్తత్ప్రదేశవాసులెఱిఁగిన భాషలయందలి గ్రంథములెల్ల సంపాదింపఁదగినవే. కేవలాంధ్రభాష ప్రచారమునందు పల్లెలయందు నట్టిపుస్తకములుంచఁబనిలేదు. మండలమునకొక ముఖ్యకోశాగారముండవలయును. అందుసకల గ్రంథములుండవలయును. ఆంధ్రగ్రంథములు ప్రాముఖ్యమువహింపవలయును. వానికిసమానముగ సంస్కృతగ్రంథములు గౌరవింపవలయును. పెక్కురు నాగరలిపి యెఱుఁగరు కావున నివి యాంధ్రలిపినుంచుట మేలు. అట్టివి లభింపనపుడే లిపిలోనుండినను గ్రహింపవచ్చును. తెనుఁగు చేయఁబడని కొన్ని సంస్కృత గ్రంథములు గలవు. అవి యాంగ్లభాషయందు భాషాంతరీకరింపఁబడినవి. ఇట్టివానిని సంపాదించినచో మూలము లభ్యపడనపుడును, సంస్కృతము రానివారికిని నివి యుపయోగించును. సంపాదించిన గ్రంథములు విషయమునుబట్టి వేదాంతశాస్త్రములు, పురాణములు, కావ్యములు, యోగము, వైద్యము, జ్యోతిషము, అనియిట్లు నానాభాగములుగ తరగతులుగ విభజింపవలయును. కోశనామసూచికనొకటి యుండవలయును. ఇదిముద్రితమగుటయే గాక వలయువారికి వెలకులభింపఁజేయుటయు మేలు.

ఆర్యులారా! యిప్పుడు నేను జెప్పిన విషయములన్నియు మీరెఱిఁగినవే. అంతేకాదు అనుభవజ్ఞులగు మీరే నాకంటె నెక్కువగ నెఱుఁగుదురు. నాకుఁ బ్రకృతము తోఁచినవి చెప్పితిని. రాత్రిచాలఁ బ్రొద్దయినది. దినమంతయుఁ బ్రయాణముచేయుటచే నామిత్రులందఱలసియు

న్నారు. ఇంకను నామాటలచే మిమ్ముఁ బీడింపమనసొప్పకున్నది. కావున నింతతో విరమించెదను. తెలిసి తెలియక నేను జెప్పినవానియందు లోపములున్న క్షమింపుఁడు. గ్రంథాలయములవారు శ్రద్ధాభక్తులతోఁ బనిచేసిన దేశమునకెంతో మేలుగలదు. గ్రంథాలయము స్థాపించితిమను ప్రతిష్ఠకై తిరిపెమెత్తి పుస్తకములసంపాదించి యొకగదిలోనుంచి దుక్కకావలయుండుటచే నేమియు మేలులేదు. వీరుచునస్సొప్పి శ్రమమునకోర్చి పనిచేయఁబూనిన నెంతైన నవకాశముగలదు. చందాలిచ్చువారు యీగ్రంథాలయమువారేమి పనిచేయుచున్నారు. ఎట్లుచేయుచున్నారు, తృప్తికరమైనపని జరుగుచున్నదా లేదాయని కనిపెట్టి సోమరితనము గావచ్చినచో దానిని దొలఁగింపయత్నింపవలయును. ఈసభకు నెల్లూరియందలి తిక్కనపుస్తకభాండాగారమువారు తమప్రతినిధిని బంపరైరనియు నచ్చటివారికీవిషయములఁ జాలినంత యుత్సాహము లేదనియు వింటిని, ఇది మిక్కిలిశోచనీయము. శిరస్సు చెడిన నవయవములన్నియుఁ జెడునట్లు ముఖ్యకోశాగారము మార్గదర్శకమగునది యింతసోమెక్కియుండినఁ దక్కినవెట్లు బాగుపడఁగలవు? కావునఁ దిక్కనభాండాగారమువారు నిదురమేల్కొని సర్వదాజాగరూకులై తమమాతృస్థానగౌరవమును గాపాడుకొందురుగాక. శ్రద్ధయు భక్తియు బుద్ధిప్రవర్తనము గ్రంథాలయములవారికెల్ల భగవంతుఁడొసఁగుఁ గాక.

## శ్రీ మల్లిఖార్జున గ్రంథాలయము, తుళ్లూరు.

గుంటూరుతాలూకాయందున్న యీగ్రంథాలయము 30-12-19 తేదీన స్థాపింపఁబడినది. ఇందు ౩౫౦ గ్రంథములు గలవు. ఆంధ్ర, కృష్ణా, గ్రంథాలయసర్వస్వములు దెప్పింపఁబడుచున్నవి. పాఠకుల కందఱకు గృహములకు పుస్తకములనిచ్చుచున్నారు. దినమునకు సగటున ౬ గురు పాఠకులువచ్చెదరు. కుటుంబమున్న గృహములోనుండుట వలన స్వేచ్ఛగావచ్చుటకు జంకుచున్నారు. స్వంతభవనమున్న చాలమంది వచ్చెదరు. అనేకమంది గ్రంథసహాయమునుజేసి మాకృతజ్ఞతకుఁ బాత్రులైరి. కరువుకాలమగుటచే చందాలకొఱకు గ్రామములోని రైతులను గోరలేదు. బీదనైన నేను, యొకరిద్దరు పౌరులు, నావిద్యార్థులు కొందఱు నెలచందా లేర్పరచుకొని యాలయమును కల్పించుచున్నాము. పాఠకాభిలాషులకు పోస్టేజి యుచితముగ నీయఁబడును. స్త్రీలకు నైతము గృహములకు కావలసిన గ్రంథములు పంపఁబడును.

పీసపాటి వెంకటసుబ్బారావు,

కార్యదర్శి.

## శ్రీసత్యనారాయణ పుస్తకభాండాగారము, ధవిళేశ్వరము.

ఈగ్రంథాలయము ౧-౬-౧౭ తేదీన స్థాపింపఁబడి ౧౬-౯-౧౮ తిరిగి పునరుద్ధరింపబడినది. ఇందు 3౧౦౦ సంస్కృతాంధ్రాంగ్లేయ గ్రంథరాజములు గలవు. నెల ౧కి ఆదాయము రు ౧౨ లు; ఖర్చు రు ౧౬ లు. చందాదారుల సంఖ్య ౧౩౦. చందాదారులు గడచిన ఆరుమాసములందు చదివిన గ్రంథములు ౭౨౩; పాఠకులుచితముగా చదివినవి ౭౮౦, ప్రతిగోజున పురాణపఠనముగలదు. స్వంత భవనమును నిర్మింపవలెనని తలంచుచున్నారము; దానిని నిర్మించువఱకును శ్రీసత్యనారాయణస్వామివారి యాలయప్రాకారములో నెలకొల్పఁబడియున్నది. ఉదయమును సాయంకాలమునుగూడ తెరువఁబడుచుండును.

శంకరమంచి సుబ్రహ్మణ్యం,

కార్యదర్శి.

# ధర్మార్థకామమోక్ష ప్రదాయినీసమాజము, సిగడాం.

విశాఖపట్నముజిల్లాయందున్న నీగ్రంథాలయము ౧-౩-౧౭ న స్థాపింపఁబడినది. ఇందు ౫౦౦ గ్రంథములు గలవు. ౫ పత్రికలు వచ్చుచున్నవి. ధర్మగ్రంథాలయము ౨౭-౬-౧౯ న ప్రథమవార్షికోత్సవము బుర్రా శేషగిరి రావు పంతులుగారి యధ్యక్షతక్రింద జరిగినది; వా రిట్లు సెప్పిరి.

మీరీ సిగడాంగ్రామమందు ధర్మార్థకామమోక్ష ప్రదాయినీ సమాజము నేర్పరచి ప్రజలు తెలివిమీరునట్లు చేయుటకుఁ బ్రయత్నించుట యెంతయు స్తవనీయము. మన యాంధ్రదేశమున నెన్నియో సమాజము లున్నవి. కాని కోరఁదగిన పురుషార్థము లన్నియును సమముగా సాధించుట కేర్పడిన సమాజము మీరు స్థాపించినదే కానఁబడుచున్నది. ఇది మీ సమాజముయొక్క యాధిక్యత.

ధర్మమునకును దానమునకును గొందఱు భేదము కల్పింతురు. దానధర్మములను ద్వంద్వము మీరందఱు నెరిగినదే. కాని పురుషార్థములఁ నెన్నఁదగిన ధర్మ మదికాదు. అయినచో దానముచేయుటయే పురుషునికి విధాయకమై లోకమునందు సోమరితనమును దారిద్ర్యమును మితిమీరును.

ధర్మమన న్యాయమని మరికొంద ఱందురు. “యతో ధర్మస్తతో జయః ” యనుచో ‘ ధర్మ ’ మున కిదియే యర్థము. “సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ” యనుచో నీయర్థము పొసగదు. కనుక వీటి నన్నిటిని సమన్వయింపఁగల నిర్వచన మాలోచింపవలెను. ధర్మమనఁగా “విధి”, “నియతకర్మ”, (Duty) యని చెప్పినయెడల నన్నియర్థములును సమన్వయించును. కాఁగా మనుష్యునకు “ నియతకర్మ ” “విధి”, (Duty) యేమని ప్రశ్నకలుగుచున్నది. విశేషించి యాంధ్రుల మగు మనలో తగవరులకుఁ బెద్దలకు విద్యాధికులకు “విధి యేమి ” ?

ఆంధ్రలోకము తెలివిమీరి ప్రజ్ఞావంతమగునట్లు చేయుటయే. ఇందుకే పూర్వపు మహారాజులును జక్రవర్తులును దేవాలయ ప్రతిష్ఠలు, అగ్రహారప్రతిష్ఠలు, వాపీకూపతటాకారామప్రతిష్ఠలును జేసిరి. ఇందుకే మహాకవులు పురాణేతిహాసముల నాంధ్రీకరించిరి. ఇందుకేను వీరులు తమరక్తధారలతో భూమినభిషేకించి వైరిమతోద్రేకముల నడంచిరి. కాలములు మారినవి. రాజ్యాంగములు మారినవి. ఆశయములు మారినవి. ప్రస్తుతలోకము కత్తివలనఁగాక కలమువలనఁ దరింపవలసి యున్నది. వీరస్వర్గాభిలాషులభినవప్రపంచమునను దలలెత్తుచున్నను చచ్చి స్వర్గమునకేగుటకన్న బ్రతికిలోకసంగ్రహమునకై పాటుపడుటయే మేలను ప్రబోధము సర్వేసర్వత్ర వినవగుచున్నది.

మనయార్థికదశమిక్కిలిదుస్థితియందున్నది. పూర్వము మనదేశము సమస్తసంపదలతోఁ దులతూఁగుచుండెను. కార్మికవిద్యలెల్లెడల వ్యాపించియుండెను. సర్వశాస్త్రములును వ్యాప్తములుగనుండెను. ‍– ప్రాచీనగ్రంథములకై వెదకుచు నేను చేయుచున్న ప్రయత్నములలో శాస్త్రసంబంధమైన గ్రంథములెన్నో కనఁబడుచున్నవి. కార్మికవిద్యలుప్రచారమందు లేకుండుటచే నందఱును ముసద్దివృత్తికి దిగి కడుపునిండ నన్నము తెచ్చుకొనఁజాలకున్నారు. ఈదుస్థితిమారుటకు మార్గము కార్మికవిద్యలు దేశమందువిస్తరింపఁజేయుటయే. గవర్నమెంటువారెప్పుడో యేమొ చేయుదురని మనముచేతులు కట్టుకొని యపేక్షించుటకన్న తెలివిమాలినతనములేదు. గ్రంథాలయోద్యమమును దగినట్లు నడిపించినచో మనయీ గ్రంథాలయములే విద్యాగారములై గ్రామస్థులకు సాహిత్యముతోఁబాటు కార్మికవిద్యలును నలవడఁజేయును.

కామమునకు విపరీతార్థముఁ గల్పించినచో నదివ్యసనమై యనర్థదాయకమగును. విషయాసక్తతయే కామమైనయెడల నదిదుర్నీతికి మార్గమగునుకాని పురుషార్థము కానేరదు. కామరత్నమను నొకగ్రంథమును జూచితిని. అందు సమస్తవిద్యలను సాధించుమార్గములు కలవు. కోరఁదగిన విషయములను సాధించుమార్గములుచూపు శాస్త్రము కామశాస్త్రము. రతితంత్రమే కామశాస్త్రమనుట విపరీతాభిప్రాయము. పరమేశ్వరుఁడు ప్రతివ్యక్తియందును గొన్నిశక్తు లిమిడించియున్నాడు. వాటిని సాధనలోనుంచి ప్రకాశింపఁజేయుటయే “కామ” మను

పురుషార్థము. ఇది యందఱుచే గోరఁదగినది. దీనివలన లోకమునకెంతో యుపకారము కలుగును. మన యాంధ్రదేశమందుఁ బ్రతిమనుష్యుఁడును దనయందిమిడి యున్న శక్తులను బ్రకాశింపఁజేయుటకుఁ బ్రయత్నించుటయు నట్టి ప్రయత్నమునకు మన గ్రంథాలయములు తోడ్పడుటయు జరిగినచో మన యాంధ్రదేశము చిరకాలములో వన్నెకెక్కును.

మోక్షము ముక్కుమూసికొనుటవలన రాదు. మోక్ష మనఁగా సంసారచక్రమందలి రాయిడులనుండి తొలఁగుటకాని సంసారము త్యజించుటకాదు. కుమ్మరపురుగు సామెత మీరందఱెఱిఁగినదే. ప్రపంచమందుండియుఁ బ్రపంచమాలిన్యము తనకంటకుండ లోకయాత్ర నడపించుట ముక్తికి మార్గము. జనకాదిరాజయోగులిట్లు ప్రవర్తించి లోకమును ద్యజించిన మునిపుంగవులకును బూజ్యులై ధర్మకర్తలై మార్గదర్శకులై విలసిల్లిరి. ముక్తులలో జీవన్ముక్తు లుత్తములు. జీవన్ముక్తిత్వము నిరంతర సాధనవలనను, నిరంతరధర్మానువర్తనమునను, నిరంతర పరశ్రేయోభిలాషిత్వమువలనను గలుగును గాని కేవలము గ్రంథపఠనమువలనఁగాని కర్మమార్గమువలనఁగాని కలుగనేరదు. పరబ్రహ్మము చిచ్ఛ్వరూపము. ఆత్మయుఁ జిచ్ఛ్వరూపము. అందుచేతనే తత్త్వమసీత్యాది వాక్యములకుఁ బ్రామాణ్యము కనుక జ్ఞానప్రకాశితముగాని యుపాయములవలనఁ బ్రకృతి బంధములనుండి చిచ్ఛ్వరూపియగు నాత్మను విడిపింపఁజాలము.

ఇట్లు ధర్మార్థకామమోక్షములకు జ్ఞానమే సర్వోత్కృష్టమగు సాధనమగుచున్నది. జ్ఞానము పలువిధముల విస్తరించినగాని తరుణోపాయము లేదు. మన పూర్వులు సంపాదించిన జ్ఞానవిశేషములు విద్వత్సంస్తవనీయములగు మనయాంధ్రగీర్వాణ భాషలయందున్నవి. అందు ఖిలమగుచున్న గ్రంథములనుద్ధరించుటకు, నిలచియున్న వాటిని వాడుకలోనుంచుటయు, నవీనప్రాపంచకజ్ఞానము నాంధ్రములోనికి దించుటయు, నత్యవసరమగుచున్నది. ఇట్టిప్రయత్న మందఱు నాదరింపఁదగినది. దీనికిఁ జేసిన ధనసహాయము కోటిగుణితమై యిచ్చువారికినిఁ బుచ్చుకొనువారికిని శ్రేయోదాయకమగును.

విద్య, వితరణ, వివేకము, వినయము అను నీనాలుగును బ్రస్తుతకాలమున మానవులు తరించుటకుఁ జతుర్వేదములైయున్నవి. వేదచోదితములగు చతుర్విధ పురుషార్థముల సాధింపనేర్పడిన మీగ్రంథాలయమందీ చతుర్వేదములును నిరంతరము సభ్యులమనముల కుద్దీపనములై మీచేయు విద్యాప్రచార ప్రయత్నమునకు యశశ్చంద్రికలై వెలయుఁగాక!

గీ॥ విద్య వెలయించి విబుధుల ♦ వినుతి గాంచి,
నాగరకులయి, నయవిద్య ♦ నాయకులయి,
చిన్న పెద్దల తగురీతి ♦ మన్నలను
దనిపి, పురుషార్థ సంసిద్ధి ♦ గనుచునుండు.

# అక్కయ్యతో నేను ఆడుకొంటాను.

1 తెల్లగా మల్లెలూ పూచేటి చోట,
చల్లగా గాలులూ వీచేటి చోట,
హాయిగా చిలుకలూ పాడేటిచోట,
కోయిలలు కోయనీ కూసేటి చోట,
తుమ్మెదలు ఝుమ్మనీ మూగేటి చోట,
మా అక్కతో నేను ఆడుకొంటాను;
ఆడుకొంటా నమ్మ ఆడుకొంటాను.

2 పక్షులు గూళ్ళకూ చేరేటివేళ,
ఆవుల మందలూ వచ్చేటి వేళ,
ఎదురుగా దూడలూ పోయేటి వేళ,
మా అమ్మ అన్నమూ వండేటివేళ,
మానాన్న యింటికీ వచ్చేటి వేళ,
నేను మా అక్కయ్య ఆడుకొంటాము.
మాతోటలో మేము ఆడుకొంటాము.

3 లక్కబొంగరము మా అమ్మ యిచ్చింది,
బొమ్మలపుస్తకం నాన్న యిచ్చాడు,
చందనంబొమ్మ మా మామ యిచ్చాడు,
మోటారుబండి మా తాత యిచ్చాడు,
అమ్మమ్మ యిచ్చింది యీ రైలుబండి,
అక్కయ్యతో నేను ఆడుకొంటాను,

ఆమూల యీమూల ఆడుకొంటాము;
మా అక్కతో నేను ఆడుకొంటాను.
అల్లరి చేయకా ఆడుకొంటాము;
ఆడుకొంటామమ్మ ఆడుకొంటాము.
నేను మా అక్కయ్య ఆడుకొంటాము.

—మండపాక పార్వతీశ్వరశాస్త్రి.

---

# అపూర్వనారదీయము.

## విచిత్రప్రహసనము:-ప్రథమభాగము.

### పాత్రలు.

1. నారదుడు—ఒక దేవర్షి.
2. బాలకవి—వెంకటేశ్వరకవి—ఒక బాలకవి.
3. సోమయ్యశాస్త్రి—ఒకవిద్వాంసుడు.

స్థలము—సీతారామపురమను ఒక అగ్రహారము.

---

స్థలము - సీతారామపురము.

(నారదుడు సోమయ్యశాస్త్రిగారి వీధి అరుగుపై కూర్చుండి, వసుచరిత్రము చదువుకొనుచుండును.)

(రాగవరసతో)

శా॥ ఆజాబిల్లి వెలుంగు వెల్లికల డాయుకో లేక,
రాకానిశా
రాజశ్రీ సఖమైన మోమునకు బటాగ్రంబెత్తి
యున్నెత్తి, యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూ రాజత్కరాం
భోజ కాం
భోజీమేళవిపంచికారవ సుధాపూరంబు
లోరంబుగ■.

ఈపద్యం ధారాళంగా రాగవరసతో చదవడానికి మాబాగావుందిగాని, ఇలాంటి పద్యాలు వల్లించడంవల్ల నా ఉద్దేశం ఎంతవరకు ఈడేరుతుందో తెలియకుండా ఉంది. ఈ వసుచరిత్ర చదవడం ఆరంభించి ఆరునెలలైంది సగంపద్యాలు కంఠస్థాచేశాను. రాగాలు ఇష్టం వచ్చినట్లల్లా మార్చి తమాషాగా చదువుతాను. అయితే యేంప్రయోజనం? ఆశాస్త్రులుగారు ఏమిటో అర్థంచెప్తారు. ఈలాగు ఎందుకు చెప్పాలయ్యా అంటేసంప్రదాయం అంటారు. ఈలాటి సంప్రదాయార్థాలు వల్లించుకొంటూవుంటే ఎన్నాళ్ళకు నాపని పూర్తి అవుతుందో తెలియదు.

(బాలకవి ప్రవేశించును)

ఈకుర్రవాడెవడో నిన్నసాయంత్రం బజారులో నాకు కనపడ్డాడు. ఎందుకొస్తున్నాడో ఇక్కడికి?

బాల—శాస్త్రులుగారు ఇంట్లో ఉన్నారా అండి.

నార—ఉన్నారు. రండి కూర్చోండి. ఇప్పుడేవస్తారు.

బాల—(కూర్చుండును)

నార—మీ పేరు?

బాల—బాలకవి- వెంకటేశ్వరకవి.

నార—మీయింటిపేరు బాలకవివారా?

బాల—లేదు. బాలకవి అనేది బిరుదు.

నార—బిరుదా? ఎవరిచ్చారు?

బాల—ఎవరూ యివ్వలేదు. నేను చిన్నప్పటినుండి కవిత్వం చెప్పడంచేత నాస్నేహితులంతా నన్ను అలా పిలుస్తారు.

నార—అయితే మీరు కవిత్వం చెప్తారాయేమిటి?

బాల—చిత్తం కొంచెం చెప్తాను.

నార—అయితే మీరు వసుచరిత్ర బాగా చదివేవుకాబోలు?

బాల—లేదండి. నేను వసుచరిత్ర ఇంకా చదవలేదు.

నార—అయితే వసుచరిత్ర చదవకుండానే కవిత్వం యేలాగు చెప్తున్నారు?

బాల—కవిత్వం చెప్పడానికీ వసుచరిత్రచదవడానికి సంబంధమేమి టండీ?

నార—ఏమిటేమిటీ? వసుచరిత్రచదవకుండానే తెలుగు కవిత్వం చెప్పడంవస్తుందా? రాదన్నారే మాగురువుగారు? యేమిటీచిత్రం! ఇన్నాళ్ళుపడ్డశ్రమావ్యర్థమే?

బాల—మీరేమిశ్రమపడ్డారు?

నార—అయ్యా, మీరుబుద్ధిమంతులలాగున్నారు.

ఈలాగురండి నాచరిత్ర అంతా చెప్తాను. నేనెవణ్ణో మీరు తెలుసునా?

బాల— వేషంచూస్తే నారదుడిలాగున్నారు.

నార—అవును నారదుణ్ణే.

బాల—తమరిక్కడికి దయచేయడం వింతగాఉందే ఎందుకు దయచేశారు?

నార—ఆ సంగతే చెప్తాను. వినండి. ఈ మధ్య, భూలోకంలోనుంచి త్యాగరాజనే పేరుగల ఒక సంగీత పాఠకుడు స్వర్గంలోకి వచ్చాడు, వాడు నా శిష్యుడే. అయితే యేమి? వాడి పూర్వజన్మపుణ్యంవల్ల వాడికి సంగీతంబాగా అబ్బింది.

బాల—మీరు కూడా గొప్పసంగీతపాఠకులనే పురాణాల్లో చదివానే!

నార—అవును నాకూ సంగీతం బాగానేవచ్చును. గాని, ఆ త్యాగరాజు నాకంటే గొప్పవాడు.

బాల—చిత్రం, తరువాత?

నార—తరువాత భూలోకంనుంచి చాలాప్రసిద్ధికెక్కిన సంగీతపాఠకుడు వచ్చేడుగదా అని, అక్కడి గంధర్వులు కిన్నరులు, కింపురుషులు అంతా కలిసి ఒక సభచేశారు. అందులో త్యాగరాజుచేత పాడించారు. ఆ వేళవాడు మాబాగా పాడేడు. వాడిపాటకి ఇంద్రుడు చాలా సంతోషించాడు. సంతోషించి, అర్ధసింహాసనంమీద కూర్చోబెట్టుకొన్నాడు. నేనప్పుడు దూరంగా ఒక మూలకూర్చున్నాను. 'నారదా! ఈలాగుదగ్గిరకు రా" అని నన్ను పిలిచాడు. ఏమిటో విశేషముండిరా అనుకొని నేనుదగ్గిరకు వెళ్లాను. నాకుఓకుర్చీవేసి కూర్చోబెట్టారు. అప్పుడు ఇంద్రుడు నాతో అన్నాడు. "నారదా! త్యాగయ్యగారు పాడిన కృతులు ఎవరు చేశారో నీకు తెలుసునా?" అని ఎవరో మహాత్ములు చేసి ఉంటారని నే నన్నాను. వీరే ఆ మహాత్ములని త్యాగయ్యని చూపించాడు. నేను ఆశ్చర్యపడ్డాను. నా శిష్యుడు సంగీతం లోనేకాకుండా కవిత్వంలోకూడా గట్టివాడు గదా అని నాకు సంతోషం అయింది. "త్యాగయ్యగారిని, నా అర్ధసింహాసనంమీద కూర్చోబెట్టుకోవడం వారి సంగీతం కోసమేకాదుసుమా. వారి సంగీతం ఎంత మనోహరంగా ఉంటుందో వారి కవిత్వంకూడా అంత మనోహరంగానే ఉంటుందనిన్నీ, సంగీతంలోను కవిత్వంలోను సమానప్రజ్ఞగలవారు మరెవరూ నాకు కనపడలేదనిన్నీ, ఈ రెండుకారణాలచేత, నా అర్ధసింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాను" అన్నాడు. "చాలా సంతోషం" అన్నాను నేను. అప్పుడు ఇంద్రుడడిగాడు, నారదా! నువ్వేమైనా తెలుగుకవిత్వం చెప్తావా అని నేను తెల్లబోయాను ఏదో సంస్కృతంలో రెండు ముక్కలు అల్లడంచిన్నప్పుడు నేర్చుకున్నానుగాని, తెలుగు కవిత్వం నాకు అలవాటులేదు. నేను గుక్కిళ్ళుమింగుతూ ఊరుకొన్నాను. "భూలోకంలోకివెళ్లి నువ్వు తెలుగు కవిత్వం చెప్పడం నేర్చుకొనిరావాలి". అని ఇంద్రుడు అన్నాడు. తెలుగుకవిత్వం చెప్పేవాళ్లు స్వర్గంలో కూడా చాలామంది ఉన్నారుగదా, వాళ్లదగ్గిర నేర్చుకోగూడదా? అన్నాను. లేదులేదు, ఇప్పుడు భూలోకంలో చాలా తెలివైనవాళ్ళు ఉన్నారు. గనుక, భూలోకంలోనే నేర్చుకోవాలి అన్నాడు. సరేగదా అని బైలుదేరి వచ్చాను.

బాల—వెనక మీకు సంగీతంలోకూడా ఈలాంటి చిక్కే వచ్చిందని పింగళి సూరన్నగారు సెలవిచ్చారే!

నార—ఎప్పుడు సెలవిచ్చారు నాయనా?

బాల—ఎప్పుడో తెలియదుగాని, కళాపూర్ణోదయంలో చదివాను.

నార—అవును నాయనా. తుంబురుడికీ నాకూ ఈలాంటి జట్టీయే వచ్చింది. అప్పుడు భూలోకంలో కృష్ణుడు దగ్గిరకిపోయి సంగీతం చెప్పుకొన్నాను. ఏం చేస్తాను? చావనా? యజమాన్లు యేం చేస్తే అది చెయ్యాలి.

బాల—అయితే కవిత్వంవిషయమై యేం చేశారు?

నార—ఇదిగో ఈ శాస్త్రులుగారు మాగొప్పవారని తెలిసి వీరిదగ్గిర తెలుగు కవిత్వం చెప్పడం నేర్చుకోవాలని వచ్చాను.

బాల—ఎంతమట్టుకు నేర్చుకొన్నారు?

నార—ఇంకాఏదీ? ఆరు నెల్లయిందివచ్చి. వసుచరిత్ర నేర్చుకుంటేనేగాని తెలుగు కవిత్వం చెప్పడం రాదని శాస్త్రులుగారన్నారు. సరే అని వసుచరిత్ర ఆరంభించాను. నగంపద్యాలు వల్లించాను. అర్థం శాస్త్రులుగారు చెప్పిందల్లా వల్లిస్తున్నాను. నాకింకా కొంచెమైనా కవిత్వజ్ఞానం కలగలేదు. వసుచరిత్ర చదవకుండానే నీకు కవిత్వం వచ్చిందని చెప్పావు. నాకేమిటో ఆశ్చర్యంగా వుంది.

(శాస్త్రులుగారు ప్రవేశించుచు)

(ఇరువురును లేచి నమస్కరింతురు)

శాస్త్రి—అబ్బాయి! పద్యాలు తెచ్చావా ?

బాల—తెచ్చానండి.

శాస్త్రి—ఏదీ ? చదువు.

బాల—(రాగవరసతో)

శా॥ శ్రీరాజిల్లెడు తావకీనపదముల్
చింతించు టీనాటికిన్
గోరీ కోరనిరీతిఁగల్గె నిఁక నా
కోర్కుల్ ఫలించెఁగతిన్
సారంబైన కృపామృతంబు నెడు వర్షంబింత
కుర్వంగ, నే
యాఅభ్యంతరముల్ వచింపకుము కృష్ణా
రుక్మిణీవల్లభా॥

శాస్త్రి—పద్యం బాగుంది కాని ఏదీ? మళ్లీ చదువు.

బాల—(మళ్ళీ చదువును)

శాస్త్రి—ఏదీ! బాబూ! అల్లా అప్పకవీయం ఇలా పడ—

బాల—(ఇచ్చును)

శాస్త్రి—(పుస్తకం విప్పి) బాబూ,అరుఅనేదానిలో శకట రేఫ ఉందా? సాధురేఫ ఉందా ? బాగా ఆలో చించూ! ఆ అప్పకవీయంలో శకటరేఫే ఉంది. బాబూ! కొంపముంచేసావు నాయనా.

నార—(స్వగ) ఈశకటరేఫయేమిటో సాధురేఫయేమిటో యింకా తెలియకుండావుంది.

బాల—రేఫకీ, శకటరేఫకీ ప్రాసకూడదా అండీ?

శాస్త్రి—ఏలాగు కూడుతుంది నాయనా? "రయోస్తు నిత్యంస్యాత్" అన్నాడు శాస్త్రంలో

బాల—అయితే అప్పకవే ప్రయోగించాడే, దానికేం చెప్తారు?

శాస్త్రి—ఏదేదీ! ఎక్కడో చెప్పు

బాల—

మ॥ పురుటింటం బసిబిడ్డ చందమున నా
పోతంగ నాఁడాత్మలో
మురువొప్పన్ విమదుగ్ధముక్తకుచయై
ముద్దాడు రాకాసి గు
త్తెఱిఁగిప్పంబుగఁ బాలుద్రావు మివచే
నిర్వైనకాలంబునన్
ధగణిం గూల్చిన నందపుత్రులవలనన్
దార్కాణ ధర్మస్థితుల్॥

ఇందులో "ఎఱుఁగు" అనేదానిలో శకటరేఫకదూ ఉంది

శాస్త్రి—ఆ అలాగా ఏదేదీ మళ్లీచదువు "ఎఱుగు" అనేదానిలోది శకటరేఫే? "ఎఱిగిప్పంబుగ"అన్నాఁడు. అయ్యో- క్త్వార్థకఇకారసంధికూడా చేసీశాడే!

బాల—అంతే కాదండి "ఇర్వైన" అనే క్లిష్టపదం కూడా ఉందండి.

శాస్త్రి—అదీవుందీ? అయ్యో-అయ్యో కొంపమునిగి పోయింది. ఈపద్యం అప్పకవి చెప్పింది కాదు. మధ్యవాళ్లెవళ్లో దూర్చేశారుకాబోలు పోనీ అలాగువుండనీ నీ పద్యం మళ్లీ చదువు.

బాల—(మరల చదువును)

కోరీకోరనిరీతిఁ గల్గెనిఁక నాకోర్కుల్ ఫలించేఁగతిన్.

శాస్త్రి—ఆగు ఆగు తగలబెట్టేశావు భావమంతాను

బాల—ఏమి ఏమి అలాగు శెలవిస్తున్నారు?

శాస్త్రి—మరేముంది యిగను తగల పడ్డది భావ మంతాను ఇప్పుడు చదివినపాదం మళ్లీచదువు.

బాల—(స్వగ) ఈపాటి ధారణలేదు ముండావాడికి (మరల చదువును)

కోరీకోరనిరీతిఁగల్గెనిఁకనాకోర్కుల్ ఫలించేఁగతిన్.

శాస్త్రి—ఆగు ఆగు "కోరీకోరని" "ఫలించేఁగతిన్" ఏమిటిబాబు యీముక్కలు శుద్ధగ్రామ్యాలు ఇవెందుకు కూర్చేవోయి పద్యంలోను?

బాల—నా చెవికిచాలా యింపుగావున్నాయండీ. యీముక్కలు

శాస్త్రి—(కోపంతో) ఇంపేమిటి ఇంపు దురద పాటక్కలు గోకుకుంటే యింపుగావుంటుంది ఇంపేమిటి శ్రాద్ధం

బాల—ఈలాంటి ముక్కలు మనం పెద్దలదగ్గర పిన్నలదగ్గర వ్యవహారంలో వాడుక చేస్తున్నాంగదండి

శాస్త్రి—వ్యవహారంలో వాడుక చేస్తేమాత్రం? వ్రాసినప్పుడు విడిచిపెట్టవద్దూ?

బాల—వ్యవహారంలో వున్నప్పుడు వాడితే తప్పేమిటండీ?

శాస్త్రి—అదుగో-అదువాదాలేమనీ-వ్యాకరణాలకి విరుద్ధమైన పదం ఎప్పుడూ ప్రయోగించకూడదు.

బాల—అయితే యీపదాలన్నీ ఏవ్యాకరణాలువద్దన్నాయండీ?

నార—(స్వగ)వ్యాకరణంకూడావొకటి చదవాలా యేమిటి చెప్మా. తెలుగుకి?

శాస్త్రి—పెద్దలెవరూ ప్రయోగించలేదు.

బాల—ప్రయోగించకేమండీ. దేవకీనందనశతకములో వుంది.

శాస్త్రి—ఏదీ ప్రయోగం చదువు.

బాల—"కూడీకూడని చిన్ని కూకటులతో" "వండేనేర్చువఁ బెక్కురీతుల రుచుల్" అని రెంటికీప్రయోగాలు వున్నాయి.

నార—"ఉండేదే రాముడొకడు ఊరక చెడిపోకె మనస" అని త్యాగయ్య అన్నాడండీ శాస్త్రిలుగారూ ఆపదంనాకు మాయింపుగానే ఉందే!

శాస్త్రి—పాటలు ప్రయోగాలేమిటోయి నీకు తెలియదూరుకో "ఉండెడిదే" అని దిద్దుకోనిపాడుకో బాబూ, ఇవియేపుస్తకంలో వున్నావు

బాల—దేవకీనందన శతకములోవి.

శాస్త్రి—ఏమి టేమిటీ! శతకమా? ఏమిటో అనుకొన్నాను. వెధవశతకాలు ప్రమాణాలేమిటోయి అప్పకవీయములోవుందా?

బాల—అప్పకవే దేవకీనందనశతకములోది వుదహరించాడండీ. వాడికి ప్రమాణమైనశతకం మనకికాదండీ?

శాస్త్రి—అప్పకవి శతకాలలోనుంచి ఉదహరిస్తాడోయి?

బాల—ఉదహరించాడండీ. "చతురంభోధిపరీత" అన్నపద్యం దేవకీనందన శతకంలోనుంచి.

శాస్త్రి—ఏమిటో ఆపదాలు నాకంతనచ్చడంలేదు.

బాల—నాచెవులకి మాయింపుగా వున్నాయండి అందుచేతే ప్రయోగించాను.

శాస్త్రి—ఈకుంటలు భాషంత తగలెయ్యడానికి కవిత్వాలు చెపుతున్నారు. పోనీ మిగిలిన ముక్కయేదో చదువు.

బాల—"సారంబైన కృపామృతంబనెడు వర్షంబింక కుర్వంగ"

శాస్త్రి—"కుర్వంగ" అంటే ఏమిటర్థం?

బాల—కురియడం—వర్షంకురియడం.

శాస్త్రి—ఏమిటీ! "కురియంగ" అన్నదానికి వచ్చిన ప్రారబ్ధమా? బాబూ, మీకవిత్వాలకివోదండం. మీకుర్రాళ్ళు కవిత్వాలు చెప్పడం మానేస్తేబాగుండును.

బాల—ఏమి అలాగు కలవిస్తున్నారు. కవులు ప్రయోగించారే!

శాస్త్రి—(కోపంతో) ఎవడు ప్రయోగించాడు?

బాల—"కుటిసినఁగాక యంబుధులఁ గుర్వఁగ నేమి ఫలంబు భాస్కరా" అని భాస్కరశతకంలో వుందండి

శాస్త్రి—అదుగో మళ్ళీశతకం అంటాడు. వెధవశతకాలుకూడా ప్రమాణమైతే యేలాగు?

బాల—భాస్కరశతకంకూడా అప్పకవికి ప్రమాణమైందండీ.

శాస్త్రి—ఎక్కడ?

బాల—అందులో, దక్షతలేనియింటికిఁ బదార్థముల' ఆనేపద్యం వుదహరించాడండీ.

శాస్త్రి—వాళ్ళేదోకారణంచాత శతకంలో పద్యాలు ఉదహరిస్తే మనమూ అలాగే చెయ్యాలీ?

బాల—అప్పకవికి ప్రమాణమైనగ్రంథం మాబోటివాళ్ళకి ప్రమాణమైతే తప్పేమిటండీ?

శాస్త్రి—ఏదో యేడుపు. పద్యాలు సరా? యింకా వున్నాయా?

బాల—ఇంకా యిప్పుడేకదూ, అరంభమైంది? ఇంకా వున్నాయి.

శాస్త్రి—సరే తెలిసిపోయింది మరి చదవక్కరలేదు. అన్నియిలాగే వుంటాయి. శుద్ధగ్రామ్యం వేసి భాషల్లా తగలెట్టేశావు.

బాల—అయ్యా! ఆశబ్దాలు కొందరుకవులు ప్రయోగించారు. పెద్దపిన్నలదగ్గిర మనం వ్యవహారంలో వుపయోగిస్తున్నాం. అలాంటి శబ్దాలు ప్రయోగించడంలో దోషం నాకేమీ కనపడడంలేదు.

శాస్త్రి—మీరంతా భాషను పాడు చేయడానికి పుట్టారు. ఇక చాలులే నాకింట్లో పనుంది. రేపుమళ్ళీ కలుసుకుందాము,

బాల, నార—చిత్తం. సెలవు.

(శాస్త్రులు లోనికి నిష్క్రమించును.)

నార—అబ్బాయీ! కవిత్వంలో యిన్ని చిక్కులు వున్నాయని నాకు తెలియలేదు. ఏమిటో శకటరేఫ అన్నారు. "ఉండేదే రాము డొకడు" లాంటిముక్కలు వెయ్యకూడదంటారు. ఏమిటి నాయనా! యీగడబిడ అంతాను?

బాల—ఈ గడబిడ మాజాస్తీగావుందండి. మీరు ఏమైనా సదుపాయం చేస్తామంటే చెప్తాను.

నార—చాతనైతే చేస్తాను. ఏమిటో చెప్పు.

బాల—తెలుగుకు వ్యాకరణాలని కొన్ని వున్నాయండి. అవి తలాతోకాలేకుండా వుంటాయి. ఒకదాని కొకటి పొందదు. ఇక వ్యాకరణాల కీ గ్రంథాలలో ప్రయోగాల కీ సంబంధం వుండదండి. అంతేకాకుండా భాష అనేక విధాల మారిపోయిందండి. ఇప్పటికవు లంతా ఆపాతభాషే వ్రాయాలంటారు గాని, మారి పోయిన కొత్తభాష కూడదంటారండి. పోనీ, కవులు బాహాటంగా ప్రయోగించినముక్కలేనా వెయ్యకూడ దంటారు.

నార—అయితే నేను చేసేసదుపాయం యేమిటి?

బాల—మరేమీ లేదు. మీరు ఈమారు స్వర్గం లోకి వెళ్ళేటప్పుడు, ఆ అప్పకవి, ఆచిన్నయ్యసూరి మొదలైన వాళ్ళని కనుక్కొని, వాళ్ళని చీవాట్లు పెట్టి, వాళ్ళవ్యాకరణాలలో లేనివికూడా ప్రయోగించవచ్చునని అనుజ్ఞతీసుకొని రావాలి.

నార—అయితే, శాస్త్రం సమంగా అనుసరించి చెప్పేవాళ్ళు యిప్పుడెవరయినా ఉన్నారా?

బాల—ఒక్కరూలేరండి.

నార—అయ్యో, ఒక్కరూలేరా?

బాల—ఒక్కరూలేరండీ. కొమ్ములుతిరిగినవాళ్ళు కూడా, పేజీకి పదేసితప్పులుచేస్తారండి.

నార—అయితే వారెందుకీలాగు యేడుస్తారు? చేతనైనట్టూ చేయకూడదూ? సరే నాకూపట్టీ రాసి యియ్యి. అదిపట్టుకొనివెళ్ళి స్వర్గంలో వో సభచేయిస్తాను. ఆసభలో తీర్మానం భూలోకంలోకి రవానా చేయిస్తాను స్వేచ్ఛగా కవిత్వంచెప్తే మనోహరంగా వుంటుందిగాని; యేమిటీ కాళ్ళూ చేతులూవిరిచి గట్టడం. నేను రేపుసాయంత్రం స్వర్గంలోకి వెళ్తాను. అప్పటికి నాకోపట్టీతయారుచేసి యియ్యి.

బాల—చిత్తం. యేదో తమరు సాయంచెయ్యాలి సెలవు.

నార—సరే వెళ్ళు- పట్టీమాత్రం మరచిపోకు.

బాల—లేదు (నిష్క్రమించును).

నార—తెనుగుకవిత్వంలో యిలాంటిచిక్కులు పెడతారని తెలుస్తే, అప్పుడే దండం పెట్టేసి ఊరుకొందును. ఈశాస్త్రులుగారు అందుకే వసుచరిత్ర ఊరికే వల్లించమంటారు. ఇది అయితే, తరువాత వ్యాకరణాలు వల్లించమంటారు కాబోలు. ఇన్నీ అయితే గాని చెప్పగూడదట. ఇన్నీ చదివినా, పండితులభాష స్వాధీనం కాదని బాలకవి అంటాడు. వ్యవహారంలో పదాలు వాడుక చేయగూడదట. ఏడిసినట్టేవుంది. "ఉండేదేరాముడొకడు" ఇది తప్పట "ఉండెడిదే" అని దిద్దుకోవాలట. (పాడుచు) "ఉండెడిదే రాముడొకడు" ఉండెడిదేరాముడొకడు- ఉండెడిదేరాముడొకడు- ఛీ-ఛీ- సుత్తితోకొట్టినట్లుంది వెధవ పదం బాగులేదు ఉండేదేరాముడొకడు- ఉండేదేరాముడొకడు-ఆ హా హా- ఎంతయింపుగా వుందో. ఇదేబాగుంది. ఇలాగుచేస్తే నేబాగుంటుంది. తప్పకుండా ఇదేతీర్మానం చేయించాలి.

(లోనికిపోవును)

మండపాక పార్వతీశ్వరశాస్త్రి (ఎం. యే).

---

# రుద్రసేనానిచరిత్రము

కాకతీయసామ్రాజ్యధురంధరుఁడగు రుద్రదేవుని కాలమున సుప్రసిద్ధుఁడై యౌదార్యసాహసములతోఁ బద్మనాయక వంశమునకు వన్నెఁదెచ్చిన రుద్రసేనాని పవిత్రజీవితమును గూర్చి చరిత్రకారు లింతవఱకు నివేదింపలేదు. ఈ రుద్రసేనాని, ఓరుగల్లులో రుద్రేశ్వరమను దేవాలయముఁ గట్టించి కొండ యను గ్రామ మొసం

గాను. ఇతఁడు కట్టించిన రామప్పగుడుల పూర్వశిల్ప జీవకళాసంకులములై హైందవ్యప్రతిభాపరంపరల వేనోళ్ల జాటుచు నిజాము రాష్ట్రమున నోరుగంటి కనిమిది యోజనముల దూరమున నున్నవి. ఆ యాలయ ప్రతిబింబభాగ మాంధ్రులచరిత్రము రెండవభాగమునఁ బ్రకటింపఁబడియే యున్నది. ప్రకృత మీరామప్ప గుడులయొద్ద లభించిన శిలాశాసనము నాధారముగఁ జేసికొని కాకతీయుఁ చరిత్రముపద్మనాయకుల చరిత్రము వీలగునంతవఱకు సాధించియాంధ్రలోకమునకు వెల్లడింతుము.

రుద్రచమూపతి ప్రతిష్ఠించిన దైవములకుఁ గ్రమముగఁ గాటేశ్వరుఁ డనియుఁ గామేశ్వరుఁ డనియు నామ మొసరించెను. ఇతని జనకుఁడు కాటయచమూపతి, పితామహుఁడు కామయచమూపతి, ప్రపితామహుఁడు కాటయచమూపతి. తల్లి కామాంబ. ఈవంశమునకు శాసనమునుబట్టిచూడ మూలపురుషుఁడు బ్రహ్మసేనాని యని తేలుచున్నది. బ్రహ్మసేనాని

శ్లో॥ శ్రీమద్బ్రహ్మాఖ్య సేనాని । రభూద్భూరిగుణాకరః
నిజప్రతాప ప్రాకార । పరిత్రాతమహీతలః ॥

శ్లో॥ తూర్యప్రణాద సమనంతర మేవ తూర్ణ
మాక్షిప్య సౌ యవనికా సదృశం కవాటం
కాంచీపురస్య సమదోదయ దాళు వీర
లక్ష్మీవివాహమివ కాకతివల్లభస్య॥

అని శాసనమున నిటులఁ బ్రశంసింపఁబడెను. శ్లోకముల సారాంశ మేమన (రేచర్లగోత్రజుఁడు రుద్రసేనానికిఁబూర్వము తద్వంశమున) బ్రహ్మసేనాని యను వీరుఁడు గలఁ డనియుఁ దన ప్రతాపముచే నాతఁడు మహీతలముఁ బాలించెననియుఁ గాంచీపుర కవాటములఁ దెఱలవలెఁ దలంచి పగులగొట్టి తన ప్రభుఁడగు కాకతీయ నృపాలునకు వీరలక్ష్మీవివాహ మొసరించెననియు ముఖ్యాభిప్రాయము. ఈ బ్రహ్మసేనాని పలనాటివీరుల యుద్ధమునకుఁ జెందిన శిలము బ్రహ్మనాయఁడు కాఁడు, ఆయనకంటె మిగులఁ బూర్వకాలమున నున్నవాఁడు. ఈ విషయ మింకను బరిశోధించెదము.

తత్కులే ద్విషదాం జేతా కాటయాఖ్యచమూపతిః

అనుశ్లోకస్థమగు తచ్ఛబ్దవాచ్యుఁడు బ్రహ్మయ సేనాని ఈ బ్రహ్మయసేనాని వంశమునఁ గాటయచమూపతి జనియించెను. ఈ కాటయసేనానిపుత్రుఁడు కామయసేనాని 'కాకతీయనృపుఁడగు ప్రోలరాజునకు సేనానాయకుఁడని యీశాసనమునఁ జెప్పఁబడియుంటచే బ్రహ్మచమూపతి క్రీ॥ శ ౧౧౦౦ లో నున్న కాటయచమూపతికి వంశకర్తయనియు బ్రహ్మసేనానికాలమునుండియుఁ గాకతీయులయొద్ద రేచర్లగోత్రీయులు సేనానాయకులుగ నుంట యాచారమని తెలియుచున్నది ఇది చరిత్రస్థము కాలేదు.

... ... ... కామనామచమూపతిః ॥

శ్లో॥ శ్రీమత్ప్రోలనృపాలసైన్యపతినా విఖ్యాతవిక్రాంతినా
యద్ధైర్యేన మహాబలేన నిహతో మంథన్యగుండాధిపః॥

కామచమూపతి రుద్రసేనానికిఁ బితామహుఁడు. ఇతఁడు కాకతీయప్రోలనృపాలునకు సేనాపతియై మంథనిపాలకుఁడగు గుండాధిపుని వధించెను. హానుమకొండలోని శాసనములోఁ బ్రోలరాజు స్వయముగా గుండరాజును జంపినటులఁ గానవచ్చుచున్నది. ఉభయాధారములను బరిశీలించినచో ప్రోలరాజుకు సేనానియై కామసేనాని గుండరాజును వధించియుండునని స్ఫురించును. ఈ గుండరాజుస్థానమగు మంథని యని శ్లోకమున వ్రాయఁబడి యున్నది. హానుమకొండ శాసనములోన మంత్రకూటనగరమని చెప్పఁబడినది. వీరభద్రరావుగారీ మంథని (మంత్రకూటము) కృష్ణామండలములోని మంతెన యని నిర్ణయించిరిగాని యది ప్రమాదము. నిజాము రాష్ట్రమున గోదావరీతీరమందలి మంథనియే గుండరాజు నివాస స్థలము. దీనిని నిర్ణయింప నితరాధారములు పెక్కులు కలవు. అవి ప్రకృతములు కావు. గుండరాజు ప్రాంతములఁ బాలించినటుల శాసనాదియాధారములుగాక తన్నామ నిర్మితమగు గుండమురాజుపల్లె యను గ్రామ మొండుకలదు. కామచమూపతి ప్రోలరాజు పొందిన విజయములకుఁ గారకుఁడనియు గుండరాజును వధింపఁ గామచమూపతి విజృంభించెననియుఁ దెలియుచున్నది. ఇతని పుత్రుఁడును రుద్రసేనాని తండ్రియునగు గాటయచమూపతి యంతగఁ బరాక్రమశాలియని తోఁచదు. అతని విక్రమము లీశాసనమునఁ గానరావు.

"శ్లో॥ తస్మాత్తాదృటయసేనానిస్సూనుస్సూనృతభాషణః
జేతాశూరస్తుతోవక్రపరాక్రమవిభూషణః॥

శ్లో॥ గుణమణిగణసింధుర్యస్సతామేకబంధుః
స్తుతపశుపతిమూర్తిః సన్నుతానంతకీర్తిః"

లోనగు శ్లోకములవలనఁ గాటయ సేనాని లోకసామాన్యుఁడని స్పష్టమగుచున్నది. ఇతని పుత్రరత్నమె రుద్రసేనానాయకుఁడు.

"శ్లో॥ తస్మాజ్జాతో ద్విషాంజేతా శ్రీమద్రుద్రచమూపతిః

శ్లో॥ మేరోస్థైర్యమమార్దవేనుననిజేసౌందర్యమీశద్రుహో
గాంభీర్యంవిషజన్మదేశని సరిన్నాథేసుగన్ష్మాసుహో
దానంవినదుగాసదేశమంభూః స్పష్ట్వాతద్రీతియా
దోషాఽస్పృష్టగుణాకరం యమసృజత్కామాంబికానందనం॥"

శాసనమున నిటులఁ గీర్తింపఁబడి యున్నాఁడు. సమిష్టిమీఁదఁ బరిశీలింప రుద్రసేనాని త్యాగశీలుఁడనియుఁ బరాక్రమశాలి యనియు విరోధిసంహరణ చణుఁడనియు సుస్వరూపుఁడనియుఁ దోఁచుచున్నది. ఈ రుద్రసేనాని చరిత్రమునఁ బెక్కు లమూల్యాంశములు బయలువెడలుచున్నవి.

"శ్లో॥ శ్రీమద్రుద్రనరాధిపే రిపుమహీపాలాద్రివజ్రేదివం
యాతే కాకతినాథభోగ్యవిలసత్ పృథ్వీకరాకర్షణే
సంభ్రాంతాస్సమదావృతాస్సకుటిలాః వైరిక్షమాపాలకాః...

శ్లో॥ ఉద్దండమండలిక...విఖండ్య
తుంగధ్వజాగ్రనిహితేంద్రకటిస్వభర్తుః
పుర్యాస్వదేశ యదశేషసమృద్ధిసస్య
క్షేత్రేభూపతి మృగవ్రజభీతియేయుః॥

శ్లో॥ యత్సేనాధ్వజదండాగ్ర పతాకాభిః ప్రతర్జ్జనః
ధృతంనాగటిభూపాలః పలాయ(నక)రోభవత్॥

శ్లో॥ శూరస్వామిహితః సునిశ్చితమతిర్యః కాకతీశశ్రియా
పాదేభూరిపుకంటకేషునిహితే తేతేష్వ్వేషు మోహాత్మనాం
తైద్విడ్భ్యోవ్యథితేచతాఞ్ భుజబలాదుద్ధృత్యపిష్టాఃపాకాత్ । తామస్థాపయదవ్యథాస్థిరతరం రేచర్లరుద్రస్స్వయం॥

ఈ శ్లోకములవలనఁ గాకతీయరుద్రదేవుఁడు స్వర్గముఁ జేర నాతని రాజ్యము విరోధులాక్రమించి ప్రజాక్షోభమొనరించిరనియు శూరుఁడు స్వామిహితుఁడు నగు మన రుద్రసేనాని విరోధికంటకక్షతమగు రాజ్యలక్ష్మిని బంధోన్ముక్తురాలినిగ నొనరించెననియు నొకనూతనాంశము తెలుచున్నది. చరిత్రకారులు రుద్రదేవుఁడు క్రీ. శ ౧౧౮౦ మొదలు ౧౧౯౬ వఱకుఁ బాలించినటులు పిమ్మట మూఁడు సంవత్సరములు మహాదేవరాయలు పాలించినటులు నిర్ణయించిరిగాని రుద్రదేవుని యనంతరము కాకతీయసామ్రాజ్యకల్లోలమును వాకొనరైరి. ఇదినూతనాంశము. రుద్రదేవుని సామ్రాజ్యముకొఱకు వేచియున్న మహాదేవరాయలుండఁగనే విరోధిరాజులా రాజ్యము నెటులాక్రమించిరో అప్పుడు రుద్రసేనాని స్వయముగ నేల యుద్ధరింపవలసివచ్చెనో తెలిసికొననింకను శోధింపవలసి యున్నది. మహాదేవరాయఁడు రాజ్యముపాలించినటుల శాసనాధారములు కానరాకుంటచేతను కొండిపర్తిలోని చౌండసేనాని శాసనమున రుద్రదేవుని పిమ్మటగణపతిదేవుఁడె చెప్పఁబడుటచేతను గాకతీయరుద్రదేవుని యనంతరము సామ్రాజ్యము విచ్ఛిన్నము కాఁగా రుద్రసేనాని దానినుద్ధరించి స్వామి భక్తి పరతంత్రుఁడై గణపతిదేవునకుఁ బట్టముగట్టినటులూహింపవలెను.

క్షైత్రపాలునిచే మహాదేవరాయఁడుమరణించినటులఁ జరిత్రములు తెలుపుచున్నవి. ఇది యసత్యమేని రుద్రదేవుఁడు సజీవిగనున్నప్పుడే మహాదేవరాయలు గతించియుండును. లేకున్న రుద్రదేవుఁడు గతించినపిమ్మట కల్లోలములు కలుగుటకు రుద్రసేనానియుద్ధరించుటకుఁ దగినయవకాశము గానరాదు. రుద్రదేవుని సామ్రాజ్యమును నాగటభూపాలుఁడు హరించినటుల శాసనము నఁగలదు. ఈనాగటిభూపాలుఁడు మేడరాజునకు మంత్రియుఁ బిమ్మట ప్రభువునైన నాగదేవరాజు కావచ్చును. నాగరాజుశాసనము నిజాము రాష్ట్రములో గోవిందాపురము చెఱువు కట్టపైగలదు. స్వామిభక్తిఁ జూపుటయెగాక ప్రభునియనంతరము సామ్రాజ్యము విరోధులనుండివిడదీసి ప్రతిష్ఠగడించిన రుద్రసేనానిజీవితము పవిత్రతమము. రుద్రదేవగణపతి దేవులకాలమున జేతిరెడ్డి నామిరెడ్డి నామములుదక్క నితరసేనానులపేరులు వీరభద్రరావుపంతులుగారు వినరావని యాంధ్రులచరిత్రమున వ్రాయుటచే నీశాసనము రుద్రసేనాని చరిత్రము వారు వినియుండరని తెలియును. ఈరుద్రసేనానిచరి

త్రము పద్మనాయకచరిత్రమునను వెలుగోటివంశచరిత్రమునను గానరామి వారికీవంశ మలభ్యమని వెల్లడియగును. పిల్లలమఱ్ఱిలోని యెఱ్ఱక్కసానమ్మ శాసనములో భీమాభిధానుఁడు కాంచీపురము భేదించినటులఁ జెప్పఁబడినది. ఈ శాసనములో బ్రహ్మసేనాని కాంచీపురి భేదించినటులఁ జెప్పఁబడినది. ఈయుభయులకుఁగల కాలవ్యత్యాసము విక్రమాదికములు పౌర్వాపర్యములు దెలియరావు. బ్రహ్మసేనానియు భీమాభిధానుఁడు నేకగోత్రీయులె గాని పరస్పరసంబంధముల నెఱుంగ నింకను బరిశోధింపవలయును. ఎఱ్ఱక్కసానమ్మ శాసనములోఁ గాటరాజు కామరాజు పేరులు గానవచ్చుచున్నవి. వారలకుఁ గాకతీయులయొద్ద సేనానాయకత్వమున్నట్లుగా గన్పింపమియుభయశాఖలు వేఱువేఱని యెఱ్ఱక్కసానిశాసనములోని కాటరాజు కామరాజుకంటె రుద్రసేనానిశాసనములోని గామసేనాని కాటసేనానులు ప్రాచీనులనియుఁ బరిశోధనము వలన వెల్లడియగును. ఉభయశాసనములు సమన్వయింప వీలుకానరాదు. దీనినిబట్టి చూడ నామిరెడ్డికుటుంబము రుద్రసేనానికుటుంబము గోత్రసంబంధము కలిగి ప్రత్యేకకాలములలో నొక్కసంస్థానములో సేనానాయకత్వము వహించినటులఁ దోఁచును. రుద్రసేనాని యొనరించిన ప్రకృతధర్మకాల మీశాసనమున నిటుల వ్రాయఁబడినది.

శ్లో॥ శరలోకేందు భూసంఖ్యశాకాబ్దే శ్రీముఖామఘా
శుక్లాష్టమ్యాం భానువారే పుష్యర్క్షే చమహామతిః,
రుద్రేశ్వరాయభోగార్థం గౌరీశస్సహితాయనః
ప్రాదాదుప్పర్లపల్లించ బోర్లపల్లించ సాదరం॥

పైశ్లోకములచే శా॥ శ ౧౧౩౫ లు శ్రీముఖసంవత్సరమునకు సరియగు క్రీ-శ॥ ౧౨౧౩ లో రుద్రసేనాని యీశాసనము స్థాపించి రుద్రేశ్వరమను- అమోఘశిల్పకళారాజితమనోహరాలయము నిర్మించి దానికి నుప్పర్లపల్లి బోర్లపల్లి యొసంగినటుల వ్యక్తమగుచున్నయది.

కాకతీయరుద్రదేవుఁడు క్రీ॥ శ॥ ౧౧౬౦ మొదలు ౧౧౯౬ వఱకుఁ బాలించినటులఁ దెలియవచ్చుటచేతను రుద్రసేనాని క్రీ॥ శ॥ ౧౨౧౩ లో ధర్మ మొనరించినటులఁ దెలియుటచేతను రుద్రసేనాని రుద్రదేవుని యుత్తరవయస్సున సేనానాయకుఁడుగఁ జేరి రుద్రదేవుని యనంతరము సామ్రాజ్య ముద్ధరించి గణపతిదేవునికా రాజ్యమప్పగించి యాతనికాలమునను సజీవియైనటు లీశాసనమువలన ధృవపడుచున్నది. రుద్రదేవుఁడు హనుమకొండలోఁ గట్టించిన దేవళముకంటె రుద్రసేనాని కట్టించిన ప్రకృతాలయములు విచిత్రవిగ్రహాదికములచే నలరారి, ఆంధ్రశిల్పవిశేషముల వేనోళ్ళ శ్లాఘించునటులున్నవి. ఆలయము లరణ్యమధ్యమునుంటచే నగమ్యములుగనున్నవి. ప్రకృత మీయాలయముల రామప్పగుడులని వ్యవహరించుట కాధార మెఱుంగరాదు. ఇపుడీయాలయములు పూజాదులు లేకున్నవని వ్రాయ సంతాపమగుచున్నది. రుద్రసేనాని యాలయసమీపమున నొక గొప్ప తటాకము నెలకొల్పెను. దానిని గుఱించిన యంశమీ శాసనమునఁ గేవల వర్ణనాకరమగుటచేఁ జర్చింపమైతిమి. చరిత్రగ్రంథములలోఁ బవిత్రతముఁడు శూరశిఖామణియగు నీతని చరిత్రము వ్రాసికొనుట కనువగు శ్లోకముల మాత్రమె వ్రాసి చరిత్రాంశముల నిర్ధారణ మొనరించితిమి. సావకాశముగ శాసనగ్రంథ మీవ్యాసమున కనుబంధముగ మఱియొకమాఱు ప్రకటింతుము.

— శేషాద్రిరమణకవులు.

---

# నవరత్నమాల

శ్రీరాజరాజనరేంద్రుని పాలనం, బున వన్నెకెక్కిన పురవరంబు
న్యాయవాదులును న్యాయస్థానముల్ జాల, కళలయ రాజిలు పుటభేదనంబు
నియతిఁ బాలకకళానిలయంబు బోధనాభ్యసనశాలయు నొప్పు పట్టణంబు
పురరత్న నిలయంబుఁ బోగబండిబాటయుఁ, బొగడుచుండెడునట్టి నగరవరము
నాంధ్రమునకు ముఖ్యస్థానమైన రాజమహేంద్రవర మాంధ్రదేశపుస్తకాలయమునకు సతత మర్హంబుగాదె, గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!

సీ॥ నరుల మాలిన్యంబు హరియించి మించు గో, దావరీనది యొక్క దండఁ దనర
హరభక్తిచే మీఱు నల మృకండసుతుండు, కీర్తింపఁబడు చోక్క క్రేవఁ జెలఁగఁ
బరసతిఁ మాతృభావమునఁ గాంచినయట్టి, సారంగధరుఁ డొక్కచక్కి నలర
వినుతు లొందెడు జనార్దన కోటిలింగేశ్వ, ర ప్రభు లుభయ పార్శ్వముల వెలయ
నతిపవిత్రముగా నొప్పునట్టి రాణ్మ, హేంద్రవరమాంధ్రదేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతత మర్హంబు గాదె, గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!

సీ॥ దేశభాషల యందు దీపింప నధికమౌ, నాంధ్రభాషకు నెద్ది యాలయంబు
వాక్యానుసనుఁ డని వఱలు నన్నయకవి, బ్రహ్మకావాసమై పరఁగు నెద్ది
పంచమవేద సద్భారతాంధ్రీకర, ణారంభమున కేది యాస్థలము
తెలుఁగు భాషకును దొల్దొలుత లక్షణము వ్రా, యఁగనయ్యె నేది యాస్థలంబు
నాంధ్రమునకేది కేంద్రఁబో యట్టి రాణ్మ, హేంద్రవరమాంధ్రదేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతత మర్హంబు గాదె, గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!!

సీ॥ కాళిదాసాది సత్కవుల ప్రసిద్ధరూ, పకములు తెల్గింపఁబడియె నెచటఁ
బ్రాచీనులౌ కవిరత్నంబుల చరిత్ర, లెచ్చోటఁ దొలి రచియింపఁబడియె
నన్యభాషలఁ గాంచి యఖిల శాస్త్రములు నా, వలులు మున్ముందుగ వ్రాసి రెచట
సులభమౌ శైలిని సుందరవచనంబు, లెచ్చటఁ బిదపఁ గల్పింపఁబడియె
నాంధ్రమున కేది జన్మంబో యట్టి రాణ్మ। హేంద్రవర మాంధ్రదేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతత మర్హంబు గాదె। గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార॥

సీ॥ సంఘసంస్కర్తయై సన్నుతిఁ గనినట్టి, వీరేశలింగమే వీటఁగలఁడొ
భక్తచింతామణీ ప్రముఖ సత్కృతులచే, నెన్నంగఁ బడువాఁడె చటఁగలఁడొ
యభినవసద్భారతాంధ్రీకరణ కర్త,లౌ వ్యాసకృష్ణులే యవనిఁగలరొ
హేమలతాది సత్కృతులచే నుతిఁగన్న, నరసింహకవియు నీనగరిఁగలఁడొ
యమలరత్నాదులెటనుండి రట్టిరాణ్మ। హేంద్రవరమాంధ్రదేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతత మర్హంబు గాదె। గ్రంథనిలయాధి పతులార! భ్రాతలార!!

సీ॥ వేలయిదాఱుగ్రంథాలతో నల సర్వ,జనపుస్తక చయంబు దనరుచుండ
నాల్గైదువేలగ్రంథాలతోడుత వను,రాయ భాండారంబు ప్రబలుచుండ
సప్తాష్టములయొక్క సాహస్రములను లిం,గాస్థిక భాండారమమరుచుండ
రెండువేలసుకృతుల్ నిండారరత్నక,వి గ్రంథనిలయంబు వెలయుచుండ
నాంధ్రభాషాభివర్ధన మలరు రాణ్మ। హేంద్రవరమాంధ్ర దేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతతమర్హంబు గాదె। గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!!

సీ॥ సుందరంబుగ నొక్కచోటఁ బ్రాచ్యలిఖిత, పుస్తకాగారంబు పొల్పుమీఱ
బహుజనాకీర్ణముల్ బాటలంగడులును, రమ్యముల్ పేటలు రంగుమీఱ
బహువిధౌషధులతో నవమృగాస్థికలతోఁ, జిత్రవస్తులశాల చెన్నుమీఱ
వివిధనాటకములు వెసఁ బ్రదర్శింప న,నేకశాలలు కడు నింపుమీఱఁ
జెన్ను పురివలె శోభిల్లి చెలఁగు రాణ్మ, హేంద్రవర మాంధ్రదేశపుఁ గేంద్రపుస్త
కాలయమునకు సతత మర్హంబు గాదె, గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!

సీ॥ వక్తృత్వమును వృద్ధిఁబఱుప స్వర్ణరజిత,పతకంబులిడు బహుమతిపరీక్ష
లమల వాక్శ్రీలిని వ్యాసవిరచనంబు, కఱలంగఁ బుస్తక బహుమతులను
బాలబాలికలందు భావాభివృద్ధికై, యేపారునట్టి పోటీపరీక్ష
లఖిలప్రజాజ్ఞానమభివృద్ధినొందంగ, నలరుచుండెడి నుపన్యాసములను
గలుగు భాషాసమాజముల్ వెలయు రాణ్మ,హేంద్రవర మాంధ్రదేశపుణ్ గేంద్ర పుస్త
కాలయమునకు సతత మర్హంబుగాదె, గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!
సీ॥ ప్రకటాంధ్రభోజుండు రావు వేంకట కుమా,రమహీప్రభుఁడు సూర్య రాయవిభుఁడుఁ
బ్రణుతాభినవ కృష్ణరాయండు మానిత, వేంకట కృష్ణ రాడ్విభవుండు
విద్యావినోదులై విలసిల్లు నలలచ్చ,రాడ్విశ్వసుందర ప్రభువరేణ్యు
లాంధ్రభాషాపోష కావళి పాలిత,హితపాళిబహుధరణీశ్వరాళి
యమరుగోదావరీమండలమున రాణ్మ। హేంద్రవర మాంధ్రదేశపుణ్ గేంద్ర పుస్త
కాలయమునకు సతత మర్హంబుగాదె। గ్రంథనిలయాధిపతులార! భ్రాతలార!
తే॥ గీ॥ పదియు నెనిమిదేండ్లకును బూర్వంబె పుస్త। కాలయస్థాపనము మొదలయ్యె నెచటఁ
గేంద్రభాండారమా రాణ్మహేంద్రమందు। నిలుప నత్యర్హమనియెదణ్ చింతపెంట
కులుఁడ వేంకటరమణనా వెలయువాఁడ॥

---

# అమెరికాదేశమందు భటోద్యమము

ఇంగ్లాండుదేశమునం దీయుద్యమమువలనఁ గలిగినమహోత్తరమైన ఫలితములను గుర్తెఱింగినవారై అమెరికాదేశస్థులీయుద్యమమును ౧౯౧౦ వ సంవత్సరమున తమదేశమందు నెలకొల్పిరి. ఈ యుద్యమ వ్యాపనార్థమై ప్రథమమునందు దేశమున కంతకును జాతీయసంఘమును నెలకొల్పిరి. పిమ్మట దేశమునం దక్కడక్కడ శాఖల నేర్పరచి పని చేయదొడంగిరి. దేశమునందంతటను యీయుద్యమమంత నొకే రీతిని జరుగుటకు గాను, ఈయుద్యమమును గూర్చి గ్రంథము నొకదానిని వ్రాసి ప్రకటించిరి. ఈయుద్యమము నాదేశప్రభుత్వమువారు గూడ నంగీకరించి,



కలనల్ రూస్ వెల్టు.

శాసనమును గూడఁ జేసియున్నారు. ఆదేశమునందు ౨౫౦,౦౦౦ మంది బాలభటులు గలరు. ఆ దేశమునం దీయుద్యమాభివృద్ధికై మిక్కిలి పాటుబడి, బాలభట సంఘమున కుపాధ్యక్షులుగ నుండినట్టి కల్నల్ రూస్ వెల్టుగారి పటమును మీరిక్కడఁ జూడఁగలరు. వీరు జెప్పిన యీ క్రింది వాక్యము పరమార్హము.

"ఒక జాతియందున్న పురుషులును స్త్రీలును ఆరోగ్యవంతులు, పరిశుద్ధవంతులు, వీర్యవంతులు అయియుండి శ్రమమువలనను పరిశ్రమవలనను జయముఁ గాంచుటయెట్లో తెలిసియుండినగాని యా జాతి జీవించియుండజాలదు".

# భటోద్యమ సంస్థాపనాచార్యుడు.

సేవావ్రత మనాదిసిద్ధముగ భరతవర్షమున బ్రబలియున్నది. అయినను పాశ్చాత్యసాంప్రదాయప్రాబల్యమువలన జనులయందు ధర్మబుద్ధి క్రమముగ నశించిపోయి సేవయందుండెడి వాంఛ క్రమముగ తగ్గిపోవుచున్నది.

ఇటీవల పాశ్చాత్యులుగూడ ధర్మపరత్వముయొక్క మహత్తును దెలిసికొనినవారై సేవావ్రతమునాచరించుటకై పలువిధములఁ బాటుపడుచున్నారు. అట్టి ప్రయత్నములయందెల్ల భటోద్యమ మగ్రస్థానము నలంకరించియున్నది.

ఈయుద్యమము ౧౯౦౮ వ సంవత్సరమున సర్ రాబర్టు బేడెను పవెలు అను మహనీయునివలన ఇంగ్లాండుదేశమునందు ప్రారంభింపఁబడినది. దక్షిణాఫ్రికాయందు బోయరుయుద్ధము జరుగుకాలమున, పెద్దవారికన్న పిల్లలే తమకిచ్చినపనులను మిక్కిలి సామర్థ్యముతో నెరవేర్పగలరని కనుఁగొనిరి. ఒకసేననుండి మఱియొకసేనకు రహస్యపు సందేశములను గొనిపోవుపనికి, పిల్లలను నియోగించిచూచిరి. సాధారణులగు మనుజులు ఈకార్యములకు దిగుట కష్టతరము. అనేకాపదలపాలు కావలయును. ఒక్కొక్కసారి శత్రువుల చేతిలోఁజిక్కి హతము కావలసివచ్చును. బాలకు లిట్టికష్టములనన్నింటినిగూర్చికొని బేడెన్ పవెల్ గారిచేఁ బనుపఁబడిన కార్యములను జయప్రదముగను అతి సామర్థ్యముతోడను నిర్వహించిరి. బాలకుల ధైర్యసాహసములకచ్చెరువంది, వారికి సక్రమమగు నొకపద్ధతి నేర్పఱచి శిక్షనిచ్చిన, వారు దేశమున కెంతో మహోపకారమును జేయఁగలరని యాయనకుఁదోఁచెను. ఈయూహయే భటోద్యమమునకు ప్రథమ సోపాన మయ్యెను. అప్పటినుండియు ఆయన తన యుద్యోగమునుగూడ విడచిపెట్టి యీయుద్యమాభివృద్ధినిమిత్తమై నిరంతరము పాటుబడుచున్నారు. ఈ యుద్యమవ్యాపనార్థమై యీ యుద్యమతత్త్వమునుగూర్చి యనేకగ్రంథముల నాయన రచించియున్నారు. యువకులకు సంబంధించిన విషయములనుగూర్చి వ్రాయునది యొకపత్రిక- బాలుర విషయములనుగూర్చి వ్రాయునదియొకపత్రిక- బాలికాభటులనుగూర్చివ్రాయునది యొకపత్రిక- ఇట్లువీరువివిధతరగతులయందుండు భటులకుఁ బనికివచ్చుటకై ప్రత్యేకముగపత్రికలనునిర్వహించుచున్నారు. ఏదేశమందైనను యీ యుద్యమవ్యాపకమునందు వారిగ్రంథములే యాధారములై యున్నవి. వారియొక్క పటమును యీ వ్యాసమునందుఁ జూడఁగలరు.



సర్ రాబర్టు బేడెన్ పవెల్,

# బాలభటుని యాటలు

## ౧ పతాకము దొంగిలించుట.

ఈ యాట యెంతమంది యయినను రెండుపార్టీలుగా చీలి యాడవచ్చును. ప్రతి పార్టీకిని యొక నాయకుఁడు లేక పెద్దవుజ్జీ యుండవలెను. ఈ పార్టీలలో నొక పార్టీవారు పతాకరక్షకులుగాను రెండవ పార్టీవారు పతాకము దొంగిలించువారుగాను పిలువఁబడుదురు. మూఁడు పతాకములను సమభూమిమీఁద, నొక పతాకమునకు రెండవ పతాకమునకును 20 గజముల దూరము ఉండేలాగున పాతవలెను. అనగా నొక పతాకమునకును రెండవ పతాకమునకును మధ్యభాగా 20 గజములు ఉండవలెను. పతాకములు పాతినస్థలము దొంగిలించేపార్టీవారికి తెలియనీయగూడదు. పతాకరక్షకపార్టీయొక్క పెద్దవుజ్జీ, తనపార్టీవారిని, పాతిన పతాకములకు రెండువందలగజముల దూరమున పతాకములచుట్టూ కాపుంచవలెను. అప్పుడు ఆట ప్రారంభమవును. పతాకములను దొంగిలించ నిర్ణయించబడిన పార్టీవారు పతాకములు యెక్కడ పాతబడినదిన్ని కాపలాయున్నవారు యెచ్చట యున్నదిన్ని కనుఁగొని రక్షకులకు తెలియకుండ పతాకములను దొంగిలించ ప్రయత్నించవలెను. ప్రతి మనిషిన్ని ఒక పతాకముకన్న యెక్కువ దొంగిలించగూడదు. పతాకరక్షకభటులు పతాకములకు రెండు వందల గజములలోగా రాకూడదు. పతాకమును దొంగిలించువానిని రక్షకులు చేతితో పట్టుకోనవసరము లేదు. ఇద్దరు రక్షకులుచేరి 10 గజముల దూరములో నుండే దొంగిలింపవచ్చినవానిని చేతులు యెత్తమన వచ్చును. అప్పుడు దొంగిలించవచ్చినవాఁడు అయిపోయినట్టు యెంచవలెను. దొంగిలించేపార్టీవారు రక్షకులను దగాచేయుటకు యిష్టమువచ్చినమోస్తరు జంతుధ్వనులుచేయ వచ్చును. నియమితకాలములో మూఁడు పతాకములు దొంగిలించవలెను. అలా దొంగిలించలేని యెడల మధ్యవర్తి ఒక ఈలవేయును. అప్పుడెచ్చటనున్నవార నచటనే కదలకుండ నిలువబడవలెను. ఇది యెందుకన దొంగిలించేవారు పతాకములకు యెంత దగ్గరగా నున్నదిన్ని రక్షకభటులు యేస్థితిలోనున్నది కనుగొనుటకు. ఈ యాటయొక్క ముఖ్యోద్దేశ్యమే మన రక్షకు లందఱు యొకరికొకరు అందుబాటులో నుండవలెను. ఈ ఆట రాత్రులాడదలఁచిన యెడల పతాకములకు బదులు లాంతర్లుపయోగించవలెను.

## ౨ వేగులవాఁడు.

ఒకనిని వేగులవానినిగా నియమించి యతనిచేతి కొక యుత్తరము నిచ్చి శత్రువులచే ముట్టడింపఁబడిన స్థలమునకుఁబోయి ఆ ఉత్తరమును ముట్టడింపఁబడినవారికిచ్చుట. ఒక గ్రామముగాని, ఇల్లుగాని, లేక యేదో ఒకస్థలముగాని ముట్టడింపబడినస్థలముగా నేర్పరచుకొనవలెను. వేగులవానిగా నియమింపబడినవాఁడు రెండడుగుల పొడవుగల నొక రంగుగుడ్డను తన భుజముమీఁద నుంచుకొని రక్షకభటులచేత పట్టుబడకుండ రక్షకస్థానము చేరవలెను. రక్షకభటులు గమ్యస్థానముగ నేర్పరచబడిన స్థలమునకు మూఁడువందల గజములకు తక్కువ కాని దూరములోనుండి వేగులవానిని పట్టుకొన ప్రయత్నించవలెను. వేగులవానిని పట్టుకొనుట యనగా వేగులవాని భుజముమీఁదనున్న రంగుగుడ్డను లాగుకొనవలెను. వేగులవాఁడు గమ్యస్థానమున కొక మైలు దూరమునుండి బయలుదేరవలెను. వేగులవాఁడు యేవైపునుండి బయలుదేరినది రక్షకభటులకుఁ దెలియఁగూడదు. వేగులవాఁడు తనభుజముమీఁద రంగుగుడ్డ నుంచుకొని రక్షకభటులనుదగాచేసి తప్పించుకొని గమ్యస్థానము జేరుటకు ఆడవేషముతిక్క తన యిష్టమువచ్చినవేషము వేసుకొనవచ్చును.

## 3 ఇరుకటుల వేగులవారు

ఈయాట యెంతమందయినను రెండుపార్టీలుగాచీలి యాడవచ్చును. రెండు పార్టీలను సులభముగా పోల్చుకొనుటకు వేరువేరు పేర్లుపెట్టుకొనవలెను. అనగా నొక పార్టీని రామజట్టు, రెండవపార్టీని రావణజట్టుఅనిగాని లేదా ఆటఆడుకొనేవారికి యిష్టమువచ్చిన పేర్లుగాని పెట్టుకోవలెను. రెండుపార్టీలలోనుంచి యొక్కొక్కని తీసికొని వీరిద్దరిని వేగులవాండ్లుగా యేర్పరచవలెను. బాలభటోపాధ్యాయుఁడుగాని లేక యొకమధ్యవర్తిగాని గమ్యస్థానముగా నొకస్థలమును యేర్పరచి యచ్చట ఆతను నిలుచుండును. ఆటయాడుకొను స్థలము అడివియైనయెడల దానికి మధ్యప్రదేశమునగాని, లేక బస్తీగాని పల్లెగాని యయిన యెడల చాలాదారులు కలసియున్న కూడలిగాని గమ్యస్థానముగా యేర్పరచవలెను. వేగులవాండ్లుగా యేర్పరచబడిన వారిద్దరు గమ్యస్థానమునకు రెండుమైళ్ళ దూరమునుంచి యెదురు బదులుగా బయలుదేరి యెదురిపార్టీవారిచేత పట్టుబడకుండ గమ్యస్థానము జేరప్రయత్నించవలెను. మిగతా రెండుపా

లవారందఱు గమ్యస్థానమునకు రెండువందల గజముల దూరమున నిలువఁబడి తమ యెదురుపార్టీలోని వేగుల వాఁడు గమ్యస్థానము చేరకుండ పట్టుకొనుటకు ప్రయ త్నించవలెను. యేపార్టీలోని వేగులవాఁడు తన యెదురిపార్టీవారిచేత పట్టుబడకుండ గమ్యస్థానము చేరునో ఆపార్టీవారు గెలిచినట్లు యెంచవలెను. వేగుల వానిని పటుకొనుట అనగా చేతితో పట్టుకోవలెను. కొట్టుకొనఁ గూడదు. ఈ ఆటవలన బుద్ధివికసించును. పరుగెత్తుటవలన దేహమునకు ఊపిరితిత్తులకు బలముగలుగును.

౪ అంచెటపా

ఈ యాటలో భటులను రెండుపార్టీలుగా విభజించవలెను. రెండుపార్టీలకు యిద్దరునాయకులనుగాని పెద్ద యుజ్జీలనుగాని నియమించవలెను. బాలభటోపాధ్యాయుఁడు యిద్దరునాయకులకు చెరియొక యుత్తరమును వ్రాసియిచ్చి ఆటయాకుస్థలమునకు రెండులేక మూఁడు మైళ్ళ దూరములోనున్న యొకమనిషికిచ్చి జవాబు తీసుకొని రమ్మనమని చెప్పవలెను. ఏపార్టీవారుముందు జవాబు తీసుకొని రాగలుగుదురో యా పార్టీవారు గెలిచినటుల యెంచవలెను. ఆటయాడువిధము:— నాయకుఁడు ఉపాధ్యాయుఁడుత్తరమిచ్చిన తక్షణము తన మనుష్యులను తాను బయలుదేరు స్థలమునకున్ను చేరవలసిన గమ్యస్థానమునకున్ను మధ్యనున్న ముఖ్యమైనస్థలముల లోనుంచి యంచెలమీఁద యుత్తరమును గమ్యస్థానము చేర్చి తిరిగి జవాబు తీసికొని రావలెను. ఏపార్టీవారు మరుకుగా బాలభటుని పరుగు పరుగిడగలరో ఆపార్టీవారు గెలుపొందెదరు.

౫ ద్రోహియొక్క యుత్తరము

ఈ యాటముఖ్యముగా పెద్దయడవిలోగాని చిట్టడవిలోగాని లేక మామూలు ప్రదేశములోగాని యాడవచ్చును. ఆటయాడువారినందఱిని రెండుపార్టీలుగా విభజించి, వేరువేరు నామధేయములను పెట్టవలెను. బాలభటోపాధ్యాయుఁడు రెండుపార్టీలలోనున్న కుఱ్ఱవాళ్ళలో తన యిష్టమువచ్చిన వానిని ద్రోహిగానియమించి, వానిచేతికొక యుత్తరమునిచ్చును. ఉత్తరమిచ్చిన సంగతి యుపాధ్యాయునికి ద్రోహిగా నియమింపఁబడిన కుఱ్ఱవానికిని తప్ప తదితరులకుఁ దెలియఁగూడదు. ద్రోహిగా నియమింపబడిన కుఱ్ఱవాఁడు యేపార్టీలో చేరినదియు ఉపాధ్యాయునకు తక్క తదితరులకు తెలియదుగనుక రెండుపార్టీలలో నున్నవారందరూజాగ్రత్తగాచూచుచు ద్రోహియెవరైనది కనుఁగొనుటకు ప్రయత్నించవలెను. ఉపాధ్యాయుఁడు రెండుపార్టీలనూ వేర్వేరుమార్గములకు పంపించి పదిహేను నిముషములకాలము యివ్వవలెను. ఈలోపుగ రెండుపార్టీలవారును తమపార్టీవారిని జాగ్రత్తగా కనిపెట్టుచూ సాధ్యమైనంత దూరము వెళ్ళిపోవలెను. ఈలా వెళ్ళు సమయములోనే, ద్రోహిగా నియమింపఁబడిన కుఱ్ఱవాఁడు కొంచెము తప్పించుకొని వెళ్ళి తనచేతికిచ్చిన యుత్తరము నెవ్వరికిఁ తెలియనివ్వకుండ నొకచోటదాఁచి, దాఁచినటుల బాలభటోపాధ్యాయున కొక గుర్తుద్వారా తెలియఁజేయవలెను. ఆలా తెలియఁజేసినతరువాత ఉపాధ్యాయుఁడొక ఈలను వేయవలెను. అప్పటినుంచి యాటప్రారంభమగును. రెండుపార్టీలలో నున్నవారందఱికి తోకలుండవలెను. అనగా నొకచిన్నగుడ్డను వ్రేలాడులాగున వెనుకవైపు దోఁపుకొనవలెను. త్రాడు మొదలగునవి పెట్టికట్టకూడదు. ఉత్తరముదాచిన ద్రోహి ఉత్తరముదాచిన స్థలము తన పార్టీవారికిగాని యెదుఱపార్టీవారికిగాని చూచాయగా తెలిసేలాగున కొన్నిగురుతులను వేయవలెను. ఆటప్రారంభించినతరువాత ద్రోహియెవరైనదిన్ని ఉత్తరము నుంచ్చట దాచినదిన్ని కనుగొనుటకు రెండుపార్టీలవారు ప్రయత్నించవలెను. రెండుపార్టీలవారొకచోట తారసిల్లినప్పుడుగాని విడివిడిగా తారసిల్లినప్పుడుగాని యొకరితోకల నొకరు లాగివేయుటకు ప్రయత్నించవలెను. యేభటుఁడైనను తనతోకను గోలుపోయినయెడల నాభటుఁడైపోయినటుల యెంచవలెను. ఆభటుఁడు ఆటలో పాలుగొనకూడదు. నియమితకాలములో నుత్తరము కనుఁగొనిన పార్టీవానికి నాలుగు మార్కులున్నూ, యేపార్టీవారు యెన్నితోకల నవతల పార్టీవారవద్దనుంచి లాగుకొన్న - తోక కొక్కొక మార్కు చొప్పుననూ యివ్వవలెను. యేపార్టీవారు యెక్కువ మార్కులను సంపాదించితే వారు గెలుపొందినటుల యెంచవలెను.

౬ మొక్కను గుర్తించుట.

బాలభటుల నందఱి నొకచోటఁచేర్చి ఒకేరకము ఆకునుగాని మొక్కనుగాని దీసికొని రమ్మనమని చెప్పవలెను. ఇది సాధ్యమైనంతవరకు అందఱికి తెలిసినదై యుండవలెను. దానిని తీసికొని రమ్మనమని చెప్పినతక్షణము బాలభటులందఱు నడచిగాని, మఱేవిధముగాగాని వారియిష్టమువచ్చిన వైపునకు వెళ్ళి తీసుకొనిరావలెను. ఇందులో ముఖ్యముగా గమనించవలసినది యేదనగా, ముందు యేభటుఁడైతే ఆకును దీసికొని వచ్చునో యాభటుఁడు గెలుపొందినటుల యెంచవలెను.

౭ కర్రబంతి లేక కుండబంతి.

ఈయాట రెండుపార్టీలవారు యాడవచ్చును. ఈయా

టకు కావలసినవస్తువులు, ఒకకఱ్ఱ, ఒక తాడుబంతిగాని తోలుబంతి గానిచాలును. ఈయాటకు భటులు రెండుపార్టీలుగాచీలవలెను. రెండురాళ్ళను సమానప్రదేశమందొక గజముదూరముగాఁబెట్టి యారాళ్ళపైన యొక వెదురు కఱ్ఱనుంచవలెను. ఈలా యేర్పరచిన తావునుంచి పదిహేను గజముల దూరములో రెండు పార్టీలవారును యెదురుబడిగా నిలుకవలెను. ప్రతిపార్టీలోనూ బంతి విసరుట కొకరిని, బంతిని పట్టుకొనుట కొకరిని నియమించవలెను. బంతిని విసరువారు తాము నిలుచున్న స్థలమునుండియే విసరి వేయవలెను. అలా విసరునపుడు బంతి రాళ్ళమీదనుంచిన వెదురుకఱ్ఱకు తగిలి కఱ్ఱక్రింద బడులాగున గురిఁజూచి విసరవలెను. పైఁజెప్పినవిధముగా కఱ్ఱను క్రింద పడగొట్టగలిగినయెడల తన యెదరి జట్టులో బంతిని విసరుటకు నియమింపబడినవాఁడు అయిపోవును. వానిస్థలము రెండవవాఁడు ఆక్రమించును. ఒక జట్టువాఁడు బంతిని విసరినప్పుడు రెండవపార్టీయందు బంతిని పట్టుకొనుట కేర్పరుపఁబడిన భటుఁడు బంతి యొకసారి క్రిందబడి యెగిరినప్పుడు పట్టుకొనినచో- అతఁడు కఱ్ఱకు దగ్గరకువచ్చి బంతితో కఱ్ఱను క్రిందపడఁగొట్టిన యెడల యెదరపార్టీలో బంతినిపట్టుకొనుటకు నియమింపఁబడినవాఁడు అయిపోవును. అలా కొట్టినప్పుడు రెండవపార్టీలోనివారా బంతిని ఒకమారు క్రిందకిబడి లేచినప్పుడు పట్టుకోగలిగిన యెడల యిదివఱకు అయినవాఁడు బ్రదుకును. బంతి పైకి యెగిరినప్పుడు పార్టీలోనున్నవారందఱు పట్టుకొనవచ్చును. కాని వారు కఱ్ఱవద్దకు రాకూడదు. ఏ స్థలమునుండి బంతిని పట్టుకుందురో యా స్థలమునుండియే కఱ్ఱను పడగొట్టుటకు ప్రయత్నించవలెను. ఈలా ఆడగా ముందు యేపార్టీవారందఱూ అయిపోవుదురో వారు ఓడిపోయినటుల ఎంచవలెను. ఈయాటవల్ల గురి బాగుగా కుదురును.

### ౮ బంతిని ఊదుట.

ఈ ఆటకుఁ బిల్లలను రెండుపార్టీలుగా భాగించవలెను. ఆరడుగుల పొడవుగల బల్లమీద నొక "సెల్యులాయిడు" బంతిగాని లేక ఊలుబంతిగాని మరియేయితరమైన తేలికబంతిగాని బల్లమధ్య ఉంచవలెను. రెండు పార్టీలను బల్లకు చెరియొకవైపున నిలువఁబెట్టవలెను. మధ్యనున్న బంతిని నోటితో ఊది తమ యెదరవైపునుంచి క్రిందపడగొట్టుటకు ప్రయత్నించవలెను. యేపార్టీవారు అలా చేయగలిగితే ఆపార్టీవారు గెలిచినట్టు యెంచవలెను. బంతి పార్టీలు నిలుచుండినవైపునుండిగాక వేరుప్రక్కనుంచి క్రిందపడినయెడల నాబంతిని తిరిగి బల్లమధ్యనుంచి యథాప్రకారము ఆట ప్రారంభించవలెను.

### ౯ జ్ఞాపకశక్తి.

ఒక బల్లమీద యిరువదియొక్క వస్తువులనుంచి పైన గుడ్డనుకప్పివేయవలెను. తరువాత బాలభటులను బిలచి పైఁకప్పినగుడ్డను దీసివేసి యొకనిమిషముకాలము నా బల్లమీఁదనున్న వస్తువులను చూడనిచ్చి, తిరిగి బల్లమీద నుండు వస్తువులు కనుబడకుండ గుడ్డనుకప్పివేయవలెను. కప్పివేసిన రెండునిమిషములకాల మాగనిచ్చి ప్రతిభటుని బల్లమీద చూచినవస్తువు లన్నిటిని వ్రాయునటుల చేయవలెను. ఏ భటుఁడు నియమితకాలములో యెక్కువ వస్తువులపేర్లను వ్రాయునో ఆ భటుఁడు గెలిచినటుల యెంచవలెను. ప్రతి భటుఁడు పదునారు వస్తువుల పేర్లకు తక్కువలేకుండ వ్రాయవలెను. ఈ ఆటవలన జ్ఞాపకశక్తి వృద్ధియగును.

### ౧౦ బంతిని యందఁజేయుట.

ఈ ఆటకు కావలసిన వస్తువులు రెండురబ్బరుబంతులుగాని లేక రెండు ఉన్నిబంతులుగాని చాలును. ఆటనాఁడువారిని రెండుపార్టీలుగా భాగించి ప్రతిపార్టీకి యొక నాయకుని యేర్పరచవలెను. ఒక పార్టీవారిని లైనుగా నొకరివెనుక నొకరిని నిలువబెట్టవలెను. రెండవ పార్టీవారిని పైవిధముగానే మొదటిపార్టీవారి ప్రక్కన నిలువబెట్టవలెను. నాయకులు ముందు నిలుచుండవలెను. ప్రతినాయకునికి నొక బంతి యివ్వవలెను. ఉపాధ్యాయుఁడు "వెళ్ళు" అను ఉత్తరవును యిచ్చినతోడనే నాయకులు తమవద్దనున్న బంతులను కాళ్ళసందునుంచి వెనుకనున్న తన పార్టీవానికి నందఁజేయవలెను. అదేవిధముగ బంతి పార్టీలోని చివరకుర్రవాని వద్దకువరకు వెళ్ళవలెను. చివరకుర్రవాఁడు తాను బంతిని యందుకున్నతరువాత పరుగున వెళ్ళి యాబంతిని తన నాయకునికి నందఁజేయవలెను. ఏపార్టీవారు ముందు బంతిని నాయకునికి నందఁజేసెదరో ఆపార్టీవారు గెలిచినట్టు లెంచవలెను.

### ౧౧ ఘ్రాణశక్తి.

కాగితపు సంచులను కొన్నింటినిచేసి వాటిలో వివిధ సువాసనవస్తువులు పెట్టి, ఆసంచుల నన్నింటిని ఒక వరుసగా పెట్టవలెను. జట్టులోనున్న ప్రతికుర్రవానిని పిలచి సంచులను వరుసగా వాసనచూడమనిచెప్పవలెను. ప్రతిసంచిని వాసనచూచుటకు అయిదు సెకనులు కాలము మాత్రమివ్వవలెను, అన్ని సంచులను వాసనచూచిన

తరువాత నొక నిమిషకాలము నిచ్చి సంచీలలో నుంచిన వాసనవస్తువుల పేళ్లు తప్పకుండ చెప్పవలెను. ఏకుర్రవాఁడు వరుస తప్పకుండ పేర్లన్నియుఁ జెప్పునో ఆకుర్రవాఁడు గెలిచినట్లు ఎంచవలెను.

### ౧౨ తోడేళ్ల వేట.

చిన్నగుట్టప్రక్కనుగాని లేక అడవిలోగాని షుమారు ౩ లేక ౪ మైళ్ల జాగాను ఆటవాఁడుభూమిగా యేర్పరచుకొనవలెను. ఆట ప్రారంభించక పూర్వము భూమియొక్క హద్దులు ఆటవాఁడుకుర్రవాండ్లకందఱికి తెలిసియుండవలెను. నలుగురు పిల్లవాండ్రకు తోడేళ్ళు అని పేరుపెట్టి వారిని ముందుబయలుదేరివెళ్ళి వారి యిష్టమువచ్చిన జాగాను అనగా హద్దులమధ్య దాగుకొనమని చెప్పవలెను. ఈనలుగురు కలసివెళ్ళవచ్చును. లేదా విడివిడిగా వెళ్ళవచ్చును. విడివిడిగా వెళ్ళుట మంచిది. వారొకచోట దాగి కూర్చొనకూడదు. ఒకచోటనుంచి యొకచోటికి తిరుగుచుండవలెను. ఈనలుగురు బయలుదేరిన యొకఘంటకు మిగతాపిల్లలను పంపించవలెను. వీరిసంఖ్య ౧౬ కు మించియుండకూడదు. (అనగా తోడేళ్ళసంఖ్యకంటె వేటగాండ్రసంఖ్య నాలుగురెట్లకంటె యెక్కువ యుండగూడదు. ఎన్ని తోడేళ్ళను యేర్పరచుకొన్నను, దానికి నాలుగురెట్లు వేటగాండ్రుండవలయును.) వీరిని వేటగాండ్రనిపిలువవలెను. వీరుకూడా కలసివెళ్ళవచ్చును. లేదా విడివిడిగా వెళ్ళవచ్చును. ఇద్దఱిద్దఱు వెళ్ళుట మంచిది. ఆటవిధమేమన వేటగాండ్రు తోడేళ్ళను వెదికి పట్టుకొనవలెను. తోడేళ్ళకును, వేటగాండ్రకును లేదా కనుపించుటకుగాను తోడేళ్ళకు ఎఱ్ఱగుడ్డయున్నూ, వేటగాండ్రకు పచ్చగుడ్డయున్నూ భుజములకు తగిలించుకొనవలెను. వేటగాండ్రు తోడేళ్ళను పట్టుకొనుట అనగా ముట్టుకొనిన చాలును.

— కావలి శంకరరావు,
ఆంధ్రరాష్ట్రీయ సహాయ కమీషనరు.

## కవాతు.

భటులు కవాతును విశేషముగా చేయనక్కరలేదు. కాని బాలభటసైన్యమునుగాని దళమునుగాని యొకవైపునుండి మరియొక వైపునకు నతిత్వరితముగా క్రమము దప్పకుండ తీసుకొనిపోవుట కది కొంతవఱకు నత్యంతావశ్యకమై యున్నది. ఇంతకన్న కవాతుయొక్క యుపయోగమేమియు లేదనియు అది వట్టి నిరర్థకమైనదనియు పలువురు తలంచెదరు. కాని ఈతలంపు లెన్నటికిని సరిగావు

కవాతువలన మనకుఁ జేకూరు లాభములందు మొదటిది యేకాగ్రచిత్తము. శరీరమును యంత్రమువలె నడిపింపనట్టి కవాతువలన నేకాగ్రత యెట్లు లభింపగలదని చాలమందికి దోఁచవచ్చును. కాని యనుభవముమీఁదగాని యీసంగతి తెలియదు. కవాతును సరిగా జేయవలయునన్న మన మనస్సు నంతను సంపూర్ణముగ జేయుచున్న పనియందు లగ్నముచేసి, యితర చింతనలను దూరఁద్రోలవలయును. ఈ కార్యము సులభముగఁ జేయనగునది గాదు. కాని యట్లు మనస్సును వశముజేసికొన గలుగునెడల నెంతటిశక్తి మనకు కలుగగలదో చింతింపుడు!

కవాతువలన మనకుఁ జేకూరు రెండవలాభము శరీరమును స్వాధీనమునందుంచుట. మన చేతులు, కాళ్ళు, తల, భుజములు-ఇవియన్నేల శరీరమంతయు మనస్వాధీనము నందుండును. ఒక పనినిఁ జేయవలెనని తలంచిన వెంటనే యెంతమాత్రమును ప్రయత్నము లేకుండనే, ఆపనిని శరీరముచేయుచుండును. నీవు ఒక గుర్రమునెక్కి తిన్ననైన బాటమీద సరాసరిగా వెళ్ళుచుంటివనుకొనుము. అప్పుడు ప్రక్కనున్న యొకవీథివైపునకైన తిరుగవలయునని హఠాత్తుగా తలంచుకొనుము. తలంపుకలిగిన వెంటనే ఆవీథివైపు తిరుగుటయు, వీథిలోనికి వెళ్ళుటయు జరిగియేయుండును. అంతియకాని "నాగుర్రముయొక్క కళ్ళెమును ముందుగా కుడివైపునకు త్రిప్పవలసియున్నది. నాశరీరము యొక్క బరువును కుడివైపునకు త్రిప్పవలసియున్నది" అని యాలోచింపవుగదా. కవాతువందుగూడ ప్రతివాఁడును చేయగలిగినది యిదియేను. ఒక పనిని చేయవలెనని నీకు తలంపుకలిగిన తక్షణమే యది జరిగి తీరవలెను. ఈశరీర యంత్రము మనకు సంపూర్ణముగ స్వాధీనము నందుండినగాని యీ కార్యము జరుగదు. శరీరావయవములకు సంబంధించిన యెంతచిన్న కదలికయైన నెట్టి కొఱంతయు లేకుండ, కవాతు వలననే సంభవము కాగలదు.

దీనికి బిమ్మట కవాతువలన లభ్యమగునది నీయాకారము చురుకుదనమును గలిగియుండుటయు, నీయందు నీకుండవలసిన గౌరవసూచకమగు వైఖరితో నిటారుగ నిలఁబడియుండుటయును.

కవాతువలన సహకారముగూడ నలవడును. అందఱును నొక్కసారి యొక్కరూపమున నొకకార్యముఁ జే

య నలవాటు లభించును. ఉత్తరువును దక్షణమే అందఱును రేక కాలమునఁ జేయఁగలుగుదురు. ఉత్తరువు వెలువడునప్పటికి సిద్ధపడియుండుటగూడ లభ్యమగును. ఇదిగాక వారు చురుకుగలవారగుటకును, శీఘ్రముగ మనలవడుటకును యిదిమిక్కిలి యుపయోగకరముగ నుండును; దేహమును కాపాడునట్టి కండరముల కది పుష్టిని గలుగఁజేయును; వంగునట్టి స్థితియుండుచక దేహమును నిలువున నిలఁబడునట్లుంచుటవలన, హృదయకోశమును, ఊపిరితిత్తులును యెక్కువగా నాడుటకుఁ దగిన సావకాశముండును; అందువలన శరీరమందలి యవయవములు సరియైన స్థితియందుండి, యాహారము చక్కగా జీర్ణమగును. ఎవ్వరైనఁగాని శరీరమును వేలవ్రేసికొనునట్లుంచినయెడల నందుండు యవయవములెల్ల మందగించి యవి తమపనులను యుక్తముగా నెరవేర్పఁజాలకుండును; అట్టివారు బలహీనులై తరుచుగా జబ్బుపడుచుందురు. సాధారణముగాఁ బిల్లలందఱును శరీరమును వ్రేలవేసికొనియుండుటకే నలవాటుపడుటను చూచుచుందుము; అందువలన వారిచేత తగినంత శరీరపరిశ్రమను చేయించి యీ దురలవాటును పోగొట్టవలెను.

నిలిచియుండునప్పుడు వంగియుండక, నిటాలున నిలుచుండుము. కూర్చున్నప్పుడు నడుమును వంచకుము; నడుమును వంకరలేకుండా నిటాలున నిలఁబెట్టుము. నీవు నడుచుచున్నను, నిలఁబడియున్నను, కూర్చునియున్నను శరీరమును వ్రేలాడునట్లుంచక, చురుకుగానుంచినయెడల నీమనస్సుగూడ చురుకుగానుండును. వ్రాసికొనుటకు బల్లమీఁదకు వంగినను, లేక నేదైన వస్తువును తీసికొనుటకు క్రిందకు వంగినను వీపును యెంతమాత్రమును వంచకుము.

పైన వివరించిన యుపయోగము లన్నియు కలఁగవలెనన్న కవాతు లోపరహితముగ నుండవలెను. ప్రారంభమునందే లోపరహితముగ నేకార్యమైనను యుండుట యసంభవము. కవాతునందు ప్రతి స్వల్పవిషయమును గూర్చియు నెక్కువగా శ్రద్ధను తీసికొనుట యత్యంతావశ్యకము; అట్టి స్వల్పవిషయములే యమూల్యములగు ఫలితములను గలుగఁజేయును. కవాతుచేయు కాలమందంతటను విశేషశ్రద్ధను గలిగియుండుము; ఉత్తరువులను శ్రద్ధగా వినుము; పిమ్మట వానిని శ్రద్ధగా చేయుము. ప్రతిపనిని ఖరాగా చేయుము. ఖరాగా చేయుట యనగా లోపరాహిత్యముగాఁ జేయుటయే. నీలక్ష్యమును చెదరనీయకుము. ఏదైన వచ్చుచున్నదనికాని, నీవు చేయుపనులను యెవరయిన చూచుచున్నారనిగాని తలంచి, చుట్టుప్రక్కలకు నీదృష్టిని మరల్చకుము. నీపటాలమును యెవరైనఁ జూచుటకు వచ్చిరనుకొనుము; అట్లువచ్చినవారెవరో జూచుటకై యేవైపునకుగాని తిరుగుటకన్న తప్పుపని మఱియొకటి యుండబోదు. కవాతు చేయునప్పుడు నీదృష్టినంతను యుత్తరువులనిచ్చునట్టి యధికారియందు లగ్నముఁజేయుము; అప్పుడు నీచుట్టుప్రక్కలనున్నవాని నన్నింటిని మరచిపొమ్ము. కవాతునందు నడచునప్పుడెల్లను రెండుసంగతులను తప్పక జ్ఞప్తియందుంచుకొనుము; మొదటిది, నీరెండు చేతులను (చేతిలో కర్రయున్నయెడల నొక్కచేతినిమాత్రమేను) ముందునకు వెనుకకు నూగించుము; తలను వ్రేలాడవేయక చక్కగా నిలబెట్టి ముందువైపునకుఁజూచుచుండుము; నేలకేసి యెప్పుడును చూడకుము.

“హుషార్” చెప్పినప్పుడు సైన్యము నిలువబడు పద్ధతినిబట్టి, వారిదిట్టదనము వెల్లడియగును; అప్పుడందఱును యెంతమాత్రము కదలికలేక నిర్జీవప్రతిమలవలె నిలబడియుండవలెను; చేతివ్రేలునైన కదల్పగూడదు; కంటిరెప్పనైన కదల్పగూడదు. దీనిని చెప్పుటకన్న చేయుట కష్టము. క్రమముదప్పక నడచుటకన్న యిట్లు నిలబడియుండుటకు నెక్కువ ఆత్మనిగ్రహము కావలసియున్నది. కదలకుండ నిలుచున్నప్పుడు, కదలుటకు కావలసిన యవసరములన్నియు నొక్కసారిగా నీమనస్సునకుఁ దట్టును. నీముడమకేదిగో చక్కిలిగింత పెట్టినట్లుండును; లేక నీముక్కుమీద నీగవాలును; కదలకుండ నిలబడియుండవలెనని నీవు తీసికొన్న దీక్షకు భంగము చేయవలెనని ప్రకృతి యనేకవిధములఁ బ్రయత్నించును. అప్పుడు నీవేమిచేయవలెను. “నాకు ముక్కులేనే లేదు, చక్కిలిగింత అసలేలేదు” అని తలంపవలెను. కావున ముఖ్యముగా నిట్టి చిన్నసంగతులే గణనకు వచ్చునవియని జ్ఞాపకముంచుకొనుము.

## నడక కవాతు.

సైనిక్=పటాలము

దల్ సే=జట్లవారీగా

కతార్ బనావ్=వరుసగా నిలువబడుడు

సీధేఖడేహో=కులాసాగా నిలువుడు

తయ్యార్=చేతులు వెనుకకట్టున నుంచి నిలువుడు. కాళ్ళు 10 అంగుళములు యెడముగా నుంచవలెను.

హుషార్=కదలకుండా నిలువుడు. చేతులు కాళ్ళు కలుపుడు. (శరీరమునకు ప్రక్కలను చేతులు అంటియుంచవలెను).

దాహినీ ఆడా ఘూమ్=కుడిమూలకు తిరుగుడు.

బాయా ఆడా ఘూమ్=ఎడమవైపునకు తిరుగుడు.

దాహినీ ఘూమ్=కుడివైపునకు తిరుగుడు
బాయా ఘూమ్=ఎడమవైపునకు తిరుగుడు.
పీచేఘూమ్=వెనుకవైపునకు తిరుగుడు.
కదం మిలావ్=కాళ్ళు కొట్టుము. (ఎడమ, కుడి)
ఛెల్=నడువుము
ధీరేఛెల్=మెల్లగా నడువుము.
జల్‌దీ ఛెల్=త్వరగా నడువుము.
ఫవుడ్=పరుగెత్తుము
టహిరో=తక్షణమే ఆగుము

దాహినాచక్కర్=పంక్తిలో కుడివైపున ఉన్నవాడు తనకు కుడివైపునకు తిరుగగా, మిగిలినవారుకూడ తమకు కుడివైపుగా వచ్చుచు మొదటివాని ప్రక్కన నిలువబడుదురు. (ఒకరి ప్రక్కనొ ఒకరు నిలబడియున్నపుడే ఈ ఉత్తరవు ఇవ్వబడును.)

బాయాచక్కర్=పంక్తిలో ఎడమవైపున ఉన్నవాడు తనకు ఎడమవైపునకు తిరుగగా మిగిలినవారుగూడ తమకు ఎడమవైపుగా వచ్చుచు మొదటివాని ప్రక్కన నిలువబడుదురు. (ఒకరిప్రక్కను మఱియొకరు నిలువబడి యున్నప్పుడే ఈ ఉత్తరవు ఇవ్వబడును.)

సామ్నే ఆవ్ లేక ఆగే ఆవ్= ముందుకు రండు. ఒకరి వెనుక మరియొకరు నిలబడియున్నప్పుడు, మొదటివాడునిలబడియుండును. మిగిలినవారు మొదటివాని ఎడమ వైపునకువచ్చి నిలువబడవలెను. (ఒకరివెనుక మరియొకరు నిలబడి యున్నప్పుడే ఈ ఉత్తరువు ఇయ్యబడును.)

సంఖ్యాగినో=సంఖ్య లెక్కపెట్టుడు. (కుడిచేతి నిండుగా)

దోకతార్ బనావ్=రెండు బారులుగా నిలువబడుడు.

చార్‌కతార్ బనావ్=నాలుగుబారులుగానిలువుడు
కతార్‌మే ఆవ్=వరుసలోనికి చేరుడు.
ఆగే ఆవ్=ముందుకు రండు

జైసేథే=ఇదివరకున్న మోస్తరుగా ఉండుము. (ఒక ఉత్తరు విచ్చి తిరిగి ఆ వుత్తరువు నివ్వనప్పటిమోస్తరుగా నిలబెట్టుటకు ఈ ఉత్తరవు నిచ్చెదరు.)

పీఛే ఆవ్=నా వెనుక రండు
సీధే బైఠో=సరిగా కూర్చుండుము.

వందే=నమస్కారము.

### శరీరపరిశ్రమ కవాతు.

వ్యాయామ్‌కీసంఖ్యాగినో=శరీర వ్యాయామమునకుగాను సంఖ్యలను చెప్పుడు. అనగా నాలుగు నాలుగుగా లెక్కపెట్టుడు (1 సంఖ్య వచ్చినవారు కదలగూడదు. 2 సంఖ్య వచ్చినవారు రెండు అడుగులు, 3 సంఖ్య వచ్చినవారు నాలుగు అడుగులు 4 సంఖ్య వచ్చినవారు ఆరు అడుగులు వెనుకకు పోవలయును).

పీఛేజావ్=ఈ అడుగుల ప్రకారము వెనుకకుపొమ్ము
బాయాఆదాఘూమ్=ఎడమ మూలకు తిరుగు
పహిలీకవాయత్=మొదటి సాధన.
దూస్రీకవాయత్=రెండవ సాధన.
తీస్రీకవాయత్=మూడవ సాధన
చౌథీకవాయత్=నాల్గవసాధన
పాంచ్‌మీకవాయత్=ఐదవసాధన
దాహినాఆదాఘూమ్=కుడిమూలకు తిరుగు
ఆగేఆవ్=ముందుకువచ్చి పంక్తిలో కలసికొనుడు

### డోలీకవాతు

తయ్యార్=మీస్థలములో నిలువబడుడు
రోగీపకడో=రోగిని పట్టుకొనుడు
రోగీఉఠావ్=రోగిని పైకెత్తుడు
రోగీనీచేరఖో=రోగిని క్రిందికి దింపుడు
డోలీపకడో=డోలీని పట్టుకొనుడు
డోలీఉఠావ్=డోలీని పైకెత్తుడు
ధీరేఛెల్=మెల్లగా నడువు
టహిరో=మెల్లగా ఆగుము
డోలీనీచేరఖో=డోలీని క్రిందికి దింపుడు

### నిప్పులార్పు కవాతు

సైనిక్ కతార్‌బనావ్=వరుసగా నిలబడుడు
హుషార్=సిద్ధముగానుండుడు
సంఖ్యాగినో=సంఖ్యను చెప్పుడు
దోకతార్‌బనావ్=రెండు వరుసలుగా నిలువబడుడు
బాల్‌టీ ఉఠావ్=బాల్చీలనుపట్టుకొనుడు
దౌడ్=పరుగెత్తు
మిల్‌జావ్=దగ్గరగారండు

---

## అక్షరావధానము:

బాలభటులొకరికొకరు దూరమునందుండి, పరస్పరము మాటలాడుకొనవలసివచ్చినప్పుడు, కొన్ని గుర్తులవలన తమభావముల దెలుపఁజేసికొనగలరు. అట్టిగుర్తులు పాగతోఁగాని, జెండాలతోఁగాని యీలలతోఁగాని, లాంతరులతోఁగాని జేయవచ్చును. ఆగుర్తులు జేసికొను విధమిక్రింద కనుబరుపఁబడినది.

### అక్షరములు.

| | |
|---|---|
| · ఇ, గుడి | - ఆ, దీర్ఘము |
| · · వత్తు | - - మ |
| · · · స | - - - ఒ |
| · · · · త | - - - - సంపూర్ణం |
| · - అ | - · ఎ |
| · · · - ఉ, కొమ్ము | - · · డ |
| · · · - వ | - · · · బ |
| · - · ర | - · - క |
| · - - ద | - - · గ |
| · - · · ల | · · - · ఫ |
| · - - · ప | - · · - హా |
| - · - - య | - - · - [illegible] |
| - · - · చ | · - · - న |
| - - · · శ | · · - - ట |
| · - - - జ | - - - · ణ |

### అంకెలు

| | |
|---|---|
| · - - - - ౧ | - · · · · ౬ |
| · · - - - ౨ | - - · · · ౭ |
| · · · - - ౩ | - - - · · ౮ |
| · · · · - ౪ | - - - - · ౯ |
| · · · · · ౫ | - - - - - ౦ |

### ఒకచోటనుండి మఱియొక చోటికి మాటలు చెప్పునప్పు డావశ్యకమైన గుర్తులు.

కు—కుడిప్రక్కకు జరుగుము
ఎ—ఎడమ ప్రక్కకు జరుగుము
పై—పైకి జరుగుము
కి—క్రిందికి జరుగుము
నీ—నీలిజండా ఉపయోగించుము
తె—తెలుపు జండా ఉపయోగించుము
దీ—దీపము చూపుము
ఎవ—నీవు ఎవరు
ఉ—ఉండు
ఏ—నీవు సిద్ధముగా నున్నావా
ఊ—కానిమ్ము, చెప్పుము, కొట్టుము.
జలే—జవాబు లేనివి
జలేప—జవాబు లేనివి పంపు
శీ—శీఘ్రముగా
నె—నెమ్మదిగా
లే—ఇంకేమియు లేవు
రా—వచ్చి వేయుము, రమ్ము
ర—అంతా రద్దుపరచుము
చా—చాలును (ఆపుము)
అం—అంకెలు
అఆ—అంకెలు ఆఖరు
పే—గ్రామము లేక మనిషి పేరు
త—మాట తర్వాత
ము—మాటముందు
మ—ఆఖరుమాట మళ్లీ తెలుపుము
- - - - - - పిలుచుట
- జవాబు
· · · · · · · చివర అక్షరము మళ్ళీ తెలుపుము
- - - - ఆరంభము
- - - - ఆఖరు
- - - - సరిగా తెలిసినది

ఈ క్రింది వానికి తప్ప మిగిలిన సమాచారము లన్నింటికిని దీర్ఘమే ( - ) జవా బొసంగబడును.

· · · · · · · దీనికి జవాబు · · · · · · ·
ర కు జవాబు ర
చా కు జవాబు చా
- - - - దీనికి జవాబు - - - -

### జండావధానము చేయునప్పుడు గమనింపవలసిన విషయములు.

జండాలతోగాని ఈలలతోగాని సంజ్ఞలు చేయునప్పుడు "వత్తు"లు మొదలగునవి లేనట్లు పైన వ్రాసిన సంజ్ఞలలో కనుపించును. కాని యీ "వత్తు" లకు వేరు వేరు సంజ్ఞల నేర్పరచినయెడల, నీయవధానము కష్టమగును. కావున కొన్ని కష్టమగు నక్షరములను రెండింటి క్రింద విభజించుకొనిన సులభముగా నుండును.

ఉదాహరణము:—"మై" అని చెప్పవలసినచోట "మయి"అని చెప్పిన వీలుగానుండును. అలాగుననే "కై" అని చెప్పవలసిన చోట "కయి" అని చెప్పవలయును.

ఒక అక్షరమునకు "వత్తు" కొట్టవలసినపుడుముందుగా అక్షరమునుకొట్టి,తరువాత"వత్తు"వచ్చుచున్న దని తెలియుటకు "రెండుబొట్లను" కొట్టవలెను. అటుతరువాత నే "వత్తును" దెలియజేయు అక్షరమును కొట్టవలెను.

ఉదాహరణము:—"క్చా" అని చెప్పవలసినపుడు ముందు "క" యును "దీర్ఘ"మును కొట్టవలెను; తరువాత "వత్తు" వచ్చుచున్నదని తెలియుటకు "రెండు బొట్లు" కొట్టి "చ" కారము కొట్టవలెను. అప్పుడు "క్చా" అని చెప్పిన వారమగుదుము.

# ఆంధ్ర దేశ సేవకా సంఘము

ఆంధ్రదేశ మంతటను బాలభటోద్యమమును వ్యాప్తముగావించుటకుగాను బాలభటోపాధ్యాయుల శిక్షాస్థానములను ఈ క్రిందిజిల్లాలయం దేర్పరచుచున్నారము. మిగిలిన జిల్లాలయందు గూడ వెంటనే యేర్పరచుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

| జిల్లా. | గ్రామము. | మొదలు పెట్టు తేది. | రాదలచినవారు ఎవరికి వ్రాసికొన వలసినది. | శిక్షకులు. |
|---|---|---|---|---|
| కడపజిల్లా | కోడూరు | 27-8-19 | వేదం వేంకటకృష్ణశర్మగారు | అయ్యంకి వేంకటరమణయ్యగారు, కావలి శంకరరావుగారు, వెణుతురిమిల్లి శ్రీరామారావుగారు. |
| చిత్తూరుజిల్లా. | తిరుత్తని | 22-9-19 | బూదూరు రామానుజులు రెడ్డిగారు, చివ్వాడ, ఆగుగులం పోష్టు | వార్నాసి వేంకటసుబ్బారావుగారు, మొవ్వ నాగేశ్వరరావుగారు, వగైరా. |
| గుంటూరుజిల్లా | గుంటూరు | 26-9-19 | చట్టినరసింహారావుగారు, గుంటూరు | కావలి శంకరరావుగారు, వెణుతురిమిల్లి శ్రీరామారావుగారు, రాజా. యం. నరసింగరావుగారు, శర్మగారు. |

అ. వేంకటరమణయ్య,
ఆంధ్రరాష్ట్రీయ కమీషనర్.


## ప్రకృతి

ప్రాకృత చికిత్సాపద్ధతులను బోధించు నారోగ్యకరపత్రిక. పశ్చిమఖండవైద్యవేత్తల వ్యాసములకు భాషాంతరీకరణములు, ప్రాకృతచికిత్సవలన నారోగ్యమునొందినవారి వృత్తాంతములు ప్రకటింపఁబడును. ఆరోగ్యముకోరువారలకు, ముఖ్యముగా తొట్టిస్నానములుచేయు వారల కత్యంతోపయుక్తము. పత్రిక 1కి 0-1-6. 12 పత్రికలకు ముందుగ నివ్వవలసిన చందా రు 1-0-0 చందాదారులకు "ఋషిజీవనప్రకాశ"మను గ్రంథ ముచితము. త్వరపడుడు,

చిరునామా:—నారిశెట్టి హనుమయ్య, బెజవాడ.

RSVM01A 113

# మంచిగ్రంథము లెవ్వి?

౧ అందముగ నున్నదా?
౨ మంచిభాషయందు వ్రాయఁబడెనా?
౩ మనజీవితవిధానమును తెలుపునా?
౪ మనజ్ఞానమును అభివృద్ధిచేయునా?
౫ మనవ్యవహారమునకు ఉపకరించునా?
౬ హితమునుబోధించునా?
౭ సన్మార్గజీవితమునకు సాయపడునా?
౮ మనజీవితములను సారవంతము చేయునా?
౯ ఆప్తునివలె ప్రేమింపతగియున్నదా?

ఈప్రశ్నలనన్నిఁటిని సంతృప్తిపరచగల మంచిగ్రంథములనే పఠింపవలసినదని, ప్రథమ నెల్లూరు మండలగ్రంథాలయ ప్రతినిధుల మహాసభకు అగ్రాసనాధిపత్యము వహించిన

## వావిలకొలను సుబ్బారావుపంతులుగారు,

తమ అధ్యక్షోపన్యాసమునందు శెలవిచ్చియున్నారు.

## అట్టిగ్రంథములు ఏవి?

## నవ్యభారత ఋషిపుంగవులగు

౧ లోకమాన్యతిలకు మహారాజు జీవితచరిత్ర ఉపన్యాసములు.
౨ మహాత్మా గాంధిమహాశయుని జీవితచరిత్ర ఉపన్యాసములు.
౩ లోకమాత అనీబీసెంటమ్మ జీవితచరిత్ర ఉపన్యాసములు.
౪ మహమ్మదాలీ జీవితచరిత్ర ఉపన్యాసములు.

## ఆంధ్ర కవిపుంగవులగు

నాచన సోమనాథుఁడు.
పింగళి సూరన్న.

## ఆంగ్లేయ వీరపుంగవుఁడగు

కిచనరుప్రభువు జీవితచరిత్ర.

ఈగ్రంథములను వ్రాయుచున్న కవిపుంగవుల నామములు, వెలలు, దొరకుస్థలము— మున్నగు వివరములకై రాఁబోవు గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈ పుటనే జూడుఁడు.

**మనసు ఫౌండేషన్**

**పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 113 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 2/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 61 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | No |
| లేని పేజీలు | 1-to 209 |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |